ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 26.10.2025 | సంపుటి : 12 | సంచిక : 95 | పేజీలు : 12 | వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


## ఇంటర్మీడియట్ పరీక్షలు ఫిబ్రవరి 18 నుంచి



- ఇంటర్ విద్యావిధానంలో మార్పులు
- వచ్చే ఏడాది నుంచే అమల్లోకి కొత్త సిలబస్

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్ విడుదలయ్యింది. 2026 ఫిబ్రవరి 25 వ తేదీ నుంచి మార్చి 18 వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తామని ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలను ఆయన మీడియాకు మిగతా 2లో..

## మద్యం దుకాణాల డ్రాకు హైకోర్టు అనుమతి



- 27న యధావిధిగా కలెక్టర్ల సమక్షంలో డ్రాలు
- ఏర్పాట్లు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ ఆదేశాలు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో మద్యం షాపుల డ్రాకు అడ్డంకులు తొలగిపోయాయి. వైన్ షాపుల డ్రాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో అక్టోబర్ 27న యధావిధిగా మద్యం షాపుల డ్రా పక్రియను ఎక్సైజ్ శాఖ నిర్వహించనుంది. కాగా, వైన్ షాపుల కేటాయింపు కోసం గడువు ముగిసిన తర్వాత మిగతా 2లో..

## 42శాతం రిజర్వేషన్ భవిష్యత్ తరానికి పునాది

ఢిల్లీలో డీసీసీ అధ్యక్షుల నియామకంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణుగోపాల్‌తో సమావేశమైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్,పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్ రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్.

### ఈ నిర్ణయంతో ప్రజల్లో కాంగ్రెస్‌కు ఆదరణ పెరిగింది
### ఏఐసీసీకి వివరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కూడా సునాయాసంగా గెలుస్తామని వెల్లడి
- డీసీసీ అధ్యక్షుల నియామక విషయంలో సుదీర్ఘంగా కసరత్తు
- ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణలోని పరిణామాలపై సమాలోచనలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 25 (జనంసాక్షి) : వెనుకబడిన తరగతులకు (బీసీలు) 42శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రభుత్వ నిర్ణయానికి ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చిందని, ఈ నిర్ణయంతో ప్రజల్లో, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పార్టీకి ఆదరణ పెరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికను సైతం కాంగ్రెస్ పార్టీ సునాయసంగా కైవసం చేసుకుంటుందని దీమా వ్యక్తం చేశారు. పార్టీ నేతలతో, మంత్రులతో సమన్వయంతో ముందుకెళ్తున్నట్టు వివరించారు. ఢిల్లీలో డీసీసీ అధ్యక్షుల నియామకంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణుగోపాల్‌తో సమావేశమైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అంశాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. మిగతా 2లో..

కొత్త కోణం..





ప్రమాద సమయంలో బస్సు కార్గోలో మంటలంటుకుని పేలిపోయిన సెల్‌ఫోన్లు..

## ప్రమాదానికి ముందే బైకు డివైడర్‌ను ఢీకొంది

### ఆ తర్వాతే బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఈడ్చుకుంటూ వెళ్లింది

కార్గోలోని వందల ఫోన్లు ఒక్కసారిగా పేలడంతోనే ప్రమాదతీవ్రత పెరిగి భారీ ప్రాణనష్టం ప్రాథమికంగా గుర్తించిన ఫోరెన్సిక్ బృందాలు • కర్నూలు దుర్ఘటనలో వీడిన మిస్టరీ



అమరావతి(జనంసాక్షి):కర్నూలు శివార్లలోని చిన్నటేకూరు సమీపంలో అగ్నిప్రమాదానికి గురైన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు లగేజీ క్యాబిన్‌లో తరలిస్తున్న వందల మొబైల్ ఫోన్లు పేలడం వల్లే ప్రమాద తీవ్రత పెరిగి, భారీ ప్రాణ నష్టానికి దారితీసిందని ఫోరెన్సిక్ బృందాలు ప్రాథమికంగా గుర్తించాయి. 'తొలుత బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగానే దాని ఆయిల్ ట్యాంక్ మూత ఊడిపడి అందులోని మిగతా 2లో..

ప్రమాదానికి ముందు బంకులో పెట్రోలు నింపుకుంటున్న బైకర్ శివశంకర్

## కర్నూలు ఘటనతో నిద్రలేచిన ఆర్‌టిఏ

బస్సు ప్రమాదంతో అప్రమత్తం
ప్రైవేట్ బస్సుల్లో విస్తృత తనిఖీలు
లక్షల్లో జరిమానాలు విధింపు
ప్రైవేట్ ప్రయాణానికి దూరంగా ప్రజలు

2లో..

## మరో బస్సు ప్రమాదం



- పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్ద బస్సు బోల్తా
- ఘటనలో ఆరుగురికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

## హైదరాబాద్‌లో పోలీసుల కాల్పులు

- చాదర్‌ఘాట్‌లో సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోతున్న ఇద్దరు దొంగలు
- పట్టుకునే ప్రయత్నంలో డీసీపీ చైతన్యపై దాడికి దిగిన దుండగులు
- అప్రమత్తమైన డీసీపీ కాల్పులు జరపడంతో ఇరువురికి గాయాలు



డీసీపీ జరిపిన కాల్పుల్లో గాయపడ్డ దొంగ

హైదరాబాద్(జనంసాక్షి):నగరంలోని చాదర్‌ఘాట్‌లో కాల్పుల ఘటన కలకలం రేపింది. హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డీసీపీ చైతన్య.. సీపీ కార్యాలయంలో మీటింగ్‌కు వెళ్లి తిరిగి తన కార్యాలయానికి వెళ్తున్న క్రమంలో చాదర్ ఘాట్ వద్ద సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోతున్న ఇద్దరు దొంగలను గుర్తించారు. స్వయంగా వారిని పట్టుకునేందుకు డీసీపీ చైతన్య ప్రయత్నించగా.. ఓ దొంగ దాడికి దిగాడు. ఈ క్రమంలో డీసీపీ గన్ మ్యాన్ కిందపడ్డారు. వెంటనే డీసీపీ చైతన్య గన్‌మ్యాన్ వెపన్ తీసుకుని దొంగలపై మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. కాల్పుల్లో ఒమర్ అనే దొంగ చేయి, పొట్ట భాగంలో గాయాలయ్యాయి. తప్పించుకునే క్రమంలో నిందితుడు భవనంపై నుంచి విక్టరీ మైదానంలోకి దూకాడు. తీవ్రగాయాలతో కింద పడిపోయిన దొంగను పోలీసులు పట్టుకున్నారు. బంజారాహిల్స్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలిని సౌత్, సెంట్రల్ జోన్ డీసీపీలు స్నేహ మెహ్రా, శిల్పావళి పరిశీలించారు. దొంగతో జరిగిన పెనుగులాటలో స్వల్పంగా గాయపడిన మిగతా 2లో..

## బీహార్‌లో చొరబాటుదారులు ఉన్నారట!

- మళ్లీ అధికారమిస్తే వారిని బయటికి పంపిస్తారట!
- రాహుల్ గాంధీ వారి కోసమే యాత్ర చేశాడట!
- ఎన్నికల ప్రచారంలో అమిత్ షా వింత వ్యాఖ్యలు



పాట్నా(జనంసాక్షి):బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఖగడియా జిల్లాలో అధికార, ప్రతిపక్ష నేతలు నేడు పోటాపోటీ ప్రచార సభలు నిర్వహించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ'ను వ్యతిరేకించిందంటూ 'ఇండియా' కూటమిపై కేంద్రమంత్రి అమిత్ షా విరు చుకుపడ్డారు. ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తించి, వారి స్వదేశానికి తరలిస్తామన్నారు. బిహార్‌లో జంగల్‌రాజ్ (ఆటవిక పాలన) తిరిగి వస్తుందా? లేదా రాష్ట్రం అభివృద్ధి మార్గంలో కొనసాగుతుందా? అనేది ఈ ఎన్నిక లు నిర్ణయిస్తాయన్నారు."చొరబాటుదారులను కాపాడేందుకు కాంగ్రెస్ అగ్రనే త రాహుల్ గాంధీ ఎన్ని యాత్రలైనా నిర్వహించనివ్వండి. ఏం చేసినా.. వారిని ఆయన రక్షించలేరు. ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తిస్తాం. ఓటరు జాబితా నుంచి పేరును తొలగిస్తాం. వారి స్వదేశానికి పంపిస్తాం" అని అమిత్ షా స్పష్టం చేశారు. ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కేవలం తన కుటుంబ మిగతా 2లో..



## శతక్కొట్టిన రోహిత్

రాణించిన కోహ్లీ ..

### ఆస్ట్రేలియాతో మూడో వన్డేలో భారత్ గెలుపు..

ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్ల్లో ఓడిన టీమ్‌ఇండియా మూడో వన్డేలో ఘన విజయం సాధించింది. తొలుత కంగారూలను 236 పరుగులకే కట్టడి చేసిన భారత జట్టు.. 38.3 ఓవర్లలోనే ఒకే వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. రోహిత్ సెంచరీ చేయగా విరాట్ కోహ్లీ 74పరుగులతో హాఫ్ సెంచరీ సాధించాడు. రోహిత్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు.

## వేతనాల చెల్లింపుపై ఆర్థికశాఖ కీలక నిర్ణయం

ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశాలు

లేకుంటే జీతాలు నిలిచిపోతాయని హెచ్చరిక



2లో..



## నాపై కావాలనే కుట్రచేసి బయటకు గెంటేశారు

- నా దారి నేను వెతుక్కుంటున్నా
- నిజామాబాద్‌లో నా ఓటమిలో కుట్ర ఉందో లేదో భారాస నాయకులే చెప్పాలి
- హామీల అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం
- గత పదేళ్లలో అమరుల కుటుంబాలకు దక్కాల్సిన గౌరవం, న్యాయం దక్కలేదు : కవిత

నిజామాబాద్(జనంసాక్షి):గత 20 ఏళ్లుగా కేసీఆర్, భారత రాష్ట్రసమితి పార్టీ కోసం పని చేశానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. అయితే తనను కుట్రలతో బయటకు పంపారని అన్నారు. శనివారం జాగృతి జనం బాటను నిజామాబాద్ నుంచి ప్రారంభించారు. మిగతా 2లో..



## జూబ్లీహిల్స్ నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర సాగాలి

- ఉపఎన్నికలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలి
- లేదంటే అదే నిర్లక్ష్యంతో పాలన సాగిస్తారు: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. రెండేళ్లలో కేసీఆర్‌ని తిట్టడం తప్ప సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణకు ఏమి చేశారని నిలదీశారు. రాష్ట్రంలో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చిందని కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం అవుతుందని చెప్పారు. మోసాన్ని మోసంతోనే జయించాలని కేటీఆర్ పేర్కొన్నారు. జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ డివిజన్ బీజేపీ పార్టీ మాజీ అధ్యక్షుడు తోట మహేష్ మిగతా 2లో..

## 30 కోట్ల మంది ఎల్ఐసీ పాలసీదారులను కేంద్రం మోసం చేసింది

### వారి సేవింగ్స్ దుర్వినియోగం చేశారు • కాంగ్రెస్ ఆరోపణలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్ర ప్రభుత్వం 30 కోట్ల మంది లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ పాలసీదారుల సేవింగ్స్‌ను దుర్వినియోగం చేసిందని కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్‌నకు ప్రయోజనం చేకూర్చేందుకు సామాన్య పౌరుల జీవితకాల సేవింగ్స్‌ను కేంద్రం దుర్వినియోగం చేసిందని మండిపడింది. ఎల్ఐసీతో అదానీ గ్రూప్‌లో బలవంతంగా పెట్టుబడులు పెట్టించారని ఆరోపిస్తూ.. దీనిపై పార్లమెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేసింది. అయితే ఈ ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం లేదా అదానీ గ్రూప్ నుంచి ఎటువంటి స్పందన రాలేదు."30 కోట్ల మంది ఎల్ఐసీ పాలసీదారుల పొదుపు మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం అదానీ గ్రూప్‌లో పెట్టుబడులుగా పెట్టించి.. ఎలా దుర్వినియోగం చేసిందనే విషయానికి సంబంధించిన పలు విషయాలు ఇప్పుడే వెలుగులోకి వచ్చాయి. 2025 మేలో వివిధ అదానీ గ్రూప్ కంపెనీలలో సుమారు రూ.33 వేలకోట్ల ఎల్ఐసీ నిధులను పెట్టుబడి పెట్టడానికి భారత అధికారులు మిగతా 2లో..

## వలసదారులపై మరో పిడుగు



ఇకపై వారు దేశంలోకి రాకపోకల సందర్భంగా ఎంట్రీ, ఎగ్జిట్‌లో ఫొటోలు తీయనున్న అమెరికా అధికారులు

వాషింగ్టన్(జనంసాక్షి):వలసల నియంత్రణ దిశగా ట్రంప్ యంత్రాంగం మరో నిర్ణయం తీసుకుంది. అమెరికాయేతర పౌరులు దేశం వీడే లేక దేశంలోకి అడుగుపెట్టే సమయంలో అధికారులు వారి ఫొటోలు తీయనున్నారు. గ్రీన్‌కార్డుదారులతో పాటు వలసదారులందరికీ ఈ కొత్త నిబంధన వర్తించనుంది. ఫెడరల్ రిజిస్టర్‌లో తాజాగా ఈ నిబంధనలను ప్రచురించారు. వాటి ఆధారంగా ఏ మార్గంలో అయినా మిగతా 9లో..

## దంచికొట్టిన వాన

హైదరాబాద్‌లో పలు ప్రాంతాలు జలమయం



హైదరాబాద్(జనంసాక్షి): నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం కాస్త ఎండగా ఉన్నా, అంతలోనే ఆకాశం మేఘావృతం కావడంతో ఉన్నట్టుండి వర్షం కురిసింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వాన దంచికొట్టింది. బోరబండ, రెహమాత్ మిగతా 2లో..

## ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి 18 నుంచి..

తెలిపారు. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో కూడా ల్యాబ్స్, ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఉంటాయని, ఇంగ్లీష్‌లో ఉన్నట్లుగానే మిగతా భాషల్లోనూ ప్రాక్టికల్స్ నిర్వహిస్తామని వెల్లడించారు. 12 ఏళ్ల తర్వాత ఇంటర్ సిలబస్‌లో మార్పులు జరగబోతున్నట్లు తెలిపారు. మ్యాథ్స్, ఫిజిక్స్ , కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సిలబస్ మారబోతున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ విద్యా విధానంలో మార్పులతో పాటు పరీక్షల తేదీలను ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య విడుదల చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో కూడా ల్యాబ్స్ , ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉంటాయి.. అలాగే, ఇంటర్ సిలబస్ లోనూ మార్పులు చేసినట్లు ప్రకటించారు. 12 సంవత్సరాల తర్వాత మ్యాథ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బొటనీ, జువాలాజీలో సిలబస్ లో మార్పులు జరిగాయని ప్రకటించారు. హ్యూమానిటీస్ సబ్జెక్టుల్లో యాక్టివిటీ బేస్డ్ సిలబస్ ఏప్రిల్ మొదటి వారంలో బుక్స్ అందుబాటులోకి వస్తాయని ఇంటర్ బోర్డు సెక్రటరీ వెల్లడించారు. అలాగే, కొత్త కోర్స్ కోర్స్ ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య చెప్పుకొచ్చారు. ఇంగ్లీష్ లో ఉన్నట్టు గానే మిగతా లాంగ్వేజెస్ లోనూ ప్రాక్టికల్స్ ఉంటాయి. ఇకపై 80 మార్కులు ఎక్స్‌టర్నల్, 20 మార్కులు ఇంటర్నల్ మార్కులుగా ఉంటాయన్నారు. ల్యాబ్ ప్రాక్టికల్స్ ప్రతి సంవత్సరం 15 మార్కుల చొప్పున నిర్వహించనున్నారు. అంతేకాకుండా, ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నట్లు ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య తెలిపారు.

## హైదరాబాద్‌లో పోలీసుల కాల్పులు

డీసీపీ చైతన్యకు మలక్‌పేట ఆసుపత్రిలో చికిత్స అందించారు.

**కాల్పుల్లో ఇద్దరు దొంగలు గాయపడ్డారు: సీపీ సజ్జనార్**

హైదరాబాద్: చాదర్‌ఘాట్ కాల్పుల ఘటనలో ఇద్దరు దొంగలు గాయపడ్డారని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఘటనా స్థలిని పరిశీలించిన అనంతరం సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. గాయపడి, పోలీసులకు చిక్కిన దొంగ ఒమర్‌పై 25 కేసులతో పాటు రౌడీషీట్ ఉందని సీపీ తెలిపారు. దొంగలను పట్టుకునే క్రమంలో డీసీపీ చైతన్య రెండు రౌండ్లు కాల్పులు జరిపారని చెప్పారు. సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోతున్న ఇద్దరు దొంగలను డీసీపీ చైతన్య, ఆయన గన్‌మ్యాన్ గమనించి పట్టుకునేందుకు ప్రయత్నించారు. దొంగలు.. గన్‌మ్యాన్‌పై కత్తితో దాడికి పాల్పడ్డారు. ఈక్రమంలో గన్ మ్యాన్, డీసీపీ చైతన్య కింద పడిపోయారు. వెంటనే తేరుకున్న డీసీపీ, గన్‌మెన్ దొంగలపై కాల్పులు జరిపారు. కాల్పుల్లో ఇద్దరు నిందితులు గాయపడ్డారు. నిందితుడు ఒమర్‌పై రెండు సార్లు పీడీ చట్టం కింద కేసులు నమోదయ్యాయి. 2016లో కామటిపురం పీఎస్‌లో నమోదైన పీడీ యాక్టు కేసులో ఏడాది జైల్లో ఉన్నాడు. 2020లో హుస్సేనీ ఆలమ్ పీఎస్‌లో పీడీ యాక్ట్ కేసులో ఏడాదిపాటు చంచల్‌గూడ జైల్లో ఉండి బయటకు వచ్చిన తర్వాత కూడా ఒమర్ ప్రవర్తన మారలేదు. ఆ తర్వాత కాలాపత్తర్ పీఎస్‌లో రెండు కేసులు నమోదయ్యాయి" అని సీపీ తెలిపారు.

## మద్యం దుకాణాల డ్రాకు హైకోర్టు అనుమతి

కూడా దరఖాస్తులు తీసుకున్నారని పేర్కొంటూ ఐదుగురు మద్యం వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై శనివారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ నెల 18వ తేదీ వరకు ఉన్న మద్యం టెండర్ల గడువును 23వ తేదీ వరకు పెంచారని పిటిషనర్ తరఫు న్యాయవాదాలు హైకోర్టుకు తెలిపారు. 23వ తేదీకి పెంచడం వల్ల ఐదువేలకు పైగా దరఖాస్తులు అదనంగా వచ్చాయని వివరించారు. ఇది తెలంగాణ ప్రొహిబిషన్ ఎక్సైజ్ యాక్ట్ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఆర్టికల్ 12 (5) ప్రకారం గడువు పెంచడానికి అవకాశం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వివరించారు. ఈ నెల 23న జరగాల్సిన లక్కీ డ్రాను కూడా 27వ తేదీకి పొడిగించారని తెలిపారు. ప్రభుత్వం తరుపున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ.. గడువు పెంచడం అనేది తెలంగాణ ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయమని తెలిపారు. గడువు పెంచే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని వివరించారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు ప్రభుత్వ వాదనలతో ఏకీభవించింది. ఈ మేరకు మద్యం దుకాణాల డ్రా ప్రక్రియ నిర్వహించేందుకు ప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది. హైకోర్టు నుంచి మద్యం షాపుల డ్రాకు అనుమతి రావడంతో డ్రా ప్రక్రియ ఏర్పాట్లను చేసుకోవాల్సిందిగా ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు 27న మద్యం షాపుల డ్రాకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు మొదలుపెట్టారు. జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా సోమవారం ఉదయం 11 గంటలకు మద్యం షాపుల డ్రా ప్రకియ నిర్వహించ నున్నారు. కాగా, తెలంగాణలోని 2620 మద్యం షాపులకు 95,137 దరఖాస్తులు వచ్చాయి. మద్యం షాపులకు వచ్చిన దరఖాస్తులను డ్రా పద్ధతిలో ఎంపిక చేసి లైసెన్స్‌లు జారీ చేయనున్నారు. డ్రా ఏర్పాట్లను పూర్తి చేయాల్సిందిగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 2,620 మద్యం షాపుల కోసం భారీ స్థాయిలో 95,137 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాల వారీగా ఈ నెల 27న ఉదయం 11 గంటలకు దరఖాస్తుదారులు, ప్రజల సమక్షంలో జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా మద్యం షాపుల డ్రా ప్రక్రియ కొనసాగనుంది. ఈ డ్రా ద్వారా కొత్త లైసెన్స్‌దారుల ఎంపిక జరగనుంది. అదిలాబాద్‌లో 40 మద్యం షాపులకు 771 దరఖాస్తులు, కోమురం భీం అసిఫాబాద్‌లో 32 షాపులకు 680, మంచిర్యాలలో 73 షాపులకు 1712, నిర్మల్‌లో 47 షాపులకు 3002, జగిత్యాలలో 71 షాపులకు 1966, కరీంనగర్‌లో 94 షాపులకు 2730, పెద్దపల్లి 77 షాపులకు 1507, రాజన్న సిరిసిల్లలో 48 షాపులకు 1381, ఖమ్మంలో 122 షాపులకు 4430, కొత్తగూడెం 88 షాపులకు 3922, జోగులాంబ గద్వాలలో 36 షాపులకు 774, మహబూబ్‌నగర్‌లో 90 షాపులకు 2487, నాగర్‌కర్నూల్‌లో 67 షాపులకు 1518, వనపర్తిలో 37 షాపులకు 757, మెదక్‌లో 49 షాపులకు 1920, సంగారెడ్డి 101 షాపులకు 4432, సిద్దిపేటలో 93 షాపులకు 2782, నల్లగొండ 155 షాపులకు 4906, సూర్యాపేట్‌లో 99 షాపులకు 2771, యాదాద్రి భువనగిరిలో 82 షాపులకు 2776, కామారెడ్డి 49 షాపులకు 1502, నిజామాబాద్ 102 షాపులకు 2786, మల్కాజిగిరిలో 88 షాపులకు 5168, మేడ్చల్‌లో 114 షాపులకు 6063, సరూర్‌నగర్‌లో 134 షాపులకు 7845, శంషాబాద్‌లో 100 షాపులకు 8536 వికారాబాద్ 59 షాపులకు 1808, జనగామాలో 47 షాపులకు 1697, భూపాలపల్లి 60 షాపులకు 1863, మహబూబాబాద్‌లో 59 షాపులకు 1800, వరంగల్ రూరల్‌లో 63షాపులకు 1958, వరంగల్ అర్బన్‌లో 65 షాపులకు 3175 దరఖాస్తులు వచ్చాయి.

## బీహార్‌లో చొరబాటుదారులున్నారట!

ప్రయోజనాలపైనే దృష్టి సారించారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నీతీశ్‌కుమార్ మాత్రం రాష్ట్ర సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఆర్జేడీ పాలనలో హత్యలు, దోపిడీలు తదితర అనేక నేరాలు యథేచ్ఛగా జరిగాయని, కానీ.. ఎన్డీయే హయాంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని చెప్పారు. జంగల్‌రాజ్ తిరిగి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకోవడం లేదన్నారు.

బిహార్‌ను నిర్మిస్తాం: తేజస్వీ యాదవ్

కేవలం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకే ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, బిహార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తెలిపారు. ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే.. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు 20 రోజుల్లోపు చట్టం తీసుకొస్తామన్నారు. 20 నెలల్లో నియామకాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఖగడియాలోని గోగ్రీలో నిర్వహించిన ప్రచార సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. బిహార్‌ను నంబర్ వన్‌గా మార్చేందుకు.. పెట్టుబడులు తీసుకురావడం, విద్యను ప్రోత్సహించడం, వైద్య సౌకర్యాలను మెరుగుపర్చడం అవసరమని పేర్కొన్నారు.

## 42శాతం రిజర్వేషన్ భవిష్యత్ తరానికి పునాది



ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్ రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ ఉన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, సంఘటన్ సృజన్ అభియాన్ పురోగతి, జిల్లా స్థాయి నాయకత్వ మార్పులపై విశ్లేషణాత్మక చర్చలు జరిగాయి. ప్రధానంగా డీసీసీ అధ్యక్షుల నియామక విషయంలో సుదీర్ఘ కసరత్తు జరిగింది. సీఎం రేవంత్, భట్టి, మహేష్ కుమార్‌గౌడ్‌తో వేణుగోపాల్ వేర్వేరుగా సమావేశం కాగా.. డీసీసీ, మున్సిపల్ కార్పొరేషన్లకు షార్ట్ లిస్టు చేసిన అభ్యర్థుల గురించి అభిప్రాయాలు సేకరించారు. అన్ని జిల్లాల్లోని స్థానిక కార్యకర్తలతో విస్తృత సంప్రదింపుల తర్వాత ఏఐసీసీ పరిశీలకులు నివేదికలు సమర్పించారు. వీటన్నింటినీ క్రోఢీకరించిన తర్వాత డీసీసీ జాబితా ఖరారు కానున్నట్లు తెలిసింది. క్షేత్రస్థాయి నివేదికలు, ఏఐసీసీ పరిశీలకులు అభిప్రాయాల అనంతరం డీసీసీ అధ్యక్షులను ప్రకటించనున్నట్టు సమాచారం.

**పలు అంశాలపైనా ఆరా**

ఇటీవల తెలంగాణ కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న పరిణామాలూ, వివాదాలపైనా అధిష్ఠానం ఆరాతీసింది. ప్రతిపక్షాలకు ఊతమిచ్చేలా మంత్రుల మధ్య చోటుచేసుకున్న సమన్వయ లోపాలపై కేసీ వేణుగోపాల్ ఆరాతీశారు. రాష్ట్ర మంత్రివర్గంలో సమన్వయం లేదని ఇటీవల ప్రతిపక్షాలు బలంగా ఆరోపించడం దీనికి బలం చేకూర్చింది. మరోవైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికలు వంటి రాష్ట్రానికి సంబంధించిన కీలకమైన అంశాలపై హైకమాండ్ వివరాలు సేకరించింది.

## ప్రమాదానికి ముందే బైకు డివైడర్‌ను ఢీకొంది

పెట్రోల్ కారడం మొదలైంది. అదే సమయంలో బస్సు కింది భాగంలో ద్విచక్రవాహనం ఇరుక్కుపోవడంతో, దాన్ని బస్సు కొంత దూరం ఈడ్చుకెళ్లింది. ఈ క్రమంలో నిప్పురవ్వలు చెలరేగడం, దానికి పెట్రోల్ తోడవడంతో మంటలు ప్రారంభమయ్యాయి. ఇవి తొలుత లగేజీ క్యాబిన్‌కు అంటుకున్నాయి. అందులోనే 400కు పైగా మొబైల్ ఫోన్లతో కూడిన పార్సిల్ ఉండటంతో అధిక వేడికి ఆ ఫోన్ల బ్యాటరీలన్నీ ఒక్కసారిగా పేలాయి. ఆ మంటలు లగేజీ క్యాబిన్ పై భాగంలోని ప్రయాణికుల కంపార్ట్‌మెంట్‌కు వ్యాపించాయి. దీంతో లగేజీ క్యాబిన్‌కు సరిగ్గా పైన ఉండే సీట్లలో, బెర్తుల్లో ఉన్న వారికి తప్పించుకునే సమయం లేకుండా పోయింది. అందువల్లే బస్సు మొదటి భాగంలోని సీట్లు, బెర్తుల్లో ఉన్నవారే ఎక్కువగా ప్రాణాలు కోల్పోయారు' అని ఘటనాస్థలాన్ని, **బస్సును పరిశీలించిన ఫోరెన్సిక్ బృందాలు**

బ్యాటరీల పేలుడు వల్లే భారీ శబ్దం

లగేజీ క్యాబిన్‌లోని బ్యాటరీలన్నీ ఒక్కసారిగా పేలడం వల్లే భారీ శబ్దం వచ్చింది. దీంతో డ్రైవర్ బస్సును నిలిపి అతని సీటు పక్కన ఉండే కిటికీ డోరు నుంచి దిగి వెనక వైపునకు వెళ్లి చూసి అక్కడి నుంచి పారిపోయాడు. అప్పటికే బస్సు దట్టమైన పొగ, మంటల్లో చిక్కుకుంది. బస్సు లోపల చిక్కుకున్న ప్రయాణికులు తప్పించుకునేందుకు యత్నించినా.. కుడివైపునున్న అత్యవసర ద్వారం తెరుచుకోకపోవడంతో వారి ప్రయత్నాలు ఫలించలేదు. నిబంధనలకు విరుద్ధంగా సరకు రవాణాప్రయాణికుల వాహనాల్లో వారి వ్యక్తిగత లగేజీ తప్ప ఇతర సరకులేవీ రవాణా చేయకూడదు. కానీ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాలు ప్రయాణికుల వాహనాలను సరకు రవాణా కోసం వాడేస్తున్నాయి. వాటిని లగేజీ క్యాబిన్‌లలో పెడుతున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వాటికి మంటలు అంటుకోవడంవల్ల ప్రమాద తీవ్రత పెరుగుతోంది. కర్నూలు ఘటనలో కూడా ప్రమాద తీవ్రత పెరగడానికి మొబైల్ ఫోన్ల పేలుడే కారణమని ప్రాథమికంగా తేలింది. సాధారణంగా మొబైల్ ఫోన్ల పై భాగాన్ని ప్లాస్టిక్‌తో, బ్యాటరీలు లిథియంతో తయారు చేస్తారు. ప్లాస్టిక్ క్షణాల్లో అంటుకుంటుంది. లిథియం మంటల్లో చిక్కితే పేలిపోతుంది. అది తెలిసి కూడా ప్రయాణికుల వాహనాల్లో వీటిని రవాణా చేయడం ఇంత భారీ ప్రాణనష్టానికి ప్రధాన కారణమైంది.

**బైకును తీసే లోపే లాక్కెళ్లిన బస్సు..**

కర్నూలు బస్సు ప్రమాద దుర్ఘటన మిస్టరీ వీడింది. బస్సు ప్రమాదంపై పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో మంటలు చెలరేగి 19 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నడిపిన శివశంకర్ అనే యువకుడు కూడా మృతి చెందాడు. అయితే, బైక్‌పై శివశంకర్ వెనుక కూర్చున్న వ్యక్తిని ఎర్రిస్వామిగా పోలీసులు గుర్తించారు. అతన్ని పలు కోణాల్లో ప్రశ్నించి కీలక ఆధారాలు సేకరించారు. కేసు వివరాలను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మీడియాకు వెల్లడించారు. శుక్రవారం జరిగిన బస్సు ప్రమాద ఘటన దర్యాప్తులో భాగంగా బైక్ నడుపుతూ చనిపోయిన శివశంకర్‌తో పాటు వెనుకాల కూర్చున్న వ్యక్తి ఎర్రిస్వామి అలియాస్ నానిగా గుర్తించాం. అతన్ని పలు కోణాల్లో విచారించాం. ఎర్రిస్వామి, పల్సర్ బైక్ నడుపుతున్న శివశంకర్ ఇద్దరూ కలిసి లక్ష్మీపురం గ్రామం నుంచి అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2గంటలకు తుగ్గలికి బయల్దేరారు. మార్గ మధ్యలో అర్ధరాత్రి 2.24 గంటలకు కియాషోరూమ్ సమీపంలోని ఉన్న పెట్రోల్ బంక్ వద్ద పెట్రోల్ పోయించుకున్నారు. అక్కడి నుంచి బయల్దేరిన కొద్ది సేపటికే చిన్నటేకూరు సమీపంలో శివశంకర్ బైక్ నడుపుతూ స్కిడ్ అయి.. రోడ్డుకు కుడివైపు ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనుక ఉన్న ఎర్రిస్వామి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రోడ్డు మధ్యలో పడి ఉన్న శివశంకర్‌ను పక్కకు తీసి, బైక్‌ను తీద్దామనుకునే సరికి అంతలోనే వేగంగా వచ్చిన బస్సు బైక్‌ను ఢీకొని కొద్ది దూరం ఈడ్చు కెళ్లింది. బస్సు కింద మంటలు రావడంతో ఎర్రిస్వామి భయపడి అక్కడి నుంచి తన స్వగ్రామం తుగ్గలి వెళ్లి పోయాడు. బస్సు ప్రమాద ఘటనపై ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**వైరల్‌గా మారిన బైకర్ సిసి టీవి ఫుటేజ్**

ఈ ప్రమాదానికి ముందు స్థానికంగా ఉన్న పెట్రోల్ బంక్‌లోకి బైక్‌పై శివశంకర్ వెళ్లిన వీడియో వైరల్‌గా మారింది.. పెట్రోల్ కొట్టించుకునేందుకు పెట్రోల్ బంక్‌కు వెళ్లాడు శివశంకర్.. అతడితోపాటు మరో యువకుడు బైక్ వెనకాల ఉన్నాడు.. అయితే, తిరిగి పెట్రోల్ బంక్ నుంచి వెళ్లిపోతున్న సమయంలో మాత్రం శివశంకర్ ఒకడే బైక్‌పై ఉన్నాడు. అంతేకాదు. ఆ సమయంలో శివశంకర్ మద్యం మత్తులో ఉన్నట్లుగా దృశ్యాలను చూస్తే అర్థమవుతోంది.. పెట్రోల్ బంక్ నుంచి బైక్‌పై వెళ్తోన్న సమయంలో.. బైక్‌పై ఉన్న శివశంకర్ తూలినట్టు.. ఆ బైక్ కూడా స్కిడ్ అయినట్టు కనిపిస్తోంది.. ఆ తర్వాత బైక్ హైవే మీదకు రావడం.. ఆ తర్వాత ప్రమాదానికి కారణమైనట్టుగా భావిస్తున్నారు..

## కర్నూలు ఘటనతో నిద్రలేచిన ఆర్‌టిఏ

**అమరావతి(జనంసాక్షి):** కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంతో ఆర్టీఏ అధికారులు అప్రమత్తం అయ్యారు.. ఇటు, తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్.. మరోవైపు బెంగళూరులోనూ ఆర్టీఏ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.. దీంతో, కాలం చెల్లిన బస్సులను రోడ్డుపైకి రాకుండా ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి.. మరోవైపు.. కర్నూలులో బస్సు ప్రమాదం దృష్ట్యా ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు రవాణా శాఖ అధికారులు.. రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ప్రైవేట్ వాహనాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు.. నిబంధనలు ఉల్లంఘించిన ట్రావెల్ బస్సులపై ఈ రోజు ఇప్పటికే 289 కేసులు నమోదు చేశారు.. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 18 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను సీజ్ చేశారు.. విజయవాడలో సాయంత్రం వరకు దాడులు కొనసాగాయి. ఆర్టీఏ అధికారుల తనిఖీలు.. చేసి అగ్నిమాపక పరికరాలు లేని ప్రైవేటు ట్రావెల్స్‌కు భారీగా జరిమానాలు వించారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై ఇప్పటి వరకు 7.08 లక్షల రూపాయల వరకు జరిమానా విధించారు.

## మరో బస్సు ప్రమాదం

**పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్ద బస్సు బోల్తా**

**ఘటనలో ఆరుగురికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు**

**హైదరాబాద్(జనంసాక్షి):** పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్ద ఓ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. మియాపూర్ నుంచి గుంటూరు వెళ్తున్న బస్సు పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్‌లో అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొంది. దీంతో రోడ్డు పక్కకు పడిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో 15 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో ఆరుగురికి గాయాలు కాగా.. క్షతగాత్రులను డీఆర్డీవో అపోలో, హయత్ నగర్ ఆస్పత్రులకు తరలించారు. మలుపులో డ్రైవర్ అప్రమత్తంగా లేకపోవడం వల్లే ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

## 30 కోట్ల మంది ఎల్‌ఐసీ పాలసీదారులను కేంద్రం మోసం చేసింది

ప్రతిపాదనను రూపొందించి, ముందుకు తీసుకెళ్లారని అంతర్గత పత్రాలు వెల్లడిస్తున్నాయి" అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఓ ప్రైవేటు సంస్థను సమస్యల నుంచి బయట పడేసేందుకు ఎల్‌ఐసీ నిధులను వినియోగించడానికి ఆర్థిక మంత్రిత్వశాఖ, నీతి ఆయోగ్‌లకు ఏ అధికారం ఉందని ఆయన ప్రశ్నించారు. 2024 సెప్టెంబర్‌లో అమెరికాలో గౌతమ్ అదానీ, అతడి సహచరులు అధికారులకు లంచాలు ఇవ్వజూపడమే గాక.. ఆ కంపెనీ గురించి ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి వారి నుంచి నిధుల సేకరణకు పాల్పడినట్లు అభియోగం మోపడంతో అమెరికాలో వారిపై కేసు నమోదైన విషయాన్ని జైరాం రమేశ్ గుర్తు చేశారు.

## వేతనాల చెల్లింపుపై ఆర్థికశాఖ కీలక నిర్ణయం

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో ఉద్యోగుల వేత నాల చెల్లింపుపై ఆర్థికశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మంత్రివర్గ నిర్ణ యానికి అనుగుణంగా ఉద్యో గులు, సిబ్బంది కచ్చితంగా ఆర్థిక శాఖ నిర్వహణ పోర్టల్ (ఐఎఫ్‌ఎంఐఎస్)కు ఆధార్ లింక్ చేయాల్సిందేనని ఆదేశం చింది. శనివారం అర్ధరాత్రి వరకు అందరూ ఆధార్ లింక్ చేయాలని స్పష్టం చేసింది. లేదంటే వేతనాలు నిలిచిపో తాయని స్పష్టం చేసింది. అన్ని శాఖల్లో కలిపి శాశ్వత, తా త్కాలిక ఉద్యోగులు మొత్తం 10.14 లక్షల మంది ఉన్నారు. వీరందరి పేర్లు, హోదా, ఆధార్, ఫోన్ నంబర్లు తదితర వివరాలన్నీ ప్రతి నెల 10 వరకు ఆర్థికశాఖ నిర్వహణ పోర్టల్ లో నమోదు చేయాలని గత నెలలో ఉత్తర్వులు జారీ చే సింది. కానీ ఈ నెల 16 వరకు సగం మం ది వివరాలు కూడా నమోదు చేయలేదు. ఈ క్రమంలో వివరాలివ్వనివారి జీతాల బిల్లులు ఈ నెలలో ఆమోదించేది లేదని ఆర్థికశాఖ హెచ్చరించింది. ఉద్యోగుల సమగ్ర వివరాలన్నీ లేకపోవడంతో కొన్నిచోట్ల అక్రమాలు జరుగుతున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులం దుతున్నాయి. కొన్ని కార్యాలయాల్లో తాత్కాలిక ఉద్యోగులు మానేసినా, అనధికారికంగా సుదీర్ఘ సెలవులో వెళ్లినా వారి పేర్లతో వేతనాలు డ్రా చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పేరు, ఆధార్, సెల్ నంబర్లతో పోల్చిచూస్తే ఎంత మంది ఉద్యోగులు ఉన్నారనే స్పష్టమైన వివరాలు అందుతాయని భావించి వివరాలు పంపాలని కోరగా పలు కార్యాలయాలు స్పందించడం లేదు. ఈ క్రమంలో మరోమారు ఆర్థిక శాఖ గట్టి హెచ్చరికలు జారీ చేసింది.

## దంచికొట్టిన వాన

నగర్, యూసఫ్ గూడా, ఎర్రగడ్డ ప్రాంతాలలో వర్షం కురిసింది. అలాగే, కోఠి, బషీర్ బాగ్, హిమాయత్ నగర్ పరిసర ప్రాంతాలలో మోస్తారు వర్షపాతం నమోదైంది. అలాగే నగరంలోని ప్రధాన ప్రాంతాలైన మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్, రాయదుర్గం, హఫీజ్‌పేట్‌లో భారీ వర్షం పడింది. మియాపూర్, చందానగర్, బీహెచ్‌ఈఎల్, మదినగూడ, నిజాంపేట్, బాచుపల్లి, దుండిగల్, మల్లంపేట ప్రాంతాల్లో కూడా పెద్ద ఎత్తున వర్షం కురిసింది. దీంతో రోడ్లపై ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇక పలు ప్రాం తాలలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

## నాపై కావాలనే కుట్రచేసి బయటకు గెంటేశారు

ఇవాళ నిజామాబాద్ జిల్లా, నవీపేట్ మండలం యంచ గ్రామంలో ఆమె పర్యటించి ప్రారంభ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నిజామాబాద్‌లో తాను ఓటమి పాలవ్వడం వెనుక కుట్ర ఉందో లేదో భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యకర్తలు ఆలోచించాలన్నారు. ఇంటి గుట్టు బయటపెట్టి.. కుట్ర చేసి నన్ను బయటకి పంపించారు. ఇప్పుడు నా దారి నేను వెతుక్కుంటున్నా. ఈ జిల్లా బిడ్డగా, కోడలిగా మీ ఆశీర్వాదం కోసం వచ్చా. 27 ఏళ్ల వయస్సులో ఉద్యమంలోకి వచ్చా. ఎన్ని కష్టాలు ఎదురైనా సరే సహనంతో ఎదురు చూశానని అన్నారు. నేను భారత రాష్ట్రసమితి పార్టీకి వ్యతిరేకంగా ఏమీ చేయలేదు. కానీ, కుట్ర చేసి నన్ను బయటకు పంపించారు. ఏం కుట్ర జరిగిందో పిల్లల్ని అడిగినా చెబుతారు. ఎన్ని అవమానాలు జరిగినా భరించాను. ఈ సమయంలో ఆశీర్వాదం కావాలని మీ ముందుకొచ్చానని అన్నారు. తొలి అడుగు మన గడ్డ మీద నుంచే వేయాలని వచ్చాను. గత 10 ఏళ్లలో మనం కొంత సాధించుకున్నాం. కానీ, అమర వీరుల కుటుంబాలకు దక్కాల్సిన గౌరవం, న్యాయం దక్కలేదు. వాటికోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. జనం బాటలో మేధావులు, విద్యార్థులు సహా అన్ని వర్గాలతో మాట్లాడతాను. అందర్నీ భాగస్వాములను చేస్తాను. ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవంతో కూడిన అభివృద్ధి కావాలని నేను కోరుతున్నానని కవిత అన్నారు. ఇదే సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలపైనా నిలదీశారు. రైతన్నలకి ఎకరాకి 50 వేలు నష్టపరిహారం, ఆడబిడ్డలకు తులం బంగారం, పించన్ల పెంపు ఎప్పుడిస్తారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. . రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గోదావరి పరివాహక ప్రాంతంలో పంటలు నీట మునిగాయని కవిత ఆరోపించారు. తెలంగాణలోని 9 గ్రామాల్లో ఐదు వేల ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లిందన్న కవిత, వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి నీటిని విడుదల చేసి ఉంటే, రైతులకు నష్టం జరిగేది కాదన్నారు. అధికారులు, మంత్రులు చేసిన పాపం, రైతులకు శాపంగా మారిందని ఆమె వాపోయారు. రైతులకు యూరియా సైతం అందించలేని అసమర్ధ ప్రభుత్వమిదని, బోనస్, మద్దతు ధర ఇవ్వకుండా రైతులను అడుగడుగునా ఇబ్బందులకు గురిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ÷రిలిదావరి పరివాహక ప్రాంతాల్లో మరో మారు పంట నష్టం పై సర్వే నిర్వహించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. 'ఎకరానికి 50 వేల రూపాయల నష్టపరిహారం రైతులకు అందించాలి. వరద ముంపు ప్రాంతాలను జిల్లా కలెక్టర్ సందర్శించి నష్టాన్ని అంచనా వేయించాలి. రైతుల సమస్యలను రాజకీయంగా చూడకుండా.. ఆదుకునేందుకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మంత్రి తుమ్మల కృషి చేయాలి. ఆడబిడ్డలకు తులం బంగారం, పింఛన్ల పెంపు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే షకీల్ రైతుల పక్షాన పోరాటం చేయాలని కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తానని ఈ సందర్భంగా కవిత అక్కడి ప్రజలకు మాటిచ్చారు.



## జూబ్లీహిల్స్ నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర సాగాలి

ముదిరాజ్, తన అనుచరులతో కలిసి శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తోట మహేష్‌తో పాటు ఆయన అనుచరులకు కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరంమీడియాతో కేటీఆర్ మాట్లాడారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికలో హామీలిచ్చి ఒక్క పైసా కూడా సీఎం రేవంత్‌రెడ్డి ఇవ్వలేదని ఫైర్ అయ్యారు. ఓటు కోసం కాంగ్రెస్ నేతలు ప్రమాణం చేస్తారని.. ఆ తర్వాత పట్టించుకోరని ఎద్దేవా చేశారు. మళ్లీ కేసీఆర్‌ని అధికారంలోకి తెచ్చుకోవటానికి.. జూబ్లీహిల్స్ నుంచే జైత్రయాత్ర ప్రారంభం కావాలని మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తే తాము మోసం చేసినా తమకు ఓటు వేశారని.. ఆ పార్టీ నేతలు చెబుతారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులకి మధ్య సయోధ్య లేక కొట్టుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు జాదూగాళ్లు అని దెప్పిపొడిచారు. అన్ని మతాల వారిని, అన్నివర్గాల వారిని కాంగ్రెస్ మోసం చేసిందని ఆక్షేపించారు. మైనార్టీ సబ్ ప్లాన్ పెడతామన్నారని.. అది కూడా ఎందుకు పెట్టలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఓటు అడగటానికి కాంగ్రెస్ నేతలు వస్తే బాకీ కార్డు చూపెట్టాలని సూచించారు. అవ్వా, తాతలకు రూ.4000 పెన్షన్ ఇస్తామని అన్నారని.. ఇచ్చారా అని నిలదీశారు. మహిళలకు రూ. 2500 ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు వాస్తవం కాలేదని, పేదల ఆశలు దెబ్బతిన్నాయని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజల కష్టాలు తగ్గాయి. ఉచిత మంచినీళ్లు, బస్తీ దవాఖానాలు, రూ.5 భోజనం, పింఛన్లు, రంజాన్ తోఫాతో పాటు అనేక పథకాలు అమలు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. ఇప్పుడేమో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను బకాయిలతో ముంచేసింది. వృద్ధులు, రైతులు, మహిళలు అందరిని కాంగ్రెస్ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేం మోసపోయాం.. కానీ ఇప్పుడు జూబ్లీహిల్స్ ప్రజలు మోసపోవద్దు. అందుకే మేం కూడా జూబ్లీహిల్స్‌కు వచ్చి ప్రచారం చేస్తామని గ్రామల నుంచి రైతులు, ప్రజలు చెబుతున్నారని అన్నారు. మోసాన్ని మోసంతోనే జయించాలి. ప్రజల నిజమైన అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తేవాలి. తెలంగాణలోని గరీబోళ్లు, కార్మికులు, రైతులు అందరూ జూబ్లీహిల్స్ వైపు చూస్తున్నారు. జైత్రయాత్ర ఇక్కడి నుంచే ప్రారంభమవుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. వచ్చే నెల 11న జరిగే పోలింగ్‌లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కేటీఆర్ కోరారు. మీ ఓటు తెలంగాణ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. కేసీఆర్ పాలనలో సాధించిన అభివృద్ధిని కాపాడుకుందాం అని ఆయన పిలుపునిచ్చారు.


## పాక్ సరిహద్దులో భారత్ త్రిశూల్ విన్యాసాలు

- రంగం సిద్ధం చేసిన భారత త్రివిధ దళాలు
- అప్రమత్తమైన పాకిస్థాన్
- తమ గగనతలంలో ఆంక్షలు విధిస్తూ విమానయాన సంస్థలకు నోటమ్ జారీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత త్రివిధ దళాలు ఉమ్మడిగా 'త్రిశూల్' విన్యాసాలు చేసేందుకు సిద్ధమయ్యాయి. ఈ క్రమంలో పాకిస్థాన్ అప్రమత్తమైంది. తమ గగనతలంలో ఆంక్షలు విధిస్తూ విమానయాన సంస్థలకు నోటమ్ జారీ చేసింది. అక్టోబరు 30 నుంచి నవంబరు 10 వరకు పాక్ సరిహద్దులోని సర్‌క్రీక్ ప్రాంతంలో భారత త్రివిధ దళాలు పెద్దఎత్తున విన్యాసాలు చేపట్టేందుకు సిద్ధమయ్యాయి. ఈ క్రమంలో పాక్ తన కేంద్ర, దక్షిణ ప్రాంతంలో ఉన్న గగనతలంలోని వైమానిక మార్గాలను పరిమితం చేసింది. విశ్లేషకుడు డామియన్ సైమన్ దీనికి సంబంధించి ఒక ఉపగ్రహ చిత్రాన్ని పంచుకున్నారు. 28వేల అడుగుల ఎత్తు వరకు విన్యాసాలు చేసేందుకు గగనతలాన్ని రిజర్వ్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత త్రివిధ దళాలు కలిసి ఉమ్మడిగా.. ఇంత పెద్ద కసరత్తు నిర్వహించడం గమనార్హం. ఉమ్మడి కార్యాచరణ సామర్థ్యాలు, స్వావలంబనను ప్రదర్శించడమే లక్ష్యంగా దీన్ని ఏర్పాటుచేసినట్లు రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది. ఇలాంటి విన్యాసాలు సాధారణ సన్నద్ధత చర్యలే అయినప్పటికీ.. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత సరిహద్దును నిశితంగా గమనిస్తున్నామని చెప్పేందుకే పాక్ తాజాగా నోటమ్ జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇక, సర్‌క్రీక్ ప్రాంతంలో దాయాది దేశం ఏదైనా వక్రబుద్ధి చూపిస్తే.. దాని ఫలితం తీవ్రంగా ఉంటుందని ఇటీవల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. సర్‌క్రీక్.. అనేది గుజరాత్ తీరం వెంబడి ఉన్న సున్నితమైన వ్యూహాత్మక ప్రాంతం. ఇది రెండు దేశాల మధ్య వివాదాస్పదమైన ప్రాంతం కూడా.

# టీఆర్పీలో చేరికలు

- రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వివిధ పార్టీల నాయకులు
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న
- రాజ్యాధికారం సాధించే విధంగా కృషి చేయాలని మల్లన్న సూచన



**కరీంనగర్ (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా నుండి వివిధ పార్టీల నాయకులను హైదరాబాద్ టీఆర్పీ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా ఆధ్వర్యంలో చేరికలు నిర్వహించారు. నూతన సబ్యులకు కండువాలు కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించిన పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న. అనంతరం నూతన సభ్యులతో మల్లన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీ రాజ్యాధికారం సాధించుకోవడం టీఆర్పీ పార్టీ తోనే సాధ్యమైతుందని తెలిపారు. టీఆర్పీ పార్టీ కరీంనగర్ జిల్లాలో గ్రామ వ్యాప్తంగా బలపడేటట్లు అందరూ కలిసి కృషి చేయాలని సూచన చేశారు. మనమెంతో మనకంత అనే నినాదంతో ప్రజా క్షేత్రంలోకి వెళ్లి అగ్రవర్ణాల దోపిడీని అరికట్టాలని అందుకు గాను మీరంతా పార్టీ సైనికులై కష్టపడాలి తెలిపారు. పార్టీలో చేరిన నూతన సభ్యులు అర్షన్ బిల్ అలీ (చోటు), మొహమ్మద్ వాజిద్, జడగల శ్రీనివాస్, మాటూరి శ్రీనివాస్, షేక్ చంద్ పాషా, మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు పసిపిల్లలకు ఒకే ఆక్సిజన్ సిలిండర్

- వరంగల్ ఎంజీఎంలో సంఘటన
- హాస్పిటల్ సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనం



**వరంగల్ ఎంజీఎం, అక్టోబర్ 25(జనంసాక్షి):** ఉత్తర తెలంగాణలోనే పెద్ద ఆసుపత్రిగా పేరుపొందిన ఎంజీఎం లో మనసు చెల్లించిపోయే సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఒకే బెడ్ పై ఇద్దరు పేషెంట్లను పడుకో పెట్టడమే కాకుండా, ఇద్దరు చిన్న పిల్లలకు ఒకే ఆక్సిజన్ సిలిండర్ అమర్చి వైద్య పరీక్షల నిమిత్తం రోడ్డుపై నడుస్తూ వెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. అంతేకాకుండా పిల్లలను జాగ్రత్తగా తీసుకు వెళ్ళవలసిన ఆసుపత్రి సిబ్బంది కానీ, డాక్టర్లు కానీ లేకుండానే పసిపిల్లల యొక్క తల్లిదండ్రులు ఆక్సిజన్ సిలిండర్ను, పసిపిల్లలను జాగ్రత్తగా పట్టుకొని పట్టుకొని వైద్య పరీక్షల నిమిత్తం వెళ్లడం జరిగింది. అక్కడ చుట్టుపక్కల ఉన్న రోగులు, ప్రజలు చూసి అనుకొని సంఘటన ఏదైనా జరిగితే పరిస్థితి ఎలా ఉండేదో అని వాపోయారు. తరచుగా ఎంజీఎంలో రోగుల పట్ల బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్న పలు సంఘటనల వల్ల ఆసుపత్రికి వచ్చి రోగులకు ఆసుపత్రి పై నమ్మకం పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా అక్కడున్న రోగులు మరియు ప్రజలు కోరారు.

### మంత్రి దామోదర్ రాజనర్సింహ సీరియస్

ఎంజీఎంలో వరస ఘటనలపై ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ సీరియస్ అయ్యారు. హాస్పిటల్ సూపరింటెండెంట్పై వేటు వేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డాక్టర్లు, సిబ్బందిపై కఠిన చర్యలకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. హాస్పిటల్ను గాడిన పెట్టేందుకు అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని హెల్త్ సెక్రటరీకి సూచించారు. ప్రతి వారం ఎంజీఎంపై సమీక్ష చేసి తనకు నివేదిక సమర్పించాలని డీఎంఈని ఆదేశించారు. ఎంజీఎంలో ఏండ్లుగా ఒకేచోట పాతుకుపోయిన ఉద్యోగుల వివరాలు సేకరించి, వారి పనితీరుపై నివేదిక సమర్పించాలని సూచించారు.

# కవిత అవినీతి వ్యాఖ్యల ఆధారంగా చర్యలు

- నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో బల్మూరి ఫిర్యాదు

**హైదరాబాద్, అక్టోబరు25 (జనంసాక్షి) :** మాజీ ఎమ్మెల్సీ కవిత గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై చేసిన ఆరోపణల విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సెప్టెంబర్ 2న కవిత చేసిన ఆరోపణలపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని కోరుతూ ఆయన ఈ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు అనంతరం ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మీడియాతో మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతి జరిగినట్లు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె అయిన ఎమ్మెల్సీ కవిత స్వయంగా ఆరోపించారని గుర్తు చేశారు. ఓ నలుగురు వ్యక్తులు కేసీఆర్‌కు తెలియకుండానే రాష్ట్ర సంపదను రాబందుల్లా దోచేశారని కవిత ఆధారాలతో ఆరోపించారు అని వెంకట్ పేర్కొన్నారు. ఇదే అంశంపై నారాయణగూడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరామని అన్నారు. గత ప్రభుత్వంలో దోచుకున్న సొమ్మును రాబట్టి వాటితో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేస్తామని బల్మూర్ వెంకట్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు బాకీ పడినట్లు బీఆర్ఎస్ 'బాకీ కార్డుల' ఆరోపణలతో ప్రచారం చేస్తుండటంపై వెంకట్ మండిపడ్డారు. నిజానికి రాష్ట్రాన్ని పదేళ్లు దోచుకుతిన్నది అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. వారు దోచుకున్న ఆ అవినీతి సొమ్ము వెలికి తీస్తే రాష్ట్ర ప్రజలకు మేలు చేయవచ్చు అని ఆయన స్పష్టం చేశారు. కవిత ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రేమించిన యువతి దక్కదని

# ప్రియుడి ఆత్మహత్య!

**చెన్నారావుపేట, అక్టోబర్ 25 (జనం సాక్షి):** ప్రేమించిన యువతి దక్కదనే మనస్థాపంతో ప్రియుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన మండలంలోని ధర్మ తండ గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. తండావాసులు, పోలీసుల కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన బోడ మోహన్ కుమారుడు బోడ మహేష్ (21) డిగ్రీ చదువుతున్నాడు. మండలంలోని ఓ తండాకు చెందిన యువతిని గత కొద్ది రోజులుగా ప్రేమిస్తున్నాడు. ఆమెకు వారి తల్లిదండ్రులు ఇటీవల సంబంధాలను చూస్తున్నారు. విషయం తెలిసిన అతను ప్రేమించిన యువతి తనకు దక్కదని తరచూ మదన పడుతున్నాడు. ప్రేమ విషయం తెలియడంతో యువకుడి తల్లిదండ్రులు కూడా అతడిని మందలించారు. దీంతో అతను మనస్థాపానికి గురై ఈనెల 23న గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపారు.

## యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించడంలో

# కేంద్ర ప్రభుత్వం విఫలం


- మోడీ పాలనలో పెరిగిపోతున్న నిరుద్యోగం
- డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఎ.ఎ.రహీం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రతిఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించకుండా యువతను మోసం చేస్తుందని డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఎఎ రహీం అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సమావేశం డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయం చిక్కడపల్లి లో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన అయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అమ్మివేస్తూ బడా పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తుంద న్నారు. ఎన్నికల్లో హామీలను అమలు చేయకుండా ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ విభజించు పాలించు అన్న చందంగా పాలన కొనసాగిస్తుందని అన్నారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎప్పుడు లేనంతగా మోడీ ప్రభుత్వంలో రోజు రోజుకు నిరుద్యోగం పెరిగిపోతుందన్నారు. ఒకవైపు దేశ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకుండా మరోవైపు ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటికరిస్తూ ఉన్న ఉద్యోగాలను తీసివేస్తుందన్నారు. నిరుద్యోగ నిర్మలనకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేసారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకై డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కోట రమేష్,అనగంటి వెంకటేష్,రాష్ట్ర ఆఫీస్ బెరర్స్ కృష్ణ నాయక్, శివవర్మ, జావీద్, మల్లం మహేష్, ఆర్.ఎల్.మూర్తి, రాష్ట్ర కమిటీ సభ్యులు నరేష్, టీకానంద్, ప్రశాంత్ చారి,పల్లె మధు, అరవింద్, ప్రశాంత్, నరేందర్, మధు,నవీన్,హస్మి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాదులో రూ.4.9 కోట్ల బ్యాంకు ఫ్రాడ్

- ఏడుగురికి జైలు శిక్ష.. 20 ఏళ్ల తర్వాత తీర్పు
- సీబీఐ కోర్టులో విచారణ.. ఏడుగురు దోషులుగా నిర్ధారణ




**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని కార్పొరేషన్ బ్యాంకులో సుమారు రూ.4.9 కోట్ల మోసానికి సంబంధించిన కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. బ్యాంకు మాజీ సీనియర్ మేనేజర్‌తో సహా ఏడుగురిని దోషులుగా నిర్ధారించి, వారికి జైలు శిక్ష విధించింది. ఈ విషయాన్ని సీబీఐ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. వివరాల్లోకి వెళితే... కార్పొరేషన్ బ్యాంక్ బంజారాహిల్స్ బ్రాంచ్‌లో అప్పటి సీనియర్ మేనేజర్‌గా పనిచేసిన టి. చంద్రకాంత్‌కు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధించారు. ఈ కేసులో రుణాలు పొందిన ప్రైవేటు వ్యక్తులైన వి.ఎన్.ఎస్.సి. బోస్, వి. రాజశ్రీ, కొండా శేఖర్ రెడ్డి, ఎన్.వి.పి. నంద కిశోర్, హెచ్. రాజశేఖర్ రెడ్డిలకు ఏడాది చొప్పున కఠిన కారాగార శిక్ష, రూ.55,000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. నకిలీ, కల్పిత పత్రాల ఆధారంగా రూ.4.9 కోట్ల విలువైన గృహ రుణాలను మంజూరు చేసి బ్యాంకును మోసం చేశారన్న ఆరోపణలపై సీబీఐ 2004 సెప్టెంబర్ 29న చంద్రకాంత్‌తో సహా 16 మందిపై కేసు నమోదు చేసింది. లోతైన విచారణ జరిపిన సీబీఐ, 2007 మార్చి 30న చంద్రకాంత్‌తో పాటు మరో 11 మందిపై ఛార్జిషీట్ దాఖలు చేసింది. నిందితులందరూ కుమ్మక్కై, బ్యాంకింగ్ నిబంధనలను ఉల్లంఘించి, తమ అధికారిక హోదాలను దుర్వినియోగం చేస్తూ తప్పుడు పత్రాలతో రుణాలు పొంది బ్యాంకుకు నష్టం కలిగించారని విచారణలో తేలింది. రెండు దశాబ్దాలకు పైగా సాగిన సుదీర్ఘ విచారణ అనంతరం, హైదరాబాద్‌లోని సీబీఐ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి 2025 అక్టోబర్ 24న తీర్పు వెలువరించి ఏడుగురిని దోషులుగా తేల్చారు. ఇదిలా ఉండగా, ఘజియాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు కూడా అక్టోబర్ 18న మరో బ్యాంకు మోసం కేసులో తీర్పు ఇచ్చింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నోయిడా ఎస్ఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ మనోజ్ శ్రీవాస్తవకు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.30,000 జరిమానా విధించింది. 2007-09 మధ్యకాలంలో తన పదవిని దుర్వినియోగం చేసి బ్యాంకుకు నష్టం కలిగించారనే ఆరోపణలపై 2010లో ఆయనపై కేసు నమోదైంది.

# రౌడీషీటర్స్ స్థితిగతులపై నజర్ పెట్టాలి

- డయల్ 100 ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్




**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** డయల్ 100 ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని కాకతీయ విశ్వవిద్యాలయము సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో వున్న కేసులను సమీక్ష జరిపడంతో పాటు పెండింగ్ కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు కేసుల పరిష్కారం కోసం అధికారులు తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్ల కఠినంగా వ్యవహారిస్తూనే వారి కదలికలు, స్థితి గతులపై నజర్ పెట్టాలని, గత కొద్ది కాలంగా రౌడీ షీటర్లు స్థానికంగా లేకుంటే, అతను ప్రస్తుతం నివాసం వుంటున్న ప్రాంతానికి చెందిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని. చోరీలకు పాల్పడిన నిందితులతో పాటు, గంజాయి విక్రయాలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లను తెరవాలని. సైబర్ నేరాల్లో కేవలం బాధితులు నష్టపోయిన సొమ్మును తిరిగి ఇప్పించడమే కాకుండా, నిందితుడి పట్టుకొనేందుకు స్టేషన్ అధికారులు కృషి చేయాలని, పోక్సో కేసుకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలన్ని గడువు లోపు పూర్తి చేయాలని. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ అధికారిగా ఎస్. ఐ స్థాయి అధికారి తప్పక విధులు నిర్వర్తించాలని, ట్రాఫిక్ పోలీసుల తరహాలోనే స్టేషన్ అధికారులు తమ పరిధిలో పెండింగ్ లో వున్న ట్రాఫిక్ జరిమానాదారులకు ఫోన్ చేసి జరిమానా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, చోరీ కేసుల్లో రికవరీ శాతాన్ని పెంచాలని, చోరీలకు పాల్పడిన నిందితులను పట్టుకోవడం కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయడంతో పాటు నిందితులు దేశంలో ఎక్కడ వున్న అరెస్టు చేసేందుకు పోలీస్ అధికారులు ప్రణాళికను రూపొందించుకోవాలని, కేసుల్లోని నిందితులను అరెస్టు చేయడంలో స్టేషన్ అధికారులు అలసత్వం వహించోద్దని, పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో నేర చరిత్ర వున్న వ్యక్తుల ప్రస్తుత స్థితిగతులపై వివరాలు అందుబాటులో వుందాలని, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్ కేసులను ట్రాఫిక్ పోలీసులతో పాటు, లా అండ్ ఆర్డర్ పోలీసులు నమోదు చేయాల్సి వుంటుందని. పోలీస్ స్టేషన్లలో ఆహ్లాదకరమైన వాతవరణం కోసం మొక్కల పెంపకంతో పాటు స్టేషన్ పరిసరాల్లో పరిశుభ్రంగా వుంచాలని ఇందుకోసం ప్రతి శుక్రవారం పోలీస్ స్టేషన్ లో శ్రమదానం శ్రమదానం చేయాల్సి వుంటుందని సిపి పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్, వెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్, డిసిపి అంకిత్‌కుమార్, వరంగల్ , జనగాం ఏఎస్పీ చేతన్‌నితిన్, అదనపు డిసిపిలు రవి, ప్రభాకర్‌రావు, బాలస్వామి,తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్.ఐలు పాల్గోన్నారు.

# మాజీ ఎంపీపీని కిడ్నాప్ చేసిన వ్యక్తుల అరెస్టు




**బెల్లంపల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** బెల్లంపల్లి మాజీ ఎంపీపీ గోమాస శ్రీనివాస్ కిడ్నాప్ ఉదంతం బెల్లంపల్లి పట్టణంలో కలకలం రేపింది. మాజీ ఎంపీపీ గోమాస శ్రీనివాస్ ఒక భూమి విషయంలో నకిలీ పత్రాలు చూపించి 80 లక్షలు అడ్వాన్స్ తీసుకొని మోసం చేసినందుకు బాధితులు కిడ్నాప్ చేసినట్టు పోలీసులు వివరించారు. శనివారం తాళ్ల గురిజాల పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ కేసు వివరాలను వెల్లడించారు. గతంలో బెల్లంపల్లి మాజీ ఎంపీపీ గోమస శ్రీనివాస్, అల్లం శ్రీను, ఇప్ప భూమయ్యలు తాండూర్ మండలం అచ్చలాపూర్ గ్రామంలో 42 ఏకరాల భూమి అమ్మకానికి ఉన్నదని నకిలీ పత్రాలు సృష్టించి పులిమడుగుకు చెందిన బండి సాగర్ అనే వ్యక్తి నుంచి 80 లక్షల రూపాయలు అడ్వాన్స్ తీసుకున్నారు. తర్వాత కొన్ని రోజులకు తనకు నకిలీ పత్రాలు చూపించి మోసం చేసి 80 లక్షలు అడ్వాన్స్ తీసుకున్నారని గోమాస శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, ఇప్ప భూమయ్యపై రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ లో బండి సాగర్ కేసు పెట్టినాడన్నారు. ఆ తర్వాత సాగర్ వారిని పిలిపించి మాట్లాడగా వారు డబ్బు ఇవ్వడానికి రెండు నెలల సమయం కోరి వాళ్ళకు నమ్మకం కుదిరేందుకు చెక్కులు, ప్రామిసరి నోట్ లు రాసి ఇచ్చినారన్నారు. ఆ తర్వాత వారిని ఎన్ని సార్లు అడిగినా డబ్బులు ఇవ్వకపోవడంతో గోమాస శ్రీనివాస్ ను కిడ్నాప్ చేసి బెదిరించి అతని వద్ద నుండి తన 80 లక్షల రూపాయలను తిరిగి వసులు చేద్దాం అనుకుని గొల్ల సంపత్ ద్వార కిడ్నాప్ చేయుటకు 2,40,000 రూపాయలకు బేరం కుదుర్చుకున్నాడు. తర్వాత బీమేష్ ఇట్టి విషయాన్ని తన స్నేహితుడు సాదిక్ కు చెప్పగా అతను కూడా ఇంతకముందు భూమి కొనుగోలు సమయంలో 20 లక్షలు సాగర్ కు ఇవ్వగా వాటిని గోమాస శ్రీనివాస్ కు ఇచ్చాడు. సాధిక్ కూడా గోమస శ్రీనివాస్ ను కిడ్నాప్ చేసి బయపెట్టితే డబ్బులు ఇస్తాడని ఒప్పుకున్నాడు. ఈనెల 19న సాగర్, సంపత్ కు 2 లక్షల రూపాయలు ఇచ్చాడు. సంపత్ అందులో నుండి భీమేశ్ కి 20 వేలు, సాధిక్ కు 10 వేలు ఇచ్చాడు. ఈనెల 20న సాగర్ తన ఎర్టిగా కారును బీమేష్ కు గోమాస శ్రీనివాస్ ను కిడ్నాప్ చేయడానికి అప్పగించాడు. బీమేష్, సాధిక్ లు రెండు, మూడు రోజుల నుంచి కిడ్నాప్ చేయడానికి సమయం కోసం వేచి చూస్తూ గోమాస శ్రీనివాస్ కదలికలు గమనిస్తూ ఉన్నారు. ఈనెల 23న సాధిక్ కు పరిచయం ఉన్న సాయితేజ అనే వ్యక్తిని కార్ డ్రైవింగ్ కోసం మాట్లాడుకొని అతనితో ఒక వ్యక్తిని కిడ్నాప్ చేసి కారులో ఎక్కిస్తం, నువ్వు కారును ఆపకుండా నడపాలని చెప్పగా సాయి తేజ దానికి ఒప్పుకుని సంపత్ దగ్గర నుండి 10వేల రూపాయలు తీసుకున్నాడు. అదే రోజు భీమేష్, సాధిక్, సాయి తేజ మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో గోమాస శ్రీనివాస్ బైక్ పై పోచమ్మ గడ్డ నుంచి తాల్లగురిజాల వైపు వెల్లుతుండగా అక్కడే కాపు కాసి శ్రీనివాస్ వెనకాలే వెళ్ళి రోజ్ గార్డెన్ సమీపంలో శ్రీనివాస్ బండికి ఎదురుగా ఎర్టిగా వాహనాన్ని అడ్డుపెట్టి శ్రీనివాస్ ను బలవంతంగా కారులో ఎక్కించుకుని పరారయ్యారు. తర్వాత కారును బెల్లంపల్లిలోని శివాలయం మీదుగా దహెగాం, కాగజ్ నగర్ వైపు నుండి ఆసిఫాబాద్ వైపుకు తీసుకెళ్ళి, అక్కడి నుండి వాంకిడి రాజురా, అదిలాబాద్, హైదరాబాద్ సమీపం వరకు తీసుకెళ్లారు. గోమాస శ్రీనివాస్ ను కారులో తిప్పుకుంటూ బెదిరించారు. ఈనెల 24 జన్నారం వైపు వస్తున్నారని సమాచారం అందడంతో జన్నారం ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా ఆ దారిలో వస్తున్నా ఎర్టిగా కారును ఆపి తనిఖీ చేయగా, కారులో కిడ్నాప్ కు గురైన గోమాస శ్రీనివాస్ ఉండగా వెంటనే కారులో ఉన్న నిందితులు భీమేష్, సాధిక్, సాయితేజలను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

# అభ్యర్థులు ఈసీ రూల్స్‌ను ఫాలో కావాలి

- వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్




**హైదరాబాద్, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక లో పోటీ చేసే అభ్యర్థులు కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను, నిబంధనలను తప్పక పాటించాలని వ్యయ పరిశీలకుడు సంజీవ్ కుమార్ లాల్ అన్నారు. శనివారం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో కలిసి వ్యయ పరిశీలకులు సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలో పోటీ చేసే ప్రతి అభ్యర్థి అసెంబ్లీ ఎన్నికల ఖర్చు గరిష్ఠ పరిమితి రూ. 40 లక్షలు అని తెలిపారు. ఎన్నికల్లో అభ్యర్థులు ప్రచారానికి చేసే ప్రతి పైసాను ఎన్నికల సంఘంకు తెలుపాలన్నారు. ఖర్చులకు సంబంధించి అభ్యర్థులు పక్కగా డాక్యుమెంటేషన్ చేసుకోవాలన్నారు. ఖర్చుల వివరాలు నిర్దిష్ట గడువులో ఎన్నికల సంఘానికి సమర్పించాలన్నారు. వ్యయ పరిశీలకులే అందరు అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల ఖాతాలను పర్యవేక్షిస్తారనీ తెలిపారు. ఈసీఐ నిబంధనలకు విరుద్ధంగా ఖర్చులు చేస్తే బాధ్యులపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# డ్రగ్స్‌పై యువతలో పోలీసుల చైతన్యం

**భద్రాచలం, అక్టోబరు25 (జనంసాక్షి) :** అశ్వారావుపేట పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్బంధ తనిఖీలు చేపట్టారు. 'చైతన్యం-డ్రగ్స్ పై యుద్ధం' అనే కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. సోదాల్లో దస్త్రాలు లేని 70 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, 4 కార్లు, 6 ట్రాక్టర్లు, రెండు లారీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలకు సంబంధించిన అన్ని దస్త్రాలతోపాటు వాహనాలను నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని సీఐ సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే పోలీస్ శాఖ తీసుకునే చర్యలకు తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. అనంతరం స్థానిక ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. అమ్మకం, వాడకం రెండూ నిషేధమని హెచ్చరించారు.

# నార్సింగ్‌లో హిట్ అండ్ రన్

- కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి

**హైదరాబాద్, అక్టోబర్25 (జనంసాక్షి) :** హైదరాబాద్ నార్సింగి పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. హైదర్ షాకోట్ చౌరస్తా దగ్గర జరిగిన ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే, హైదర్ షాకోట్ ప్రాంతానికి చెందిన కృష్ణ అనే వ్యక్తిని గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ సందర్భంగా కృష్ణ కారు చక్రాల కింద నలిగి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదం జరిగిన వెంటనే కారు ఆపకుండా డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఇక, స్థానికులు ఆ కారును ఆపేందుకు ప్రయత్నించినా, మితిమీరిన వేగంతో డ్రైవర్ తప్పించుకున్నాడు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం రేగింది. ఈ ప్రమాదం గురించి సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పోలీసులు సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తూ, పారిపోయిన కారును గుర్తించేందుకు విచారణ కొనసాగిస్తున్నారు.

# అనని మాటలు కూడా నేరమే!!

జనమే సాక్షి

అనని మాటలు - అన్ సెడ్ వర్డ్స్ - కూడా నేరమే అని మహా ఘనత వహించిన అలహాబాద్ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం చెప్పిన తీర్పు దేశంలో న్యాయవ్యవస్థ స్థితికి, భవిష్యత్ దుష్పరిణామాలకు ఒక సూచిక.

ఎప్పుడైనా సమాజంలో ఒక ఘటన, ఒక చర్య, ఒక పని మాత్రమే నేరంగా గుర్తించబడతాయి. అందులోనూ ఆ ఘటన వల్ల, చర్య వల్ల, పని వల్ల ఆస్తి నష్టమో, ప్రాణ నష్టమో, శారీరక గాయమో సంభవించినప్పుడు మాత్రమే అది నేరం అవుతుంది. మన సమాజంలో వేల సంవత్సరాలుగా అణగారిన కులాలకు చెందిన వ్యక్తులను మాటల ద్వారా అవమానించి మానసిక గాయం చేసే అవకాశం కూడా ఉంది గనుక దూషణ, అవమానం, పరాభవం కూడా నేరాలుగా గుర్తించే సందర్భం ఉంది గాని అవి ప్రత్యేక పరిస్థితుల ప్రత్యేక చట్టాలు. వలస పాలకులు వారి ప్రభుత్వానికి, విధానాలకు వ్యతిరేకంగా రాసే రచనలను, వ్యక్తం చేసే అభిప్రాయాలను, మాటలను నేరంగా, రాజద్రోహం గా పరిగణించి, ఆ నేరాన్ని కూడా భారత శిక్షా స్మృతిలో చేర్చారు. వలస చట్టాలను ఇంకా కొనసాగించడమా అని బీరాలు పలికి ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ ల స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ అని మూడు కొత్త స్మృతులను తీసుకొచ్చిన సంఘ్ పరివార్ ప్రభుత్వం, పాత వలస చట్టాల లాగనే మాటను, రాతను, సైగను, ఎలక్ట్రానిక్ సందేశాన్ని కూడా నేరాలుగా పరిగణించే సంప్రదాయాన్ని యథాతథంగా కొనసాగించింది. "రాజద్రోహ" నేరాన్ని కొత్త ముసుగులతో అలాగే ఉంచింది. ఈ విధంగా నేరం నిర్వచనాన్ని ఇష్టారాజ్యంగా సాగదీస్తే, కచ్చితమైన, నిర్దిష్టమైన అర్థం చెప్పకపోతే, అది పిచ్చివాడి చేతిలో రాయి అవుతుందని, ఎఫ్ఐఆర్ రాసే అధికారం ఉన్న పోలీస్ ఇనస్పెక్టర్ స్థాయి అధికారి తన ఇష్టం వచ్చినట్టుగా ఎవరి మీదనైనా ఏ నేరమైనా ఆరోపించి, విచారణ ప్రక్రియ ప్రారంభించవచ్చునని, న్యాయస్థానాలు జోక్యం చేసుకుని, అది తప్పుడు కేసు అని గుర్తించి, నిందితుడిని బెయిల్ మీద విడుదల చేసే లోపు, కేసును పూర్తిగా విచారించి కొట్టివేసి నిందితులను నిర్దోషులుగా విడుదల చేసేలోపు, నెలలో, సంవత్సరాలో అక్రమ నిర్బంధం సాగుతుందని, అందువల్ల ఈ అక్రమం పద్ధతి కొనసాగనివ్వగూడదని దశాబ్దాలుగా చర్చ సాగుతున్నది. ఒకవైపు ఆ చర్చ సాగుతుండగానే, ఇప్పుడు అలహాబాదు హైకోర్టు ఒక కొత్త విచిత్ర వాదన ముందుకు తెచ్చింది. ఒక వ్యక్తి అన్న మాటలకు కాదు, ఆ మాటల్లో నేరపూరితమైనదేమీ లేదని రుజువైనా సరే, అనని మాటలు కూడా నేరమే అని విచిత్రమైన వాదన, నిర్ధారణ ప్రకటించింది.

ఈ తీర్పు ఏ కేసులో వెలువడిందో వివరాలు చూస్తే, ఉత్తరప్రదేశ్‌లో న్యాయం, చట్టం, తర్కం ఎంత తలకిందులుగా, అర్థరహితంగా, దురుద్దేశ పూరితంగా పని చేస్తున్నాయో అర్థమవుతుంది.

ఉత్తరప్రదేశ్ లోని బిజ్నోర్ జిల్లా చాంద్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జూలై 19న ఆరిఫ్ అహ్మద్ అనే వ్యక్తిని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్త సందీప్ కౌశిక్ ఫిర్యాదు మేరకు అరెస్టు చేశారు. ఆరిఫ్ అహ్మద్ తన తండ్రి ఫరూక్ అన్సారీతో కలిసి బిజ్నోర్ లో ఒక ఎలక్ట్రానిక్స్, గ్యాస్ ఫిల్లింగ్ దుకాణం నడుపుతున్నాడు. ఆరిఫ్ అహ్మద్ బహిరంగంగా అసభ్యకరమైన పనులు చేసి సామాజిక శాంతిని భగ్నం చేశాడని, నేరపూరితమైన బెదిరింపు కు పాల్పడ్డాడని, లవ్ జిహాద్ చేస్తున్నాడని ఆ ఆర్ఎస్ఎస్ కార్యకర్త ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదులో ఉన్న ఆరోపణలకు తోడు పోలీసులు తయారు చేసిన ఎఫ్ఐఆర్ లో అత్యాచారం, విష ప్రయోగం, మోసం, ఫోర్జరీ, హిందూ స్త్రీలను మతాంతరీకరించే ప్రయత్నం అనే నేరాలు కూడా జోడించారు. ఈ ఆరోపణలు భారతీయ న్యాయ సంహిత కింద మాత్రమే కాక, ఉత్తరప్రదేశ్ ప్రొహిబిషన్ ఆఫ్ అన్ లాఫుల్ కన్వర్షన్ ఆఫ్ రిలిజియన్ యాక్ట్ ప్రకారం కూడా నేరాలు.

ఈ ఆరోపణల నిజానిజాలు న్యాయస్థానంలో తేలవలసి ఉంది గాని, ఎఫ్ఐఆర్ ప్రకారం కూడా ఆరిఫ్ ఎవరి మతం మార్చాడో వివరాలు లేవు. మతాంతరీ కరణకు గురైన ఒక్క మహిళ పేరు కూడా ఎఫ్ఐఆర్ లో లేదు. మిగిలిన ఆరోపణలకూ ఆధారాలు లేవు. అసలు ఈ కేసే దురుద్దేశంతో, కక్షపూరితం గా తయారయిందని ఆరోపణలున్నాయి.

ఆ విషయమే ఆరిఫ్ సోదరుడు అఫాఖ్ జూలై 30న తన మిత్రులతో వాట్సప్ మెసేజిగా పంచుకున్నాడు. తన సోదరుడి మీద తప్పుడు ఆరోపణలతో, వాస్తవాలను పరిశీలించకుండా నిరాధారంగా కేసు తయారు పెట్టారని, దాని వల్ల తమ కుటుంబ ప్రతిష్ఠకూ, తమ వ్యాపారానికీ ముప్పు వాటిల్లిందని, అయినా తనకు న్యాయవ్యవస్థ మీద నమ్మకం ఉందని, తన సోదరుడు నిర్దోషిగా బైటికి వస్తాడని ఆ వాట్సప్ మెసేజిలో రాశాడు. ఎవరి మీదనైనా తప్పుడు కేసు బనాయించినప్పుడు, కుటుంబ సభ్యులెవరైనా ఇటువంటి ఆక్రోశం ప్రకటించడం సహజమే.

ఆ వాట్సప్ మెసేజి మతాల మధ్య వైషమ్యాన్ని, శత్రుత్వాన్ని రెచ్చగొట్టేలా ఉందని, అది మత ఘర్షణలకు దారి తీసి, సామాజిక శాంతిని భగ్నం చేయవచ్చునని, నిందితుడు మత సామరస్యాన్ని ధ్వంసం చేసే దురుద్దేశంతోనే ఆ మెసేజి పంపాడని చాంద్ పూర్ పోలీసు సబ్ ఇనస్పెక్టర్ ప్రశాంత్ సింగ్ మరొక ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మొదట అన్న అరెస్టే తప్పుడు కారణాల తో, నిరాధారంగా జరిగిందంటే, ఆ అరెస్టు అన్యాయంగా జరిగింది అని తమ్ముడు తన ఆక్రోశాన్ని స్నేహితులతో పంచుకోవడం మరొక నేరంగా నమోదయింది!

తన వాట్సప్ మెసేజిలో ఒక్కటంటే ఒక్కటైనా అభ్యంతరకరమైన మాట లేదని, తన అన్న మీద అక్రమ కేసు నమోదయిందని, అది న్యాయవ్యవస్థలో తేలిపోతుందని మాత్రమే తన మిత్రులతో పంచుకున్నానని, కనుక ఈ ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని (కొట్టివేయాలని) అఫాఖ్ రాజ్యాంగ అధికరణం 226 కింద హైకోర్టును అభ్యర్థించాడు.

ఎఫ్ఐఆర్‌లో ఉటంకించిన పూర్తి మెసేజిని చదివితే అది ఎవరినీ రెచ్చగొట్టేదిగా లేదని, అది కేవలం ఒక వ్యక్తి తన సోదరుడి అరెస్టు గురించి అసంతృప్తినీ, ఆక్రోశాన్నీ వ్యక్తం చేయడంగా మాత్రమే ఉందని, ఆ మెసేజిలోనే నిందితుడు తనకు న్యాయవ్యవస్థ మీద సంపూర్ణ విశ్వాసం ఉన్నదని ప్రకటించాడని, తన అన్న నిర్దోషిగా విడుదల అవుతాడని ఆశాభావం వ్యక్తం చేశాడని అఫాఖ్ తరఫున న్యాయవాది సయ్యద్ షానవాజ్ షా వాదించారు.

కోర్టు తీర్పులో సాధారణంగా డిఫెన్స్ న్యాయవాది వాదనలు, ప్రభుత్వ న్యాయవాది వాదనలు పూర్తిగా ఇస్తారు. నాలుగు పేజీల ప్రస్తుత తీర్పులో షానవాజ్ షా వాదనలు చాలా వివరంగా 22 పంక్తులు ఉటంకించి, ప్రభుత్వ న్యాయవాది శశి శేఖర్ తివారి ప్రతివాదన ఒకే ఒక్క వాక్యం, రెండున్నర పంక్తులు (అందులో మిస్టర్ శశి శేఖర్ తివారీ, లర్నెడ్ అడిషనల్ గవర్నమెంట్ అడ్వకేట్ అనేది ఒక పంక్తి!) మాత్రమే ఇచ్చారు. అది కూడా పిటిషనర్ వాదనలను ప్రభుత్వ న్యాయవాది ఎట్లా ఖండించి, నిస్సందేహంగా తప్పని రుజువు చేశాడో చెప్పడం కాదు. "ఈ పిటిషన్‌ను అనుమతించాలనే ప్రతిపాదనను గట్టిగా వ్యతిరేకించారు" అని మాత్రమే. అంటే పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనల్లోనే నిజమైన శక్తి ఉందనీ, ప్రభుత్వ న్యాయవాది ఏమి చెప్పాడో రాయడానికి కూడా ఏమీ లేదని న్యాయమూర్తులు చెప్పకనే చెప్పారు!

కాని, "ఇరుపక్షాల అభిజ్ఞులైన న్యాయవాదుల వాదనలను పరిశీలిం చిన తర్వాత" అంటూ మూడు పేరాల్లో న్యాయమూర్తులు జస్టిస్ జె జె మునీర్, జస్టిస్ ప్రమోద్ కుమార్ శ్రీవాస్తవ రాసిన మాటలు న్యాయానికీ, చట్టానికీ మాత్రమే కాదు, సాధారణ భాషకూ, తర్కానికీ, ఇంగిత జ్ఞానానికీ కూడా లొంగనివి.

"ఎఫ్ఐఆర్ లో ఉటంకించిన మాటలు వాటికవిగా మతం గురించి ఏమీ మాట్లాడి ఉండకపోవచ్చు, కాని తన సోదరుడు ఒక తప్పుడు కేసులో ఇరికించబడ్డాడు అనే మాటే, తప్పనిసరిగా అతను ఒక ప్రత్యేక మత సమూహానికి చెందినందువల్లనే ఇరికించబడ్డాడు అనే సందేశాన్ని లోలోపల, చెప్పకుండానే చెపుతుంది. మెసేజిలోని ఈ అనని మాటలు, ప్రాథమికంగా ఒక ప్రత్యేక సముదాయానికి చెందిన పౌరుల మత విశ్వాసాలను రెచ్చగొడతాయి. తాము ఒక ప్రత్యేక మత సముదాయానికి చెందినందువల్లనే తమను లక్ష్యంగా చేసుకున్నారనే అభిప్రాయాన్ని కలిగిస్తాయి" అని న్యాయమూర్తులు రాశారు. అంటే నిందితుడు మెసేజిలో రాసిన, స్వయంగా పోలీసులు ఎఫ్ఐఆర్‌లో ఉటంకించిన మాటల్లో ఆ మాటలు లేకపోయినా, న్యాయమూర్తులు ఆ మాటల్లో లేని అర్థాన్ని కనిపెట్టదలచుకున్నారు. చేసిన పనికి కాదు, చెయ్యని పనికి శిక్ష విధించవచ్చునని తీర్పు చెపుతున్నారు. పతంజలి గారు ఒక కథలో రాసినట్టు సత్యాన్ని ఊహించి కనిపెడుతున్నారు. ఉన్న సాక్ష్యాల ఆధారంగా కాదు.

అక్కడితో కూడా ఆగలేదు. ఆ తర్వాతి పేరాలో, "అంతే కాదు, ఆ వాట్సప్ మెసేజి దానికదిగా ఏ ప్రత్యేక సముదాయపు పౌరుల మత భావనలు రెచ్చగొట్టలేదని అనుకున్నప్పటికీ, ఆ మెసేజి అనని మాటల ద్వారా (బై ఇట్స్ అన్ సెడ్ వర్డ్స్), మత సముదాయాల మధ్య శత్రుత్వ భావనను, ద్వేషాన్ని, వైమనస్యాన్ని కలిగించే, ప్రోత్సహించే అవకాశం ఉంది. మొట్టమొదట, మరొక మత సముదాయపు సభ్యులు చట్ట ప్రక్రియలను ఉపయోగించుకుని తమను లక్ష్యంగా పెట్టుకున్నారని ఒక ప్రత్యేక మత సముదాయపు సభ్యులు అనుకునే అవకాశం ఉంది... అందువల్ల పిటిషనర్ కోరినట్టుగా రాజ్యాంగం 226 అధికరణం కింద పిటిషనర్ కు వెసులుబాటు ఇవ్వడం, దర్యాప్తు ప్రక్రియను ఆపడం సాధ్యం కాదని భావిస్తున్నాం" అని తీర్పు చెప్పారు.



నేరం అంటే ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, శారీరక హాని కలిగించే ఒక భౌతిక చర్య, ఘటన, దాడి, పని అనే స్థాయి నుంచి, మానసిక ప్రభావం కలిగించే మాట, రాత, సైగ వంటి వ్యక్తీకరణలు అనే స్థాయి నుంచి, ఇప్పుడింకా దిగజార్చి మాట్లాడని, రాయని, వ్యక్తీకరించని, ఎక్కడా కనబడని ఒక అగోచర వస్తువు అనే స్థాయికి చేర్చారు. ఈ దిగజారిన స్థాయి "నేర" నిర్వచనాన్ని పోలీసులు, న్యాయమూర్తులు మాత్రమే ఊహించి తెలుసుకుంటారనే దగ్గరికి చేర్చారు. ఇక ఎవరి మీదనైనా వారు చేసిన పనులకో, అన్న మాటలకో కాదు, అనని మాటలకు కూడా నేరాలు ఆరోపించవచ్చు. బెయిల్ ఇవ్వకుండా ఏళ్ల తరబడి నిర్బంధించవచ్చు. ఎన్నో ఏళ్ల విచారణ ప్రక్రియ తర్వాత శిక్షలు కూడా విధించవచ్చు.

నదిలో కిందివైపు నీరు తాగుతున్న జింక పిల్లను ఎగువన నీరు తాగుతున్న పులి 'నా నీళ్లను ఎంగిలి చేస్తున్నావు' అని తిడితే, 'ఎగువన ఉన్న నీ నీళ్లను దిగువన ఉన్న నేనెట్లా ఎంగిలి చేస్తాను' అని జింక పిల్ల జవాబు చెప్పినందుకు, 'నాకే ఎదురు చెపుతావా' అని పులి ఆ జింక పిల్ల మీద దూకి చంపేసినా జానపద కథ ఒకటి ఉంది. ఆ కథ యోగి ఆదిత్యనాథ్ పాలనలో ఇప్పుడు పునరావృతమవుతున్నట్టుంది. ఇవాళ అనని మాటలు కూడా నేరమే అంటు న్నారు. రేపు అసలు నువ్వు ఉండడమే, నీ ఉనికే, నీ శ్వాసే నేరం అంటారా? భారత న్యాయ వ్యవస్థకు ఏం జరుగుతున్నది?



ఎన్ వేణుగోపాల్
కవి, సాహిత్య విమర్శకుడు, పాత్రికేయుడు, ప్రజా వక్త, వ్యాఖ్యాత, రాజకీయ, ఆర్థిక,సామాజిక అంశాలపై కాలమిస్ట్.

# భారత్-అఫ్ఘాన్ సంబంధాలు

## వ్యూహాత్మక మలుపు




భారత్-అఫ్ఘానిస్థాన్ సంబంధాలు ఎప్పుడూ సంక్లిష్టమైనవే. భూగోళం, చరిత్ర, రాజకీయాలు, విభిన్న వైఖరులు, విలువల మధ్య సంఘర్షణలు ఇందులో ప్రతిబింబిస్తాయి. 2021లో తాలిబాన్ మళ్లీ అధికారంలోకి రావడంతో ఈ సంబంధాలు మరింత గందరగోళంగా మారాయి. అప్పటి నుంచి భారత్ తన విధానాన్ని జాగ్రత్తగా మార్చుకుంటూ వచ్చింది. 'భారత్-అఫ్ఘాన్ స్నేహం అవసరమా?' అనే ప్రశ్నకు సరళ సమాధానం లేదు. వైరుధ్యాలను భరించడం, వాస్తవిక అవసరాలు అర్థం చేసుకోవడం, దీర్ఘకాలిక వ్యూహాలు పరిగణనలోకి తీసుకోవడం ద్వారానే జవాబు దొరుకుతుంది. ఇటీవలి పరిణామాలు - ముఖ్యంగా 2025లో భారత్ కాబూల్‌లో తన టెక్నికల్ మిషన్‌ను ఎంబసీగా అప్‌గ్రేడ్ చేయడం, అఫ్ఘాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకీ భారత్ పర్యటన - ఈ సంబంధాలకు కొత్త మలుపు ఇచ్చాయి. ఇవి పాకిస్తాన్-తాలిబాన్ సంబంధాలు దిగజారడం వల్ల వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నట్టు కనిపిస్తున్నాయి. అక్టోబర్ 10, 2025న జరిగిన జాయింట్ స్టేట్‌మెంట్‌లో ఇరు దేశాలు విస్తృత సహకారం పై చర్చలు జరిపాయి, ఇది భారత్ తన ప్రాంతీయ వ్యూహాన్ని మార్చుకున్నట్టు సూచిస్తుంది.

### చారిత్రక బంధం VS విలువల ఘర్షణ

చారిత్రకంగా భారత్-అఫ్ఘాన్ మధ్య లోతైన సాంస్కృతిక, ఆర్థిక బంధాలు ఉన్నాయి. బౌద్ధం, గాంధార శిల్పకళ నుంచి ఆధునిక కాలంలో భారత్ అందించిన 3 బిలియన్ డాలర్లకు పైగా అభివృద్ధి సహాయం వరకు - ఈ సామరస్యం స్పష్టం. భారత్ అఫ్ఘాన్ పార్లమెంట్ భవనం, సల్మా డ్యామ్, రోడ్లు, హాస్పిటల్స్ వంటి ప్రాజెక్టులు నిర్మించింది, ఇది అఫ్ఘాన్ ప్రజలతో భారత్‌కు మంచి ఇమేజ్ తెచ్చింది. కానీ తాలిబాన్ పాలన భారత ప్రజాస్వామ్య, లౌకిక సూత్రాలకు ప్రత్యక్ష విరుద్ధం. స్త్రీల హక్కులు తుంగలో తొక్కడం - విద్య, ఉద్యోగాలు, సామాజిక స్వేచ్ఛలు కోల్పోవడం - భారత్‌లో మహిళా సమానత్వం, హక్కులకు ప్రాధాన్యత ఇచ్చే సమాజానికి పెద్ద సవాలు. మానవ హక్కుల ఉల్లంఘనలు - వ్యతిరేకులపై దాడులు, కఠిన శిక్షలు - ప్రపంచవ్యాప్త విమర్శలకు దారితీశాయి. భారత విదేశాంగ విధానం ప్రజాస్వామ్యం, మానవీయ విలువలపై ఆధారపడి ఉంటుంది కాబట్టి, తాలిబాన్‌తో సంబంధాలు కష్టమే. భారత్ తాలిబాన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించలేదు, ఇది పెద్ద అడ్డంకి. గుర్తింపు లేకుండా పూర్తి ద్వైపాక్షిక సంబంధాలు, విస్తృత ఆర్థిక సహాయం అసాధ్యం. అయినా, 2025లో భారత్ తన టెక్నికల్ మిషన్‌ను ఎంబసీగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా ప్రాక్టికల్ అప్రోచ్ తీసుకుంది. ఇది విలువలను వదలకుండా వ్యూహాత్మక ప్రయోజనాలు చూసుకునే ప్రయత్నం. ఈ వైరుధ్యాలు ముఖ్యమే, కానీ వాటిని మాత్రమే ప్రాధాన్యత ఇస్తే భారత్ భద్రతా, వ్యూహాత్మక ప్రయోజనాలు దెబ్బతింటాయి. ఉదాహరణకు, అఫ్ఘాన్ ప్రజలకు మానవతా సహాయం మందులు, ఆహారం, విద్యా సహకారం అందించడం ద్వారా భారత్ తన మంచి ఇమేజ్‌ను కాపాడుకుంటోంది. అక్టోబర్ 2025లో ముత్తాకీతో జరిగిన చర్చల్లో మహిళల హక్కులు, మానవ హక్కులు ప్రస్తావనకు వచ్చాయి, అయితే భారత్ షరతులతో ముందుకు సాగుతోంది. ఇది భారత్ డిప్లమసీలో రియలిజం పెరిగినట్టు సూచిస్తుంది, ఎందుకంటే తాలిబాన్ పాలనలో అఫ్ఘాన్ మహిళలు, మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి.

### పాక్ కారకం: వ్యూహాత్మక లాభం

భారత్-అఫ్ఘాన్ సంబంధాల్లో పాకిస్తాన్ కేంద్ర బిందువు. చారిత్రకంగా అఫ్ఘాన్ భారత్‌కు పాక్‌పై వ్యూహాత్మక లాభం ఇచ్చింది. పాక్-తాలిబాన్ సంబంధాలు దిగజారడం - ముఖ్యంగా 2025లో పాక్‌పై తాలిబాన్ ఆరోపణలు, సరిహద్దు ఘర్షణలు - భారత్‌కు అవకాశం కల్పించాయి. పాక్ తూర్పు సరిహద్దు (భారత్) మాత్రమే కాకుండా పశ్చిమ సరిహద్దు (అఫ్ఘాన్)లోనూ సమస్యలు ఎదుర్కొంటే, దాని సైనిక దృష్టి విభజితమవుతుంది. ఇది భారత్‌కు 'టూ-ఫ్రంట్' యుద్ధ భయాన్ని తగ్గిస్తుంది, ముఖ్యంగా చైనా సరిహద్దు సమస్యల మధ్య. అఫ్ఘాన్‌లో భారత ఉనికి మధ్య ఆసియాలో ప్రాంతీయ పాత్రను బలోపేతం చేస్తుంది. పాక్ ప్రయత్నాలను ఎదుర్కొంటుంది, ఇరాన్, మధ్య ఆసియా దేశాలతో చబాహర్ పోర్ట్ వంటి కనెక్టివిటీ ప్రాజెక్టులకు మద్దతిస్తుంది. 2025లో అఫ్ఘాన్ FM ముత్తాకీ భారత్ పర్యటనలో మైనింగ్, హైడ్రో ప్రాజెక్టులు, ట్రేడ్, ఇన్వెస్ట్‌మెంట్స్ పై చర్చలు జరిగాయి. భారత్ అఫ్ఘాన్‌కు విద్యా స్కాలర్‌షిప్స్, ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ అందిస్తోంది, ఇది సాఫ్ట్ పవర్ వ్యూహానికి ఉదాహరణ. పాక్ ISI అఫ్ఘాన్ భూభాగాన్ని ఉగ్రవాద శిక్షణా కేంద్రాలుగా ఉపయోగించడం వంటి గత అనుభవాలు భారత్‌ను మరింత అప్రమత్తం చేశాయి. ఉదాహరణకు, కాందహార్ హైజాక్, ముంబై దాడుల్లో అఫ్ఘాన్ లింకులు ఉన్నాయి. కాబట్టి, పాక్ ద్వేషం కాదు, శుద్ధ వ్యూహాత్మక అవసరాలే ఈ సంబంధాలను బలపరుస్తాయి. పాక్-తాలిబాన్ ఘర్షణలు - డ్యూరాండ్ లైన్ వివాదం, TTP దాడులు - భారత్‌కు లాభం చేకూరుస్తున్నాయి.


### భద్రతా ఆందోళనలు: తటస్థీకరణ అనివార్యం

పాక్ ప్రభావంలోని అఫ్ఘాన్ భారత భద్రతకు గంభీర ప్రమాదం. కాశ్మీర్‌లో ఉగ్రవాదానికి పాక్ ఇంటెలిజెన్స్ అఫ్ఘాన్ భూభాగాన్ని సురక్షిత ఆశ్రయంగా మార్చవచ్చు. లష్కర్-ఇ-తయ్యిబా, జైష్-ఇ-మహమ్మద్ వంటి గ్రూపులు అఫ్ఘాన్‌లో ఆశ్రయం పొందడం గతంలో జరిగింది. ఈ బెదిరింపు తటస్థీకరణకు తాలిబాన్‌తో నిమగ్నత అనివార్యం. 2025లో భారత్ ఎంబసీ రీఓపెనింగ్ ద్వారా డిప్లమాటిక్ ఛానెల్స్ బలపడ్డాయి, ఇది ఉగ్రవాద నియంత్రణలో సహకారానికి దారి తీస్తుంది. తాలిబాన్ తన అంతర్గత విధానాలలో మార్పులు చూపకపోయినా, భారత్ మానవతా సహాయం - ఆహారం, మందులు, విద్యా సహకారం - ద్వారా ప్రజలతో సంబంధాలు పెంచుతోంది. ఇది భారత్ పెట్టుబడులు - సల్మా డ్యామ్, అఫ్ఘాన్ పార్లమెంట్ భవనం, చబాహర్ ట్రేడ్ రూట్ - రక్షణకు సహాయపడుతుంది. అయితే, తాలిబాన్ మహిళల హక్కులు, మానవ హక్కులపై మార్పు చూపకపోతే ఈ నిమగ్నత అస్థిరమే. భారత్ తన విలువలు వదలకుండా, భద్రతా ప్రమాదాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగుతోంది. ఉదాహరణకు, అక్టోబర్ 2025లో జరిగిన మీటింగ్స్‌లో ఉగ్రవాద నిర్మూలన, సరిహద్దు సెక్యూరిటీ పై ఒప్పందాలు కుదిరాయి. ఇది భారత్‌కు కాశ్మీర్ ఇష్యూలో ఒత్తిడి తగ్గిస్తుంది, మరియు మధ్య ఆసియా రిసోర్సెస్ - మైనరల్స్, ఎనర్జీ - పై అక్సెస్ పెంచుతుంది.

### భవిష్యత్ దిశ: ప్రాక్టికల్ ఎంగేజ్‌మెంట్‌తో ముందడుగు

పూర్తి విస్మరణ భారత విలువలకు అనుగుణమే కానీ, వ్యూహాత్మక శూన్యత సృష్టిస్తుంది. పాక్, చైనా దాన్ని నింపుకుంటాయి, భారత పెట్టుబడులు ప్రమాదంలో పడతాయి. ప్రస్తుతం భారత్ అనుసరిస్తున్న ప్రాక్టికల్ ఎంగేజ్‌మెంట్ - అధికారిక గుర్తింపు లేకుండా మానవతా సహాయం, తటస్థ రంగాల్లో సంభాషణ - సమతుల్య మార్గం. 2025లో ఎంబసీ అప్‌గ్రేడ్, ముత్తాకీ పర్యటన దీన్ని బలపరిచాయి. భవిష్యత్తులో తాలిబాన్ మితవాదంగా మారితే - మహిళల హక్కులు మెరుగుపరిస్తే, ఉగ్రవాదాన్ని నియంత్రిస్తే - పరిమిత గుర్తింపు, విస్తృత సహాయం సాధ్యం. మైనింగ్, హైడ్రో ప్రాజెక్టులలో ఇన్వెస్ట్‌మెంట్స్ అఫ్ఘాన్ స్థిరత్వానికి, భారత్ ప్రాంతీయ ప్రభావానికి సహాయపడతాయి. అయితే, తాలిబాన్ స్వభావంలో గణనీయ మార్పు అవసరం, ఇది కష్టసాధ్యమే. సారాంశంగా, అఫ్ఘాన్‌తో స్నేహం అవసరమే కానీ సాంప్రదాయికమైనది కాదు. వ్యవహారిక, ఆసక్తి ఆధారిత, షరతులతో కూడిన భాగస్వామ్యం కావాలి. విలువలు వదలకుండా వ్యూహాత్మక ప్రయోజనాలకు తాలిబాన్‌తో పరిమిత నిమగ్నత కొనసాగించాలి. లక్ష్యం: అఫ్ఘాన్‌ను భారత్ వ్యతిరేక శక్తుల చేతుల్లోకి వెళ్లకుండా చూడటం, మానవతా సహాయం, పెట్టుబడుల రక్షణ. ఇటీవలి పరిణామాలు ఈ దిశలో ముందడుగు. విజయం తాలిబాన్ ప్రవర్తనతోపాటు భారత విజ్ఞత, వ్యూహ నైపుణ్యంపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం విస్మరణ కంటే వ్యవహారిక నిమగ్నతే ఉత్తమ మార్గం. ఈ మార్పులు దక్షిణాసియా భౌగోళిక రాజకీయాలను మారుస్తున్నాయి, భారత్ తన ప్రయోజనాలను కాపాడుకోవడంలో విజయవంతమవుతోంది. భవిష్యత్తులో ఈ

సంబంధాలు మరిన్ని సవాళ్లు ఎదుర్కొనవచ్చు, ముఖ్యంగా చైనా ప్రభావం పెరిగితే. అయితే, భారత్ డిప్లమసీ దీన్ని సమర్థవంతంగా నిర్వహిస్తుందని ఆశిస్తున్నాం.




డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# భారత్‌లో ప్రాణాలు మింగే రహదారులు



భారత్‌లో 63.31 లక్షల కిలోమీటర్ల రహదారులు ప్రపంచంలోనే రెండో అతిపెద్ద నెట్‌వర్క్. ప్రతి రోజు కోట్లాది మంది ఈ మార్గాలపై ప్రయాణిస్తారు. కానీ ఇదే రోడ్లు వేలాది ప్రాణాలను మింగుతున్నాయి. జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) 2023 గణాంకాలు భయపెట్టే వాస్తవాలు వెల్లడిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 4,64,029 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిలో 1,73,826 మంది మరణించగా, 4,47,969 మంది గాయపడ్డారు. 2022తో పోలిస్తే ప్రమాదాలు 17,261 పెరిగాయి, మరణాలు 12,000కు పైగా పెరి గాయి. అంటే సగటున ప్రతి గంటకు 20 మందికి పైగా రోడ్లపై ప్రాణాలు విడిచారు. 2024లో ఈ సంఖ్య మరింత పెరిగి సుమారు 1.8 లక్షల మరణాలకు చేరుకుందని అంచనాలు. ఉత్తరప్రదేశ్ (27,000 మరణాలు), తమిళనాడు (18,347), మహారాష్ట్ర (15,000), కర్ణాటక (13,000), మధ్యప్రదేశ్ (12,000) రాష్ట్రాలు ప్రమాదాల్లో అగ్రస్థానంలో ఉన్నాయి. ఇవన్నీ పరిశ్రమల విస్తరణ, పట్టణీకరణ వేగంగా సాగుతున్న రాష్ట్రాలే. అభివృద్ధి పరుగులు పెడుతున్న చోట భద్రత మాత్రం వెనుకబడుతోంది. ద్విచక్ర వాహనాల వల్ల 46 శాతం మరణాలు, పాదచారుల మరణాలు 16 శాతం. జాతీయ రహదారులపై 35 శాతం, రాష్ట్ర రహదారులపై 23 శాతం మరణాలు నమోదు. అత్యధిక ప్రమాదాలు సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్య - కాంతి తగ్గుదల, రద్దీ, అలసట కలిసిన సమయం. ప్రపంచ వ్యాప్తంగా రోడ్డు మరణాల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది - 2021లోనే 1.55 లక్షల మరణాలు, ఇప్పుడు అది 1.8 లక్షలకు చేరుకుంది. చైనా, అమెరికా వంటి దేశాలతో పోలిస్తే భారత్‌లో జనాభాకు తగినట్టు మరణాలు ఎక్కువ. రోడ్డు భద్రతలో భారత్ ప్రపంచ సూచికలో 120వ స్థానంలో ఉంది.



### భయానక గణాంకాలు: 2024లో 1.8 లక్షల మరణాలు

ఎన్‌సీఆర్‌బీ డేటా ప్రకారం, 2023లో రోజుకు సగటున 476 మంది మరణించారు. ఇది 2022లో 462 కంటే ఎక్కువ. 2024 అంచనాల ప్రకారం మరణాలు 1.8 లక్షలకు చేరాయి, ఇందులో 30,000 మంది హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపినవారు. 66 శాతం మరణాలు హెల్మెట్ లేకపోవడం వల్లే. ఉత్తరప్రదేశ్‌లోనే 27,000కు పైగా మరణాలు - దేశ మొత్తం మరణాల్లో 15 శాతం. తమిళనాడు (18,347), మహారాష్ట్ర (15,000), కర్ణాటక (13,000), మధ్యప్రదేశ్ (12,000) అనుసరిస్తున్నాయి. ఈ రాష్ట్రాల్లో జనాభా దట్టత్వం, వాహనాల సంఖ్య (2024లో 35 కోట్లు దాటిన వాహనాలు), పరిశ్రమలు పెరిగాయి. కానీ రోడ్ల రూపకల్పన, ట్రాఫిక్ నిర్వహణ సరిపడట్లేదు. ద్విచక్ర వాహనాలు (46 శాతం మరణాలు) ప్రమాదాలకు ప్రధాన కారణం. హెల్మెట్ లేకుండా నడపడం, అతి వేగం కలిసి ప్రాణాంతకం అవుతున్నాయి. పాదచారులు (16 శాతం) జెబ్రా క్రాసింగ్స్ లేకపోవడం, సైడ్‌వాక్స్ ఆక్రమణల వల్ల బలవుతున్నారు. జాతీయ రహదారులు (35 శాతం మరణాలు) హైస్పీడ్ కారిడార్లు అయినా, బ్లాక్ స్పాట్స్ (దేశంలో 5,803 బ్లాక్ స్పాట్స్), గుంతలు, వెలుతురు లోపాలు ప్రమాదాలు పెంచుతున్నాయి. సాయంత్రం 6-9 గంటల మధ్య 25 శాతం ప్రమాదాలు - ఆఫీసు టైమ్ రద్దీ, డ్రైవర్ల అలసట, మద్యం ప్రభావం కలిసి దారుణం సృష్టిస్తున్నాయి. 2024లో ఒక్క రోజులో అత్యధికంగా 600 మరణాలు నమోదయ్యాయి - ఇది ఒక చిన్న విమాన ప్రమాదం స్థాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకారం, భారత్‌లో రోడ్డు మరణాలు ప్రపంచ మొత్తంలో 11 శాతం - చైనా (2.5 లక్షలు), అమెరికా (40,000) కంటే ఎక్కువ. జనాభాకు తగినట్టు మరణ రేటు 13.3/లక్ష జనాభా, ఆస్ట్రేలియా (5.2), యూరప్ (9.3) కంటే ఎక్కువ.

### నిర్లక్ష్యం వెనుక: అతి వేగం, మద్యం, మొబైల్ వాడకం

ప్రమాదాలకు 58 శాతం అతి వేగం కారణం. నిర్లక్ష్య డ్రైవింగ్ (25 శాతం), మద్యం సేవించి నడపడం (10 శాతం), మొబైల్ వాడకం (8 శాతం), సిగ్నల్ జంపింగ్ (5 శాతం) అనుసరిస్తున్నాయి. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం (70 శాతం మరణాలు), సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం (50 శాతం కారు మరణాలు), మైనర్లు వాహనాలు నడపడం (5 శాతం కేసులు) వ్యక్తిగత నిర్లక్ష్యాలు. మౌలిక లోపాలు - రోడ్డు గుంతలు (15 శాతం), వెలుతురు లేకపోవడం (12 శాతం), మలుపుల వద్ద సైన్ బోర్డులు లేకపోవడం (10 శాతం) - ప్రాణాలు తీస్తున్నాయి. ఉదాహరణకు, ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేలో 2024లో 250ం మరణాలు గుంతలు, వేగం వల్ల. మద్యం సేవించి డ్రైవింగ్ కేసులు 60,000కు పైగా నమోదు - కానీ శిక్షలు కేవలం 25 శాతం కేసుల్లోనే. మొబైల్ వాడకం వల్ల ప్రమాదాలు 35 శాతం పెరిగాయి, ముఖ్యంగా యువతలో (18-35 ఏళ్ల 60 శాతం మరణాలు). మైనర్ల డ్రైవింగ్ - 15-18 ఏళ్లలోపు - 12,000ం కేసులు, తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వడం ప్రధాన కారణం. ట్రక్కులు, బస్సుల వల్ల 20 శాతం మరణాలు - ఓవర్‌లోడింగ్, డ్రైవర్ అలసట (లాంగ్ హాల్ డ్రైవింగ్) కారణాలు. రాత్రి ప్రమాదాలు 40 శాతం - వెలుతురు లోపం, స్లీప్ అప్నియా వంటి సమస్యలు. ప్రపంచవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు 13 లక్షల మరణాలు కలిగిస్తున్నాయి, భారత్ దానికి 13 శాతం దోహదం చేస్తోంది.

### సంఖ్యల వెనుక బాధ: కుటుంబాలు కూలిపోతున్నాయి, ఆర్థిక నష్టం

రోడ్డు ప్రమాదం కేవలం సంఘటన కాదు - కుటుంబం కూలిపోయిన కథ. ఆదాయం తెచ్చే వ్యక్తి చనిపోతే, ఆ నష్టం సంఖ్యలతో కొలవలేం. ప్రపంచ బ్యాంకు అంచనా ప్రకారం, ప్రమాదాల వల్ల భారత్ జీడీపీలో 3-5 శాతం (సుమారు 7-10 లక్షల కోట్లు) నష్టపోతోంది. ఒక్కో మరణానికి ఆర్థిక నష్టం 50 లక్షలు నుంచి 1 కోటి వరకు - చికిత్స ఖర్చులు, ఉద్యోగ నష్టం, ఇన్సూరెన్స్ క్లెయిమ్స్. గాయపడినవారు - 4.48 లక్షల మంది - చికిత్స ఖర్చులు (సగటున 2-5 లక్షలు), ఉద్యోగ నష్టం వల్ల కుటుంబాలు అప్పుల పాలు. ఉదాహరణకు, హైదరాబాద్‌లో ఒక ద్విచక్ర వాహన డ్రైవర్ మరణంతో కుటుంబం రోడ్డున పడింది - ఇలాంటి కథలు లక్షల్లో ఉన్నాయి. బాలలు, యువకులు (18-35 ఏళ్ల 60 శాతం మరణాలు) - దేశ భవిష్యత్తు దెబ్బతింటోంది. వికలాంగుల సంఖ్య పెరుగుతోంది - 2024లో 2 లక్షల మంది కాళ్లు, చేతులు కోల్పోయారు. ప్రమాదాలు ఆర్థిక నష్టం మాత్రమే కాదు, సామాజిక దారిద్ర్యం కూడా సృష్టిస్తున్నాయి. మహిళలు, పిల్లలు వితంతువులు, అనాథలుగా మారుతున్నారు. ప్రపంచ బ్యాంకు ప్రకారం, రోడ్డు ప్రమాదాలు పేదరికాన్ని 20 శాతం పెంచుతున్నాయి. ఇన్సూరెన్స్ కవరేజ్ తక్కువ - కేవలం 30 శాతం వాహనాలకు మాత్రమే.

### చైతన్యంతో మార్పు: భద్రతే అభివృద్ధి దారి, ప్రభుత్వ చర్యలు అవసరం

రోడ్డు భద్రత ట్రాఫిక్ పోలీసుల బాధ్యత మాత్రమే కాదు - ప్రతి పౌరుడి సంస్కారం. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకపోవడం, వేగ పరిమితులు పాటించడం - చట్ట భయంతో కాక మనస్సాక్షితో చేయాలి. ప్రభుత్వం స్పీడ్ గన్స్, సీసీ కెమెరాలు (2024లో 1 లక్ష కెమెరాలు ఇన్‌స్టాల్), డ్రంక్ డ్రైవ్ తనిఖీలు కఠినతరం చేయాలి. మైనర్ల డ్రైవింగ్‌పై తల్లిదండ్రులపై కఠిన చర్యలు - వాహనం జప్తు, జరిమానా (మోటార్ వెహికల్స్ యాక్ట్ 2019 ప్రకారం రూ.25,000 జరిమానా). లైసెన్సు జారీలో కఠినత - డ్రైవింగ్ టెస్టులు, థియరీ పరీక్షలు మెరుగుపరచాలి. మౌలిక సదుపాయాలు - రోడ్ల రూపకల్పనలో భద్రత ప్రాధాన్యం, బ్లాక్ స్పాట్స్ గుర్తింపు (దేశంలో 5,803 బ్లాక్ స్పాట్స్, 2024లో 2,000 రెక్టిఫై), సైన్ బోర్డులు, రిఫ్లెక్టివ్ చారలు, ఎల్ఈడీ స్ట్రీట్ లైట్లు అవసరం. రోడ్ల నిర్మాణంలో ఐఆర్‌బీ స్టాండర్డ్స్ కఠిన అమలు. అవగాహన కార్యక్రమాలు - స్కూళ్లలో రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ (సేఫ్ కిడ్స్ ఫౌండేషన్ వంటి ఎన్‌జీఓలు), మీడియా క్యాంపెయిన్స్ (మోటార్ వెహికల్స్ యాక్ట్ అమలు). భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది - రహదారులు (భారత మాల ప్రాజెక్ట్‌తో 1 లక్ష కి.మీ. అదనం), వాహనాలు పెరుగుతున్నాయి. కానీ భద్రత లేకుండా అభివృద్ధి గమ్యం చేరదు. ప్రతి డ్రైవర్, పాదచారి బాధ్యత గుర్తిస్తే మార్పు మొదలవుతుంది. రోడ్లను కాంక్రీట్‌తో కాక చైతన్యంతో బలపరచాలి. రక్తం చిందకుండా దేశం ముందుకు సాగాలి. స్వీడన్, యూకే వంటి దేశాల్లో 'విజన్ జీరో' పాలసీతో మరణాలు దాదాపు జీరోకు చేరాయి - భారత్ కూడా అదే దారి పట్టాలి. మోటార్ వెహికల్స్ యాక్ట్ 2019 అమలు, ఐ-రాడ్ యాప్ వంటి టెక్నాలజీలు మరింత విస్తరించాలి.



జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

# ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేయాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు,ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజకవర్గాల వారిగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4 కేటగిరీలుగా విభజించడం జరిగిందని తెలిపారు. ఇందులో కేటగిరీ ఏ లో 1987 కంటే ముందు జన్మించి 2002, 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ బి లో 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ సి లో 1987 నుంచి 2002 మధ్యలో జన్మించి 2025 ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ డి లో 2002-2007 మధ్యలో జన్మించిన వారిగా విభజించడం జరిగిందని తెలిపారు. అన్ని కేటగిరీలు కలిపి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3 కోట్ల 33 లక్షల ఓటర్లను మ్యాపింగ్ చేయడం జరిగిందని తెలిపారు. మొదట మ్యాపింగ్ చేయబడిన కేటగిరి ఏ జాబితాను బి ఎల్ ఓ యాప్ ద్వారా నిర్ధారించుకోవాలని, తద్వారా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా పోర్టల్ లో నమోదు చేయబడుతుందని తెలిపారు. అనంతరం కేటగిరి సి, క్యాటగిరి డి లలోని ఓటర్లను కేటగిరి ఏ కు మ్యాపింగ్ చేయాలని,ఈ ప్రక్రియను ఎఈఆర్ఆఓల ఆధ్వర్యంలో బిఎల్ఓ సూపర్ వైజర్లు, బిఎల్ఓలు బిఎల్ఓ యాప్ ద్వారా వచ్చే శనివారం నాటికి పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ బి.యం.సంతోష్ మాట్లాడుతూ బిఎల్ఓలు, ఎల్ ఓ సూపర్ వైజర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, మొదట కేటగిరి ఏ ఓటరు జాబితాను బిఎల్ఓ యాప్ ద్వారా నిర్ధారించిన తర్వాత కేటగిరి సి,డి లను కేటగిరి ఏకు లింక్ చేయడం జరుగుతుందని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా,నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ అలివేలు, తహసిల్దార్ మల్లికార్జున్, ఎన్నికల విభాగం అధికారి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈవీఎంలు



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద ఈవీఎం గోడౌన్ లో ఈవీఎంలు కట్టు దిట్టమైన భద్రత మధ్య ఉన్నాయని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తెలిపారు.శనివారం ఇక్కడి ఈ వీ ఎం గోడౌన్ ను ఆయన పరిశీలించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా గోడౌన్‌ను సందర్శించడం జరిగిందని ఆయన చెప్పారు.ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను చెక్ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును గమనించి పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ వెంట ఆర్.డి.ఓ. రామచందర్ నాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారినిలు అఖిల ప్రసన్న, రాణి దేవి,సిబ్బంది ఉన్నారు.

## భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్‌చెరు



**పటాన్‌చెరు, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా పటాన్చెరు నియోజకవర్గం నిలుస్తోందని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఉత్తర భారతీయులు ప్రతి ఏటా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్ పూజ పురస్కరించుకొని శనివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని తన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని పటాన్చెరు, ఇస్నాపూర్, పాశమైలారం, బొల్లారం, రామచంద్రాపురం, అమీన్పూర్, గుమ్మడిదల, బొంత పల్లి, ఖాజీపల్లి, తదితర ప్రాంతాలలో నివసిస్తున్న ఉత్తర భారతీయులకు చెరుకును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఉపాధి కోసం పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ పరిశ్రమలలో పనిచేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరి సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో సైతం తగు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. గత 20 సంవత్సరాలుగా పటాన్చెరువు సాకి చెరువు కట్ట పైన ఛట్ పూజ కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. త్వరలో సాకి చెరువు కట్ట పైన సూర్య దేవాలయం, ఫంక్షన్ హాల్ నిర్మించబోతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ వారికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, చందోల్ మాజీ ఎమ్మెల్యే మనోజ్ కుమార్ సింగ్, గూడెం మధుసూదన్ రెడ్డి, ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

# అకాల వర్షంతో తడిసి కొట్టుకుపోయిన ధాన్యం

- ఇబ్బందులు పడుతున్న రైతులు
- రాజగోపాల్ పేటలో అకాల వర్షంతో తడిసిన ధాన్యం
- కేంద్రాలు ప్రారంభించిన కొనుగోలు చేయని ధాన్యం



**నంగునూరు, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాల్ పేట గ్రామంలో వర్షాలతో ధాన్యం తడిచిపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు శనివారం రోజు కురిసిన వర్షానికి ధాన్యం కొట్టుకుపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది వరద నీరు పొలాల్లోకి చేరడంతో రెండు మూడు రోజుల వరకు వరి కోతలు నిలిచిపోయినట్లేనని రైతులు ఆవేదన చెందుతున్నారు తడిసిన ధాన్యం మొలకెత్తి నష్టపరుస్తుందని ఆందోళన చెందుతున్నారు అధికారులు స్పందించి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతుల కోరారు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం పది రోజులైనా వడ్లు కొనుగోలు చేయడం లేదని ప్రజాప్రతినిధులు టిఆర్ఎస్ నాయకులు ఆరోపించారు రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అమ్ముకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు కెసిఆర్ హయంలో వడ్లు కల్లాలకు రాకముందే సంచులు పంపించి మిల్లులు తయ్యప్ చేపించి ట్రాన్స్పోర్ట్ ఏర్పాటు చేసి మరీ రైతుల నుంచి వడ్లు కొనుగోలు చేశారన్నారు కానీ రేవంత్ రెడ్డి సర్కారు పది రోజులైనా వడ్లు కొనుగోలు చేయడం లేదన్నారు కోతులు పందికొక్కులు, వడ్లను నాశనం చేస్తున్నాయని రైతులంతా ఇంటికి వెళ్లకుండా కల్లాల కాడ కావాలి కాస్తున్నారని అన్నారు 100 కారణాలు చూపించి చాలామందికి రుణమాఫీ చేయలేదని ఆరోపించారు రైతులకు గన్ని బ్యాగులు తార్పలింగ్ కవర్లు ఇచ్చే తెలివి కూడా రేవంత్ రెడ్డికి లేదన్నారు రైతులు చాలా ఇబ్బందులు పడుతున్న అధికారులు సైతం స్పందించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## సైనిక లాంచలానతో జవాన్ వెంకటరామిరెడ్డి అంత్యక్రియలు



**వికారాబాద్, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** దేశ సరిహద్దు జమ్ము కాశ్మీర్ లో విధినిర్వహణలో అనారోగ్యంతో అమరుడైన వెంకట్రాంరెడ్డి అంత్యక్రియలు శనివారం వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం వట్టిమినేపల్లి లో సైనిక లాంచలాలతో అంత్యక్రియలు నిర్వహించారు, సైనిక బలగాలు, మాజీ సైనికులు, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మాజీ సైనికులు జిల్లా అధ్యక్షులు ఇ. యాదయ్య, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పెద్ద ఎత్తున హాజరై నివాళులు అర్పించారు.

## వంద పడక ఆసుపత్రిలో వసతులు కల్పించండి




**మానవపాడు, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** హైదరాబాదులో ని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ ను శనివారం కలిసి నియోజకవర్గంలోని.. వంద పడకల ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పిస్తూ సిబ్బందిని నియమించాలని వినతి పత్రం అందజేశారు.ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ.. వంద పడకల ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలని ఆస్పత్రిలో సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సిబ్బందిని మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

## ముగ్గురు దొంగలు అరెస్టు




**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో శనివారము ఉదయం ముగ్గురు దొంగలను అరెస్టు చేసి రిమాండ్ తరలిస్తున్నట్లు గద్వాల డిఎస్పి మొగులయ్య సీఐ కార్యాలయంలో విలేకరులతో అన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ మొగిలయ్య మాట్లాడుతూ జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు శనివారం ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా గద్వాల వైపు నుండి వస్తున్న ముగ్గురు వ్యక్తులను అనుమానంతో ఆపి విచారించగా వారి వద్ద దొంగతనాలకు సంబంధించిన ముఖ్యమైన వివరాలు బయటపడ్డాయని ఆయన అన్నారు. కేటీ దొడ్డి మండలం చింతలకుంట గ్రామానికి చెందిన కురువ చిన్న వెంకన్న, అదే మండలము అదే గ్రామానికి చెందిన మర్రి ప్రాణేష్, కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా చిట్టి మల్కాపురం గ్రామానికి చెందిన కురువ గిరీష్ అనే వ్యక్తుల నుండి ఐదున్నర తులాల బంగారం నగలు, ఒక లక్ష 20 వేల రూపాయల నగదు, రెండు మోటార్ సైకిల్‌లను రికవరీ చేసినట్లు, వీరు గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని మద్దెల బండ, గద్వాల మండల పరిధిలోని జమ్మిచెడు, కేటీ దొడ్డి మండల పరిధిలోని చింతలకుంట, ధరూరు మండల పరిధిలోని మార్లబీడు గ్రామాలలో వీరు తాళం వేసిన ఇళ్లను గుర్తించి పగటిపూట ఇనుపరాడ్లతో తాళాలను పగలగొట్టి ఇంట్లో ఉన్న బంగారు నగలు, నగదు దొంగతనం చేసి అమ్ముకొని జల్సాలు చేసేవారని ఆయన అన్నారు. ఈ గ్యాంగ్‌లో మల్కాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని అతని కోసం పోలీసులు గాలిస్తున్నారని ఈ సందర్భంగా డిఎస్పీ మొగిలయ్య అన్నారు. ఈ సమావేశంలో గద్వాల సిఐ టంగుటూరి శ్రీను,మల్దకల్ ఎస్సై నందికర్ పాల్గొన్నారు.

## మరో రెండు రోజుల్లో శ్రీ చైతన్య పాఠశాల పునః ప్రారంభం




**శేరిలింగంపల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి మండలం పరిధిలో బర్నింగ్ ఇష్యూగా మారిన శేర్లింగంపల్లి శ్రీచైతన్య పాఠశాల సీజ్ వ్యవహారము ఓ కొలిక్కి వస్తున్నట్లు కనిపిస్తోంది. గత వారం రోజులుగా ఉన్నతాధికారుల ఆదేశాలపేరుతో శేరిలింగంపల్లి సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పాఠశాలను సీజ్ చేయడంతో దాదాపు వెయ్యి మంది విద్యార్థులు ఇంటి వద్దనే ఉంటుండగా వారి చదువులు అటకెక్కిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో విద్యార్థుల భవితవ్యాన్ని భూమికగా చేసుకొని 'జనంసాక్షి' దినపత్రిక విశ్లేషణాత్మక కథనాన్ని ప్రచురించడంతోపాటు ఓవైపు అధికారులను, మరోవైపు విద్యార్థుల తల్లిదండ్రులను సమన్వయం చేసుకుంటూ పాఠశాలను తిరిగి ప్రారంభించడానికి తనవంతు పాత్రను కొనసాగిస్తోంది. ఈ క్రమంలో శనివారం శ్రీ చైతన్య పాఠశాలల ఏజిఎం శ్రీనివాసరెడ్డితో 'జనంసాక్షి' ఫోన్ ద్వారా వివరణ కోరగా మరో రెండు రోజుల్లో సమస్య కొలిక్కి రావచ్చని, పాఠశాల తిరిగి ప్రారంభం కావచ్చు అని వెల్లడించారు. శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు సైతం విడతల వారీగా పాఠశాలకు విచ్చేసి యాజమాన్యంతో గట్టిగా చర్చించడం జరిగిందని, ఫలితం ఆశాజనకంగా ఉన్నట్లు వారు మీడియాకు వెల్లడించారు.

## ప్రధాని మోదీ నిర్ణయాలతో అన్ని రంగాల్లో దేశం పురోగతి

- మాజీ గవర్నర్ దత్తాత్రేయ



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** దేశ ప్రధాని నరేంద్ర మోదీ గత 12 ఏళ్ల పాలనలో తీసుకున్న నిర్ణయాలతో దేశం అన్ని రంగాల్లో పరిగణిస్తున్నదని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు.శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో పట్టణ బిజెపి అధ్యక్షుడు పోష ల్ వినోద్ కుమార్ నూతన గృహాన్ని దర్శించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమశిక్షణా సంఘం సభ్యుడు నాగురావు నామాజీ,జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ తో కలిసి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో అన్నిరంగాల్లో ఎదురులేని పురోగతి సాధిస్తున్నదని అన్నారు.ప్రధానంగా రైతుల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు.రైతుల కోసం దేశంలో వెనుకబడిన వంద జిల్లాలను 6 ఏళ్ల పాటు అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక పథకం అమలు చేస్తున్నారని అన్నారు.అందులో నారాయణపేట జిల్లా ఉండడం ఈ ప్రాంత రైతుల ఆదర్శరామనువన్నారు.అలాగే జీ ఎస్టీ స్లాబు లు తగ్గించి మధ్య,పేద ప్రజలకు ఎంతో ఊరట అందిస్తున్నారని అన్నారు.అంతేకాకుండా దేశ రక్షణ విషయంలో రాజీలేని విధానాలు తీసుకుని అగ్రదేశాల సరసన నిలిపారని అన్నారు.

# విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు



**పటాన్‌చెరు, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో విలీనమైన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పోచారం గ్రామ పరిధిలోగల సాయి దర్శన్ కాలనీలో 60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని మహదేవపురం కాలనీలో యూజీడి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలీన గ్రామాల పరిధిలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రధానంగా సిసి రోడ్లు, యూజీడీలు, పార్కులు వీధి దీపాల ఏర్పాటుకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నమని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్లు మధుసూదన్ రెడ్డి, అజయ్ రెడ్డి, ముత్తంగి పిఏసిఎస్ చైర్మన్ బిక్షపతి, సీనియర్ నాయకులు బిక్షపతి, రామచందర్, రాజన్ సింగ్, రామచంద్రారెడ్డి, బండి శంకర్, అంతి రెడ్డి, జంగారెడ్డి, నారాయణరెడ్డి, నర్సింలు, శివా రెడ్డి, డిఈ సత్యనారాయణ, ఏఈ మౌనిక, కాలనీల అధ్యక్షులు శంకర్ గౌడ్, వెంకట్రావు, సోమశేఖర్, రాజేందర్ సింగ్, హరి, కాలనీవాసులు పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



**మల్దకల్, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** మండల మహిళా శిశు సంక్షేమ శాఖ,జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో శనివారంమహిళా సమైక్య ఆఫీస్ లో బాల్య వివాహాలు,బాల కార్మికులను, డ్రగ్స్, పిల్లలను రక్షించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మల్దకల్ ఏపిఎం భీమసేన్ మాట్లాడుతూ చిన్న వయస్సులో పెళ్ళిలు చేయడం చట్ట రీత్యా నేరమని,బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే సమస్యలు,నష్టాలు గురించి అవగాహన కల్పించారు.బాల కార్మిక వ్యవస్థ వలన పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందని,పిల్లలను బడికి క్రమం తప్పకుండా పంపాలన్నారు. సామాజిక మద్యమం వల్ల పిల్లలు చెడు అలవాట్లుకు లోనై అవకాశం ఉన్నది,బాలల అందరూ కూడా కేవలం మంచి విషయాల కోసం మాత్రమే ఫోన్స్ ఉపయోగించుకోవాలిని తెలిపారు.ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన పథకాలు కట్టాలని తెలిపారు.ఆడపిల్లలకు సంబంధించిన పథకాలన్నీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిపిఎస్ అవుట్ రీచ్ వర్కర్ ప్రకాష్, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ కృష్ణయ్య,ఉమెన్ ఎంపవర్మెంట్ సరోజ, చిట్టెమ్మ,చైల్డ్ లైన్ కళావతి,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో మహిళల ఆర్థిక భద్రత
- మంత్రి దామోదర్ రాజనర్సింహా




**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డల పెళ్ళికి తోడ్పాటు అందిస్తాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని పి.ఎస్.ఆర్. గార్డెన్‌లో శనివారం నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గం లోని వివిధ మండలాలకు చెందిన 341 మంది అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక భద్రత కోసం చేపట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు మహిళల జీవితాల్లో వెలుగు నింపుతున్నాయి అన్నారు. ఈ పథకాల ద్వారా పేద కుటుంబాల కుమార్తెల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం సామాజిక న్యాయం, సమానత్వం స్థాపించేందుకు కృషి చేస్తోంది అని తెలిపారు. ప్రతి లబ్ధిదారుని దగ్గరికి ప్రభుత్వ పథకాల ఫలితం చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ఈ సందర్భంగా సంగారెడ్డి నియోజక వర్గం లోని కంది మండలంలో - 41 మంది, కొండాపూర్ మండలం - 83, సదాశివా పేట - 46, సంగారెడ్డి మండలంలోని - 171 మంది, మొత్తం 341 మంది లబ్దిదారులకు 3కోట్ల 41 లక్షల 39 వేల 556 రూపాయల కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను టీజీఐఐసీ ఛైర్పర్సన్ శ్రీమతి నిర్మలా జగ్గారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ లతో కలసి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్ , సంగారెడ్డి ఆర్డీవో రాజేందర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
26 అక్టోబర్ 2025

# హ్యామ్ పథకంతో మారనున్న జడ్చర్ల రోడ్ల రూపురేఖలు

- తొలివిడతలో 20 రోడ్లను మంజూరు చేసిన ప్రభుత్వం
- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వెల్లడి

**జడ్చర్ల, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హ్యామ్ రోడ్ల అభివృద్ధిలో భాగంగా జడ్చర్ల నియోజకవర్గంలోని 6 మండలాల పరిధిలో తొలి విడతగా 20 రోడ్ల నిర్మాణ పనులను ప్రభుత్వం మంజూరు చేసిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. ఈ రోడ్లను ప్రభుత్వం పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటుందని చెప్పారు. హ్యామ్ రోడ్ల పనులను చేపట్టడానికి తొలివిడతగా సర్కిల్ కు రూ.421 కోట్ల చొప్పున ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ రోడ్లు పంచాయితీరాజ్ శాఖ ద్వారా మంజూరు కాగా ఆర్ అండ్ బీ నుంచి కూడా మరిన్ని రోడ్లు మంజూరుకానున్నాయని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి చేయాల్సిన రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం నియోజకవర్గంలో 20 రోడ్లను హైబ్రీడ్ యాన్యుటీమోడల్ (హ్యామ్) పథకంలో భాగంగా అభివృద్ధి చేయడానికి ఎంపిక చేసిందని శనివారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఎమ్మెల్యే తెలిపారు. హ్యామ్ పథకంలో భాగంగా కొత్త రోడ్ల ఫార్మేషన్, సీసీ రోడ్లు, బీటీ రోడ్లను వేయడం జరుగుతుందన్నారు. హ్యామ్ తొలి విడతలో భాగంగా ప్రస్తుతం





నవాబుపేట మండలంలో 3, బాలానగర్ మండలంలో 4, రాజాపూర్ మండలంలో 4, జడ్చర్ల మండలంలో 4, మిడ్జిల్ మండలంలో 3, ఊర్కొండ మండలంలో 2 రోడ్లను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని చెప్పారు. నవాబుపేట మండల పరిధిలో నవాబుపేట నుంచి లింగంపల్లి మీదుగా బాలానగర్ వెళ్లే రోడ్డు, రుద్రారం నుంచి కూచూరు మీదుగా మల్ రెడ్డిపల్లికి వెళ్లే రోడ్డు, నవాబుపేట నుంచి పోమాల్ మీదుగా కేశవరావుపల్లి కి వెళ్లే రోడ్డు నిర్మాణపనులు మంజూరు అయ్యాయని తెలిపారు. మిడ్జిల్ మండలంలో రాణిపేట్ నుంచి దోనూర్, సింగందొడ్డి మీదుగా తొమ్మిది రేకుల జడ్పీ రోడ్ వరకూ వెళ్లే రోడ్డు, వాడ్యాల నుంచి వేముల మీదుగా వెల్జాల్‌కు వెళ్లే రోడ్డు, వేముల నుంచి మసిగుండ్లపల్లి మీదుగా చెన్నంపల్లి వరకూ వెళ్లే రోడ్లు మంజూరు అయ్యాయని, ఊర్కొండ మండలంలో ముచ్చర్లపల్లి నుంచి రామిరెడ్డిపల్లి, బొమ్మరాసిపల్లి, జగబోయిన్ పల్లి మీదుగా వెల్జాల వరకూ వెళ్లే రోడ్డు, మాదారం నుంచి గుడిగానిపల్లి మీదుగా మల్లాపూర్ క్రాస్ రోడ్డు వరకూ వెళ్లే రోడ్లు కూడా హ్యామ్ పథకంలో ఎంపికయ్యాయని, హ్యామ్ రోడ్లలో 2వ విడతలోనూ, ఆర్ అండ్ బీ శాఖ ద్వారా చేపట్టే హ్యామ్ రోడ్లలోనూ జడ్చర్ల నియోజకవర్గానికి మరిన్ని రోడ్ల నిర్మాణాలు మంజూరు అవుతాయని తెలిపారు.

## రెండో విడతలో బాధితులకు ఇండ్లు వచ్చేలా కృషి



**శివ్వంపేట, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** అకాల వర్షాలతో ఇండ్లు కూలిపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఇండ్లు మంజూరయ్యేలా కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన కమ్మరి భాస్కర్, కమ్మరి రాజయ్య, కమ్మరి సురేష్ ల ఇండ్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. పార్టీ శ్రేణుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న సుహాసిని రెడ్డి శనివారం మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బండారి గంగాధర్ తో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు. ఇది ప్రజా పాలన ప్రభుత్వమని మీ కుటుంబాలకు మేము ఎప్పుడు అండగా ఉంటామన్నారు. ఇండ్లు లేనివారు ప్రభుత్వం నుంచి వచ్చేటటువంటి రెండో విడత ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు అందేలా సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండారి కిష్టయ్య, బండారి నాగేష్, పిల్లి అంజయ్య, గుల్లయ్య గారి రాములు, బోసు లింగం, పిల్లి వెంకటయ్య, కుమ్మరి నాగరాజు, బండారి సాయి కిరణ్, కమ్మరి మధుసూదన్, పిల్లి మణికంఠ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అక్షయపాత్ర కృషి ప్రశంసనీయం

- ప్రతిష్ఠాకంగా హరే కృష్ణ కల్చరల్ సెంటర్ నిర్మాణం
- మంత్రి దామోదర్ రాజనర్సింహా



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్న అక్షయపాత్ర కృషి ప్రశంసనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండలం లో హరే కృష్ణ మూవ్మెంట్ అద్వర్యంలో ఎంతో ప్రతిష్ఠాకంగా నిర్మిస్తున్న హరే కృష్ణ కల్చరల్ సెంటర్ నిర్మాణం లో భాగంగా నిర్వహించిన మహా నరసింహ హెూమము, గర్భాలయ యంత్ర స్థాపన పూజ కార్యక్రమములో ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాకంగా నిర్మిస్తున్న హరే కృష్ణ కల్చరల్ సెంటర్‌లో శ్రీశ్రీ రాధాకృష్ణ విగ్రహాలను ప్రతిష్టించి సనాతన ధర్మ మహెూన్నత సంస్కృతిక వారసత్వాన్ని, విలువలను ప్రాచుర్యంలోకి తేవటానికి అద్భుత అధ్యాత్మిక సంస్కృత కేంద్రంగా నిలుస్తుందని మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆద్వర్యంలో 3 కొత్త ఫుడ్ డిస్ట్రిబ్యూషన్ వాహనాలను జెండా ఊపి మంత్రి, టిజిఐఐసి ఛైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి తో కలసి ప్రారంభించారు. అనంతరం అక్షయ పాత్ర ఫౌండేషన్ నిర్వహిస్తున్న అతిపెద్ద కిచెన్‌ను పరిశీలించారు. ఆధునిక వంట గదులను, స్నాక్స్, ఆటోమేటిక్ కూరగాయల వాషింగ్, కటింగ్ మెషిన్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్ యువతకు ఆదర్శం

### మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు

**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా నిర్వహించబోయే మేరా యువభారత్ మెదక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం మెదక్ పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా నిర్వహించబోయే మేరా యువభారత్- మెదక్ ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమక ఉద్దేశం దేశ సమైక్యత, సేవా భావం పెంపొందించడంతోపాటు యువతి,యువకుల్లో వృత్తి నైపుణ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 530 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి ఒక పటిష్టమైన భారతదేశంగా ఏర్పాటు చేసి ప్రపంచ దేశాలకు మార్గదర్శకులు అయ్యారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో యువతి,యువకులను భాగస్వామ్యం చేయాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రంలోని అన్ని కళాశాలలో ఉపన్యాస, వ్యాస రచర, రంగోలి లాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, ప్రభుత్వ శాఖలైన పోలీస్, విద్య వైద్య, ఇతర శాఖలను భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారతదేశాన్ని ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్‌గా తయారు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ప్రతి వ్యక్తికి దేశమే ముందు ఏదైనా ఆ తర్వాతే అని పేర్కొన్నారు. అనంతరం మేర యువభారత్ మెదక్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా మేర యువభారత్ అధికారి రంజిత్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.




# కేజీబీవీ పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**హన్వాడ, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** శనివారం హన్వాడ మండలంలో కె.జి.బి.వి ని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రను, ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. హన్వాడ మండల కేంద్రంలో కె .జి.బి.వి ని తనిఖీ చేశారు ఆరవ తరగతి విద్యార్థులతో విద్యా బోధన, భోజనం నాణ్యత, ఇతర సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలో చెత్తాచెదారం గమనించి గమనించి తరగతి గదిని శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఉదయం అల్పాహారం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు తరగతి గదులు, చుట్టుపక్కల పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలని, పరిసరాలు శుభ్రంగా లేకపోతే పిల్లలకు ఆరోగ్య సమస్యలు వస్తాయని ఉపాధ్యాయులను ఆమె ఆదేశించారు. తర్వాత ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. బయట ఆడుకుంటున్న విద్యార్థుల చేతి గోళ్ళు గమనించి పెరిగిన



వెంటనే తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ వారికి వివరించారు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ప్రతి సబ్జెక్టు పై అవగాహన కలిగి ఉండాలని, గణిత శాస్త్రం, భౌతిక శాస్త్రం సబ్జెక్టులపై ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ సంవత్సరం వార్షిక పరీక్షల్లో100% ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. ఏ సబ్జెక్ట్‌లో నైనా సందేహాలు ఉంటే సంబంధిత ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులతో బోధనాభ్యాసన పై చర్చించి తెలుసుకున్నారు అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పి. హెచ్.సి.లో ప్రతిరోజు ఓ.పి. నమోదు గురించి అడుగగా, 100 నుంచి 150 వరకు ఉంటుందని వైద్య సిబ్బంది తెలిపారు. ఆసుపత్రిలో లేబర్ రూంను, ల్యాబ్ టెక్నీషియన్, ఐ.పి వార్డ్, ఫార్మసీ సందర్శించి పరిశీలించారు. అక్కడున్న సిబ్బంది మాట్లాడుతూ మాకు టాయిలెట్స్ ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు . పి. హెచ్ సి.లో ప్రసవాలు గురించి తెలుసుకున్నారు ఆసుపత్రిలో మందులు కొరత లేదని కలెక్టర్ కు సిబ్బంది తెలిపారు. కలెక్టర్ వెంట మండల అధికారులు ఉన్నారు.

## డిజిటల్ భద్రతపై అవగాహన సదస్సు




**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** డిజిటల్ భద్రతపై అవగాహన కల్పించేందుకు నారాయణపేట జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శనివారం ఒక ప్రత్యేక సదస్సు నిర్వహించారు.సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ.ఇలాంటి అవగాహన సదస్సులు ప్రజల్లో డిజిటల్ బాధ్యతా భావం పెంచి, సైబర్ భద్రతా సంస్కృతిని బలపరుస్తాయని తెలిపారు.సదస్సులో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, సైబర్ నిపుణుడు మరియు అడ్వకేట్ రూపేష్ మిత్తల్, హైదరాబాద్‌కు చెందిన సూర్యప్రకాశ్ హాజరయ్యారు.ఈ సదస్సులో ఈమెయిల్ అకౌంట్లు, మొబైల్ ఫోన్లు, వ్యక్తిగత డేటా రక్షణకు సంబంధించిన పలు చిట్కాలు, సైబర్ హైజీన్ పాటించే విధానాలు, మొబైల్ ఫోన్‌లో భద్రతా సెట్టింగులు ఎలా అమలు చేయాలో వివరించారు. కాగా సదస్సులో పాల్గొన్న వారికి నిపుణులు పాస్‌వర్డ్‌ల వినియోగం, టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్, సాఫ్ట్‌వేర్ అప్ డేట్ప్రాముఖ్యత గురించి వివరించారు. మొబైల్ భద్రత కోసం అనవసర అనుమతులు నిలిపివేయడం, ధృవీకరించని యాప్‌లను ఉపయోగించకపోవడం, ప్రైవసీ సెట్టింగులను సరిగా అమలు చేయడం వంటి సూచనలు చేశారు.ఈ సందర్భం గా మాట్లాడుతూ రూపేష్ మిత్తల్ సైబర్ భద్రత అవగాహనతో మొదలవుతుందనీ, ప్రతి ఒక్కరూ తమ డేటా ప్రైవసీని కాపాడుకునేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం చివరలో ప్రశ్నోత్తర సమావేశం నిర్వహించగా ఇందులో పాల్గొన్నవారు ఈమెయిల్ రక్షణ, మొబైల్ భద్రత, ఆన్‌లైన్ మోసాలను నివారించే మార్గాలపై ప్రశ్నలు అడిగి నిపుణుల సలహాలు పొందారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేందర్ గౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, డీపీఓ సుధాకర్ రెడ్డి, డి.పి.ఆర్.ఓ.రషీద్, ఈ.డి.ఎస్.సి. కార్పొరేషన్ ఖలీల్,అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీలు, ఎంపీవోలు, సిడిపివోలు, సూపర్ వైజర్లు, కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దు



**శివ్వంపేట అక్టోబర్ 25 (జనంసాక్షి) :** ధాన్యాన్ని దళారులకు విక్రయించి రైతులు మోసపోవద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆమె శివ్వంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చింతల వెంకట్ రాంరెడ్డి, వైస్ చైర్మన్ నాయిని వేణుగోపాల్ రెడ్డి లతో కలిసి శివంపేట మండలంలోని కొంతాన్ పల్లి, ఉసిరికపల్లి, రత్నాపూర్, సీతారాం తండా, అల్లిపూర్, పిల్లుట్ల గ్రామాలలో పర్యటించి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుహాసిని రెడ్డి మాట్లాడుతూ తాళ్లు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి రైతులు విక్రయించుకోవాలని సూచించారు. అలాగే రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం సరైన మద్దతు ధర చెల్లిస్తుందని, అందులో భాగంగానే ఏ గ్రేడ్ ధ్యానం క్వింటల్ కు రూ. 2389 ధర కాగా, సాధారణ రకానికి రూ. 2369 మద్దతు ధర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ చింతల వెంకట్ రాంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, పాక్స్ సీఈవో మధుయాదవ్, పాక్స్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, డైరెక్టర్లు అంజిరెడ్డి, పెంటగౌడ్, ఏఈవో లు మౌనిక, వందన, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి గంగాధర్, సోని రవినాయక్, సత్యగౌడ్, బండారి నగేష్ లతో పాటు ఆయా గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దళారులను ఆశ్రయించి రైతులు మోసపోవద్దు

- ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి

**హత్నూర, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయించే విషయంలో దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి సూచించారు.మండలంలోని కాసాల,హత్నూర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో గల గోవింద్ రాజ్ పల్లి,లింగాపూర్, కాసాల తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి



కొనుగోలు కేంద్రాలను శనివారం ఆమె చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు.గోనె సంచులు, హమాలీ కూలీల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్ రెడ్డి, రాంచంద్రారెడ్డి, దామోదర్ రెడ్డి,పి.రాంచంద్రా రెడ్డి,ఆకుల కిష్టయ్య,పండుగ రవి,అజ్మత్ అలీ, మణిదీప్,అమ్రాది జగదీష్ ఉన్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు వృథా కావు



**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారం సందర్భంగా, మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "పోలీస్ అమర వీరుల త్యాగాలు ఎప్పటికీ వృథా కావు. పోలీసులు కేవలం శాంతి భద్రతల పరిరక్షణకే కాకుండా, సేవా కార్యక్రమాల్లో కూడా ఎల్లప్పుడూ ముందుంటారు" అని అన్నారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో, ఆర్మ్డ్ రిజర్వ్ మరియు స్థానిక పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో, రెడ్ క్రాస్ రక్తనిధి సహకారంతో పరేడ్ గ్రౌండ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించబడింది. పోలీస్ అధికారులు, సిబ్బంది, మరియు యువత ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ రక్తదానం చేసిన సిబ్బందిని అభినందించి పండ్లు, సర్టిఫికేట్లు అందజేశారు.

# మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి, ఉపాధికి ప్రభుత్వం చర్యలు

- 33 జిల్లాలో కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు
- మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే యెన్నం శీనివాస రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** రాష్ట్రంలో మత్స్య పరిశ్రమపై ఆధారపడ్డ మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి, ఉపాధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య,డైరీ అబివృద్ధి, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మత్స్యకారులకు 100 శాతం రాయితీతో చేపలు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం మహబూబ్ నగర్ నియోజకవర్గం, హన్వాడ మండలం, ఇబ్రహీం బాద్ లోని హేమ సముద్రం దగ్గర మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి,జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై హేమ సముద్రంలో ఒక లక్ష 80 వేల చేపలు పిల్లలు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలో చేపలు నిల్వ చేయడానికి కోల్డ్ స్టోరేజ్ లు ఏర్పాటు కు డి.పి.ఆర్.రూపొందించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గోదావరి, కృష్ణ నదుల మధ్యన ఉన్న అన్ని చెరువులలో ఎన్నడూ లేనివిధంగా 94 కోట్ల రూపాయల విలువైన 84 కోట్ల చేప పిల్లలను సుమారు 26 వేల చెరువుల్లో, 29 కోట్ల రూపాయల విలువైన 10 కోట్ల రొయ్యలను 300 నీటి వనరుల్లో విడుస్తున్నామని చెప్పారు. రాష్ట్ర క్యాబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మత్స్య శాఖకు బడ్జెట్ పెంచాలని కోరడం జరిగిందని,మార్చి నెలలో కేటాయించే బడ్జెట్ మళ్లీ వచ్చే మార్చిలో కేటాయింపులు జరుగుతాయని,కాని మంత్రిగా కోరిన వెంటనే 123 కోట్ల కేటాయింపు చేసినట్లు తెలిపారు.రాష్ట్రం లో మత్స్య రంగం పై ఆధారపడ్డ 5 లక్షల మత్స్యకారులు,మత్స్య సహకార సంఘాల సభ్యులకు ఆర్థికంగా అభివృద్ధి,ఉపాధి కల్పించేలా ఉచిత చేప పిల్లలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,రాష్ట్ర మత్స్య సహకార పెడరేషన్ అధ్యక్షుడు మెట్టు సాయి కుమార్,, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్ పి వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్,ఆర్.డి.ఓ.నవీన్, శాఖ ఏ.డి.రాధా రోహిణి, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పన్ను వసూలులో అవకతవకలు

- గంగారం గ్రామ కార్యదర్శి రెవెన్యూ అధికారిగా అవతారం
- భూమి పట్టా పేరుతో అధిక వసూలు
- వసూలు డబ్బులు ట్రెజరీలో జమ చేయని అధికారి
- వసూలు చేసింది 15 లక్షల పైకే
- ప్రభుత్వానికి అప్ప చెప్పింది మూడు లక్షలే
- ఆర్టీఐ దరఖాస్తు ద్వారా వెల్లడైన వివరాలు

**కాటారం అక్టోబర్ 25 (జనం సాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గంగారం గ్రామంలో 2020- 2021 సంవత్సరానికి గాను, ఇంటి పని పన్ను వసూలు లో అవకతవకలు జరిగినాయని, గంగారం గ్రామపంచాయతీ పై విజిలెన్స్ విచారణ చేయాలని బిఆర్ఎస్ నాయకులు చల్ల శేఖర్ రెడ్డి , పత్రికాముఖంగా డిమాండ్ చేశారు. గంగారం గ్రామపంచాయతీలో సుమారు 600 నివాస గృహాలు ఉండగా ప్రతి గృహానికి కొందరికి 5000 కొందరికి 7000, కొన్ని గృహాలకు 9000 వరకు రిసిప్ట్ ఇచ్చి మరి గ్రామ పంచాయతీ సిబ్బంది వసూలు చేసినారు. 600 గృహాలలో 5000 చొప్పున వసూలు చేసిన కలుపుకొని 10, లక్షలు వరకు వసూలు చేసినారని కొన్ని రిసిప్టుల ద్వారా అర్థమవుతున్నది. మిగతా 400 గృహాలకు పూరి గుడిసెలు అయితే 1000 చొప్పున ఇంటి పన్నును వసూలు చేసినా నాలుగు లక్షలువరకు వసూళ్లు చేసినారని, గంగారం గ్రామపంచాయతీలో కాళీ భూములకు, పట్టాలు ఇస్తామని వసూలు చేశారని రసీదు ద్వారా అర్థం అవుతుంది అని వారు ఆరోపించారు. ప్రభుత్వం ఖజానాకు జమ చేసిన లెక్కలు వివరాలను ఆర్టిఐ ద్వారా తీసుకున్న వారికి ఆర్టీఐలో పొందుపరిచి అధికారులు ఇచ్చిన వివరాల ప్రకారం, 2020-2021 సంవత్సరానికి మూడు లక్షల 26 వేల 97 రూపాయలు మాత్రమే ప్రభుత్వ ఖజానాలో జమ చేసినారని అసలు విషయం తెలిసినది. 2020- 2021. సంవత్సరంలో ప్రతి ఇంటి నుండి గ్రామపంచాయతీ ఇంటి పన్ను వసూలు రసీదు బుక్కుల ద్వారా పన్నులు వసూలు చేసినారు. ప్రభుత్వ లెక్కలకు స్థానికంగా అప్పటి అధికారులు మరియు కార్యదర్శిలు కలిసి వసూలు చేసిన లెక్కలకు పొంతన లేకుండా పోయిందని భారీ మొత్తంలో ప్రజల నుండి ఇంటి పన్నును వసూలు చేసి ప్రభుత్వ ఖజానాల్లో జమ చేయకుండా తమ జేబులు నింపుకున్నారని ప్రభుత్వానికి, ప్రజలకు తీవ్ర స్థాయిలో




నష్టం చేకూర్చినారని, ఏకంగా గ్రామపంచాయతీ పం చాయతీ కార్యదర్శి సిబ్బంది కుమ్మకై కొన్ని పుస్తకాలను సొంతంగా ముద్రించి ప్రజల నుండి ఇంటి పన్నును వసూలు చేపించినారని ఆ పుస్తకాల వివరాలు ఖజానా లెక్కలోకి రాలేదని, అసలు వసూలు చేసింది యావరేజ్ లెక్కల ప్రకారం 15 లక్షల పై మాట అయినా ప్రభుత్వ ఖజానాలు జమ చేసింది మూడు లక్షల అంటే భారీ మొత్తంలో అవకతవకలు జరిగాయని, బిఆర్ఎస్ నాయకులు చల్లా శేఖర్ రెడ్డి వాపోయారు. కావున ఇట్టి విషయమై అప్పుడు వసూలు చేసిన, అధికారికంగా అనధికారికంగా వసూలు చేసిన పుస్తకాల పన్ను రసీదు పుస్తకాలను అన్నింటిని దొరకబట్టి, ఇంటింటికి తిరిగైన ఎంత పన్ను కట్టారో విజిలెన్స్ విచారణ ద్వారా విచారణ చేపించి బాధ్యులైనటువంటి అప్పటి పంచాయతీ సెక్రెటరీ గ్రామపంచాయతీలో వసూలు చేసిన డబ్బులు తన జేబులో వేసుకున్న అప్పటి అధికారులపై తీసుకుంటూ పూర్తి డబ్బును రికవరీ చేయించాలని పత్రికా ముఖంగా బిఆర్ఎస్ నాయకులు చల్ల శేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# రామప్ప శిల్పకళా నైపుణ్యం అద్భుతం

- త్రిపుర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ హేమంత్ వర్మ



**ములుగు/వెంకటాపూర్, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** రామప్పలోని ప్రతి ఒక్క శిల్పం ఆనాడు నిర్మించిన కాకతీయుల కళ నైపుణ్యానికి అద్దం పడుతుందని త్రిపుర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ హేమంత్ వర్మ పేర్కొన్నారు.వరంగల్ లో ఉన్న పర్యాటక క్షేత్రాలను వీక్షించడానికి రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం త్రిపుర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ హేమంత్ వర్మ దంపతులు హన్మకొండ, నక్కలగుట్టలోని హరిత కాకతీయ హెూటల్ కు విచ్చేసినారు.ముందుగా వారికి ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ హెచ్ఆర్డి సి. ప్రభాకర్ పుష్ప గుచ్ఛముతో ఆహ్వానం పలికారు. అనంతరం ములుగు జిల్లాలోని వెంకటపూర్లోని పాలంపేట గ్రామములోని రామప్ప దేవాలయాన్ని త్రిపుర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ సందర్శించారు. ముందుగా శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం పూజారులు వారిచే శ్రీ రామలింగేశ్వర స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గైడ్ రామప్ప చరిత్రను వివరించారు. చైర్మన్ హేమంత్ వర్మ మాట్లాడుతూ రామప్ప శిల్పాలలో కళాత్మక వైభవం ఉట్టిపడుతున్నట్లు నిర్మించారని అన్నారు. యునెస్కో గౌరవం దక్కిన రామప్ప రాతిపై చెక్కిన ఇక్కడి శిల్పాల్లో జీవకళ ఉట్టిపడుతోందని పేర్కొన్నారు. చరిత్ర భవిష్యత్ తరాలకు ఎన్నో అంశాలను తెలియజేస్తుందని చెప్పారు. జీవకళ ఉన్న శిల్పకళాకృతులకు మరో రూపమే రామప్ప అని కితాబు నిచ్చారు. ఎంతో ఘన చరిత్ర గల రామప్పను సందర్శించడం చాలా సంతోషంగా ఉందన్నారు.అనంతరం లక్నవరం సస్పెన్షన్ వంతెన పై విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ డిఈ ఆపరేషన్ ములుగు పులుసం నాగేశ్వర్ రావు,ఏడిఈ వేణు గోపాల్,విజిలెన్స్ ఎస్ఐ పురుషోత్తం,ఏఈ రమేష్,కిషోర్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

- ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్



**ఖానాపూర్, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** మొక్కజొన్న రైతులు తమ పంటను దళారీలకు విక్రయించి మోసపోవద్దని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మార్కెఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాల్ కు రూపాయల 2400 మద్దతు ధర వర్తింప చేస్తుందని తెలిపారు. రైతులు గమనించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే వారి మొక్కజొన్నలు విక్రయించి లాభాలు గడించాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి మొక్కజొన్న తీసుకువచ్చే రైతులు తమ తమ ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, పట్టా పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలను వెంటనే తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన మొక్కజొన్న రైతులకు అనతికాలంలోనే డబ్బులు ఖాతాలో జమ అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వడిగల భూషణ్, వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, తహసీల్దార్ సుజాత, అగ్రికల్చర్ ఏడి బి.సుజాత, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆజం ఉద్దీన్ లతోపాటు పలువురు అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దొనకేని దయానంద్, పట్టణ శాఖ అధ్యక్షుడు నిర్మల రమేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజురా సత్యం, తదితరులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళా సద్వినియోగం చేసుకోండి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి, అక్టోబర్ 25, (జనంసాక్షి) :** బెల్లంపల్లి పట్టణంలో నేడు చేపట్టబోయే మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కోరారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మెగా జాబ్ మేళా నిరుద్యోగులకు బంగారు అవకాశం అన్నారు. నిరుద్యోగులు ఉద్యోగం కోసం నగరాలు తిరిగే అవసరం లేదని, బెల్లంపల్లి లోనే వేలాది ఉద్యోగాలు అందుబాటులో వస్తున్నాయని అన్నారు. ఈజాబ్ మేళా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ యువతకు ఉపాధి కోసం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా నిర్వహించబడుతుందని అన్నారు. ఈమెగా జాబ్ మేళాలో 75 పైగా కంపెనీలు పాల్గొన్నాయని వివరించారు. ఐటీ, మెడికల్, మైనింగ్, మార్కెటింగ్, ఎడ్యుకేషన్, సర్వీస్ రంగాల్లో వేల సంఖ్యలో ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 9 వేల మందికి పైగా నిరుద్యోగులు మెగా జాబ్ మేళాలో నమోదు చేసుకున్నారని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ మాట్లాడుతూ ప్రతి అభ్యర్థి తన బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, అవసరమైన పత్రాలతో హాజరు కావాలన్నారు. నియామక సంస్థలు మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తాయని వివరించారు. అనంతరం సింగరేణి జనరల్ మేనేజర్ రాధకృష్ణ మాట్లాడుతూ సింగరేణి సంస్థ సామజిక బాధ్యతలో భాగంగా మెగా జాబ్ మేళా నిర్వహిస్తుందన్నారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే సింగరేణి సంస్థ ప్రధాన లక్ష్యం అన్నారు. మేళా విజయవంతానికి స్థానిక అధికారులు, వాలంటీర్లు, కళాశాల ప్రిన్సిపాళ్లు, ఉద్యోగ విభాగ సిబ్బంది పర్యవేక్షణలో ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయని వివరించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్ మేళా కొనసాగుతుందని తెలిపారు.

# బెల్లంపల్లిలో నాట్య మయూరాలు



**బెల్లంపల్లి, అక్టోబర్ 25, (జనంసాక్షి) :** బెల్లంపల్లి పట్టణానికి కాంపెల్లి త్రవిద్య, శ్రవిద్య సోదరీమణులు నాట్య మయూరిలుగా గుర్తిపు పొందారు. అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం సందర్భంగా వారి కళను గుర్తిద్దాం. బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కాంపల్లి రాజేశ్వరి దంపతుల కుమార్తెలు కాంపల్లి త్రవిద్య, శ్రవిద్య మందమర్రి శ్రీచైతన్య పాఠశాలలో చదువులను కొనసాగిస్తూ గత ఆరు సంవత్సరాల నుండి బెల్లంపల్లి పట్టణంలోని నటరాజ డాన్స్ అకాడమీ నాట్య గురువు పేరాల అర్చన జయప్రకాష్ శిక్షణలో భాగ్యనగరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో అక్కడికి వచ్చిన పెద్దలను వారి నాట్య ప్రదర్శనతో ఆకట్టుకుని నంది అవార్డులు పొందారు.

ప్రపంచ కూచిపూడి దినోత్సవం సందర్భంగా శంషాబాద్ లో సమత మూర్తి విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన కూచిపూడి ప్రదర్శనలలో భాగంగా చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో నాట్య మయూరి, నాట్య కిన్నెర అవార్డులు పొందారు. ఎన్నో కార్యక్రమాలు బ్రహ్మాంజలి కూచిపూడి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో, శ్రీశ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన 24 గంటల సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా గిన్నిస్ బుక్ రికార్డ్స్ లో ఘనత సాధించేందుకు నృత్య ప్రదర్శన చేశారు. మంచిర్యాల జిల్లాలో వేయి మంది కళాకారుల కార్యక్రమంలో కూచిపూడి ప్రదర్శనలతో ఎంతోమందినీ వారి నాట్యంతో ఆనందింపజేశారు.

# అభివృద్దే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన

- మంత్రి సీతక్కకు ఎల్లప్పుడు రుణపడి ఉంటాం
- సుమారు 18 కోట్ల 18 లక్షల రూపాయల నిధులు మంజూరు....



**మంగపేట అక్టోబర్ 25(జనంసాక్షి) :** రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్నటువంటి సంక్షేమ పథకాలు ఎనలేనియని అని కాంగ్రెస్ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి కొనియాడారు. శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా శాఖ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశము ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు సిఆర్ఆర్ గ్రాంట్ నుండి సుమారు 74.43 కోట్ల రూపాయల నిధులను విడుదల చేయడం జరిగిందని ఆ నిధులలో నుండి మండల అభివృద్ధికై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ చూపి సుమారు 18.18 కోట్ల రూపాయల నిధులను మండలానికి కేటాయించడం జరిగిందని ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు ఎల్లప్పుడు రుణపడి ఉంటామని వారన్నారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారి నుండి బస్టాండ్ వరకు సెంట్రల్ లైటింగ్ కొరకు సుమారు 2కోట్ల 93 లక్షల రూపాయల నిధులను కేటాయించడం జరిగిందని అలాగే కత్తిగూడెం గ్రామం నుండి అక్కినపల్లి మల్లారం వరకు బీటీ రోడ్డు నిర్మాణం కొరకై 4 కోట్ల 55 లక్షల రూపాయల నిధులను అలాగే కొత్తూరు మోట్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలోగల బొంబాయిగూడెం (గౌరారం వాగుపై) నూతన బ్రిడ్జి నిర్మాణం కొరకు 6 కోట్ల రూపాయల నిధులను అలాగే వివిధ గ్రామాల్లో రోడ్డు నిర్మాణాలకు 4 కోట్ల 90 లక్షల రూపాయలను కేటాయించడం ఎంతో సంతోషకరమని వారన్నారు. మండల వ్యాప్తంగా సుమారు 18 కోట్ల 18 లక్షల రూపాయల నిధులను మండల అభివృద్ధికి కేటాయించడంపై హర్షం వ్యక్తంపరిచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, అయ్యోరి యానయ్య మాసిరెడ్డి వెంకట్ రెడ్డి, కర్రీ నాగేంద్రబాబు, కారుపోతుల నర్సయ్య గౌడ్, ముత్తినేని ఆదినారాయణ, టీవీ హిదాయతుళ్ళ, చాద మల్లయ్య, ఎర్రంగారి సురేష్, పగిడిపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# చిల్పూర్ మండలానికి 80 కోట్లు మంజూరు

- ఎమ్మెల్యే కడియంకు చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు కృతజ్ఞతలు



**స్టేషన్ ఘన్ పూర్, అక్టోబర్ 25 ( జనం సాక్షి ) :** మాజీ ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎంఎల్ఏ కడియం శ్రీహరి సహకారం తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిల్పూర్ మండలానికి 80 కోట్ల నిధులు మంజూరీ చేయడం జరిగిందని చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంక టేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ పోట్లపల్లి శ్రీధర్ రావు అన్నారు. ఎంఎల్ఏ కడియం శ్రీహరి అభివృద్ధి నిధులు మంజూరుచేయించినందుకుగాను చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో చిల్పూర్ మండలంలోని పల్లగుట్ట గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి,ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్లెక్సీ లకు పాలభిషేకం చేసారు. ఈ సందర్భంగా పోట్లపల్లి శ్రీధర్ రావు మాట్లాడుతూ చిల్పూర్ మండలంలో 80 కోట్ల మంజూరుతో కడియం శ్రీహరి మార్క్ ప్రారంభం అయింది అని అన్నారు.

17.60 కోట్లతో పల్లగుట్ట క్రాస్ నుండి మల్లన్న గండి వరకు పల్లగుట్ట,కృష్ణాజి గూడెం,ఫతేపూర్, గార్లగడ్డ తండ గ్రామాల మీదిగా డబుల్ రోడ్డు మంజూరు కావ డం జరిగిందని,2.5 కోట్ల తో లింగంపల్లి నుండి అబ్దుల్ నాగరం వరకు, 14.52 కోట్ల తో గోవర్ధనగిరి నుండి చిల్పూర్ వరకు, 46.03 కోట్లతో చిన్నపెండ్యాల నుండి తరిగొప్పుల వరకు,104.34తో రాజవరం నుండి కిమా తండ వరకు నిధులు మంజూరు కావడం జరిగిందని అన్నారు. ట్రైబల్ బిటి రోడ్స్ వాచ్య తండా 37.38, ఫకీర్ తాండ 37.32, ఎస్సీ ,ఎస్టి సబ్ ప్లాన్ 110కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా కడియం శ్రీహరి గ కృషి చేస్తున్నారని అన్నారు. 1997లో కడియం శ్రీహరి మంత్రిగా ఉన్నప్పుడు మంజూరైన రోడ్లు తప్ప, నేటికీ రోడ్లు మంజూరు కాక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదు ర్కొంటున్న దృష్ట్యా కడియం శ్రీహరి కృషితో రోడ్ల కు మళ్లీ నిధులు మంజూరు కావడం జరిగింది అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు చౌకబార్ విమర్శలు మాను కొని నియోజకవర్గంలో కడియం శ్రీహరి చేస్తున్న అభి వృద్ధికి సహకరించాలని అన్నారు. కడియం శ్రీహరి నాయకత్వంలో చిల్పూరుగుట్ట శ్రీబుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానం కూడా అన్ని విధాల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య,ఎమ్మెల్యే కడియం శ్రీహరి లకు, సంబంధిత మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బొమ్మిశెట్టి బాలరాజు, గడ్డమీది సురేష్ మాట్లాడుతూ 1997లో మంజూరైన రోడ్లు దెబ్బతిన్నప్పటికీ నేటివరకు ఏఎమ్మెల్యే పట్టించు కోలేదని,15 సంవత్సరాల నిరీక్షణ తర్వాత పొట్లపల్లి శ్రీధర్ రావు కృషి వల్ల ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖ రోడ్లు, ట్రైబల్ రోడ్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంజూరు చేయించడం జరిగింది అన్నారు. నియోజక వర్గ అభివృద్దే లక్ష్యంగా ఎమ్మెల్యే పని చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ చీర నాగరాజ్ గౌడ్, నాయకులు బొమ్మిశెట్టి బాలరాజు, గడ్డమీది సురేష్,స్వామి నాయక్, ఎన్నకూ స కుమార్,బానోత్ రూప్లా నాయక్,సంజీవ, మోహన్, మల్లారెడ్డి, పేరాల సుధాకర్, రత్నాకర్ రెడ్డి, బిక్షపతి, యాదగిరి ,జీడి ఆనందం,సాదం రాజేందర్,గట్టయ్య, కృష్ణ ,మండల ముఖ్యనాయకులు,దేవస్థానం డైరెక్టర్లు, మార్కెట్ డైరెక్టర్లు, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపిటిసిలు, యువజన నాయకులు, కార్యకర్త లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రేపు మద్యం షాపుల టెండర్లకు లక్కీ డ్రా

- జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మద్యం షాపుల టెండర్లకు రేపు(సోమవారం) లక్కీ డ్రా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ 2025 - 27 సంవత్సరాలకు గాను ఏ4 మద్యం షాపుల దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 23న ముగిసిందన్నారు. భూపాలపల్లి ఎక్సైజ్ యూనిట్ లోని మొత్తం 59 మద్యం దుకాణాలకు గాను 1863 దరఖాస్తులు రావడం జరిగిందని, దరఖాస్తు ఫీజు రూపంలో 55 కోట్ల 89 లక్షల రూపాయల ఆదాయం వచ్చిందని తెలిపారు. భూపాలపల్లి ఎక్సైజ్ యూనిట్ లో అత్యధికంగా మల్లంపల్లి మద్యం షాపుకు 77 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు. ఈ నెల 27న సోమవారం మద్యం షాపుల కేటాయింపుకు సంబంధించిన లాటరీ ప్రక్రియను భూపాలపల్లి పట్టణ శివారు, మంజూరునగర్ లోని ఇల్లందు క్లబ్ హౌస్ ఫంక్షన్ హాల్ నందు జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ రాహుల్ శర్మ సమక్షంలో ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎక్సైజ్ యూనిట్ లో మద్యం షాపులకు దరఖాస్తు చేసిన దరఖాస్తుదారులు, ఆర్థరైజ్డ్ రెప్రెసెంటేటివ్స్ సోమవారం ఉదయం 9 గంటల వరకు ఇల్లందు క్లబ్ హౌస్ ఫంక్షన్ హాల్ కు హాజరు కావాల్సిందిగా ఆయన సూచించారు. దరఖాస్తుదారులు, ఆర్థరైజ్డ్ రెప్రెసెంటేటివ్స్ ఈ కార్యక్రమానికి హాజరు కావడానికి మద్యం దుకాణానికి దరఖాస్తు చేసిన సమయంలో వారికి ఇచ్చినటువంటి రశీదు, ఎంట్రీ పాసు ఒరిజినల్ ను వెంట తెచ్చుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# ఓటర్ జాబితా మ్యాపింగ్ ప్రక్రియ సకాలంలో పూర్తి చేస్తాం

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** 2002లో చేసిన ఎస్.ఐ.ఆర్. తో 2025 స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటర్ జాబితా మ్యాపింగ్ ప్రక్రియపై బూత్ స్థాయి అధికారుల చేస్తున్న ప్రక్రియను రిటర్నింగ్ అధికారులతో పర్యవేక్షణ చేయిస్తూ సకాలంలో పూర్తి చేస్తామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చెప్పారు. శనివారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ పై వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, అదనపు ఎన్నికల అధికారి లోకేష్ కుమార్ లు ఇచ్చిన సూచనల మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ పాల్గొని మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. మ్యాపింగ్ లో భాగంగా క్యాటగిరి 'ఏ' ని బి.ఎల్.ఓ. యాప్ ద్వారా ధృవీకరిస్తామని, క్యాటగిరి సి, డి లింక్ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ.ఆర్.ఓ. కార్యాలయంలో ప్రత్యేకంగా బూత్ స్థాయి అధికారులను కేటాయించి త్వరిత గతిన మ్యాపింగ్ పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కాన్ఫరెన్స్ లో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, రెవెన్యూ డివిజన్ అధికారి రవి, తహసిల్దార్ శ్రీనివాసు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.



# జాతీయస్థాయి రెస్లింగ్ పోటీలకు అజ్మీర మానస ఎంపిక

**నల్లబెల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న అజ్మీర మానస జాతీయస్థాయి రెస్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ లోని జియాగూడ లో ఈనెల 21 నుండి 23 వరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 19 రెస్లింగ్ పోటీలో 55 కేజీల విభాగంలో మొదటి స్థానాన్ని సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. నవంబర్ 01 నుండి 5 వరకు హర్యానా రాష్ట్రం పానిపట్టు లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. రెజ్లింగ్ పోటీలో ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైన మానసను స్పెషల్ ఆఫీసర్ సునీత తో పాటు పిఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో



**మాడ్గులపల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** రేయనక పగలనక ఆరుగాలం కష్టపడి వ్యాయా ప్రాయాసాలకోర్చి పండించిన పంటలను విక్రయిం చేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వచ్చివారాలు గడిచినప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యం, అకాల వర్షాల కారణంగా ధాన్యంతడిసిపోవడంతోఆగ్రహించిన రైతులు ధాన్యాన్ని కొనుగోలు చేసి కాంటాలు నిర్వహించి ఎగుమతి చేయాలని శనివారం మండల కేంద్రం లోని నార్కట్ పల్లి - అద్దంకి రహదారిపై రాస్తారోకో చేపట్టారు. రైతులు రాస్తారోకో చేపట్టడంతో రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచి పోయి ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానికఎస్ఐకృష్ణయ్య రైతులను నచ్చ చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ రైతులు వినకపోవడంతో ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. స్థానిక తహశీ ల్దార్, సంబంధిత అధికారులు వచ్చేంతవరకు ఆందోళనను విరమించేది లేదని రైతులు పట్టుబట్టి ధర్నాలో కూర్చున్నారు. అధికారులు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి విషయంతెలియజేయడంతో డిసిఓ పత్యానాయక్ సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి సత్వరమే రైతుల ధాన్యానికి కాంటాలు నిర్వహించి మిల్లులకు ఎగుమతి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు. మాడ్గుల పల్లి మండల కేంద్రంలోని వేములపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాన్యంకొనుగోలుకేంద్రంలోసిబ్బందినిర్లక్ష్యాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేసిన డిసిఒ పత్యా నాయక్ వేములపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది రాజు, గిరి లను వెంటనే వీధుల నుండి.సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంచైర్మన్‌తో పాటు కార్యదర్శికి సంజాయిషి నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఎవరు అధైర్య పడవద్దు అని ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకొని వచ్చిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసిప్రభుత్వమద్దతుధరఅందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవిరెడ్డి అశోక్ రెడ్డి ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలేబో యినవరలక్ష్మి,జిల్లాసహాయకార్యదర్శి,వేములపల్లితాజా మాజీ వైస్ ఎంపీపీ పాదూరు గోవర్ధని, సిపిఎం మండల సహాయ కార్యదర్శి పుల్లెంల శ్రీకర్ ,సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



**కొండమల్లేపల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలో శనివారం జరిగింది. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సంగీత అనే మహిళ మండల పరిధిలోని దేవరోనితండాలోని ఒక పౌల్ట్రీ ఫాంలో శనివారం ఉదయం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవరోని తండాలోని ఒక పౌల్ట్రీ ఫాంలో పని చేయుటకు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన దిలీప్ కుమార్ సంగీత అనే దంపతులు ఇద్దరు వచ్చి అక్కడే ఉంటూ పని చేస్తున్నారు. శనివారం ఉదయం కుటుంబ విషయాల్లో గొడవ పడ్డారు. అనంతరం మృతురాలి భర్త దిలీప్ కుమార్ కిరాణా సామాను కొనడానికి కొండమల్లేపల్లికి వచ్చి తిరిగి పౌల్ట్రీ ఫాంకు వెళ్ళగా పౌల్ట్రీ ఫాం షెడ్ పై కప్పుకు తాడుతో ఉరివేసుకొని ఉండగా చూసిన భర్త అక్కడే ఉన్న ఇస్లావత్ బక్కమ్మకు చెప్పి చూడగా అప్పటికే ఆమె చనిపోయింది. పౌల్ట్రీ ఫాం యజమాని ఇస్లావత్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

## అంబేద్కర్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా..

- ఎమ్మెల్యే పాయం



**బూర్గంపహాడ్, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** భద్రాది కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రమైన బూర్గంపహాడ్‌లోని అంబేద్కర్ కాలనీకి చెందిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపహాడ్ 228 బూత్ కమిటీ ఆధ్వర్యంలో కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం కు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంబేద్కర్ కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తానని, కావలసిన సీసీ రోడ్లు మంజూరు చేస్తానని ఆయన అన్నారు. కిన్నెరసాని రహదారికి నూతన రోడ్డు ఏర్పాటు చేస్తానని, కాలనీలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయనన్నారు. ఈ కార్యక్రమంలో బూర్గంపహాడ్ 228 బూత్ కన్వీనర్ అలవాల దుర్గాప్రసాద్, కోకన్వీనర్ నందిపాటి వెంకటేశ్వర్లు, బూత్ ఇంచార్జ్ కేసుపాక రాజేష్, పెరుమాళ్ళ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలి



**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** పోచంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య ప్రారంభించారు. కనుముకుల, దంతూర్, భీమనపల్లి, జిబ్లక్పల్లి, దోతిగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పోరం అధ్యక్షురాలు బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్, చౌటుప్పల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సుర్వి వెంకటేష్ గౌడ్, మరి రాజిరెడ్డి, భువనగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేణిగుంట్ల లాలయ్య యాదవ్, పిఎసిఎస్ డైరెక్టర్లు కంబాలపల్లి సత్తయ్య, కుసుకుంట్ల అలివేలు, కొండల్ రెడ్డి, మాజీ సర్పంచ్ ధోటి కుమార్ యాదవ్, కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు కాసుల అంజయ్య, ప్రధాన కార్యదర్శులు బోదాసు ఈదయ్య, తోట శ్రీనివాస్, కాంగ్రెస్ కిసాన్ మండల అధ్యక్షుడు ఫకీరు యాదిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు వాడితే జీవితం చిత్తు..




**మణుగూరు, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** మత్తు మానుకో జీవితాన్ని గెలుచుకో జీవితం ఒక్కదానికే బానిస కాదు. ఎన్నో కలలకు మేళవింపుగా ఉంటుందని సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వంగా రవీందర్ రెడ్డి అన్నారు. యువతలో చైతన్యం డ్రగ్స్ పై యుద్ధం అనే కార్యక్రమంలో భాగంగా మణుగూరు తెలంగాణ చౌరస్తా నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నేటి సమాజంలో గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాల వాడకం యువతలో వేగంగా పెరుగుతోంది. ఈ అలవాటు ఒక్క వ్యక్తి జీవితానికే కాకుండా, కుటుంబానికీ, సమాజానికీ తీవ్రమైన నష్టం కలిగిస్తోంది.ఒకసారి ప్రయత్నిద్దాం" అనే ఆలోచనతో మొదలై చివరికి జీవితాన్ని చీకటిలోకి నెట్టేస్తుంది. మత్తు పదార్థాలు వాడినప్పుడు మెదడులో "డోపమైన్" అనే ఆనంద హార్మోన్ ఎక్కువగా విడుదలవుతుంది. ఆ తాత్కాలిక సంతోషాన్ని మళ్లీ మళ్లీ అనుభవించాలని కోరుకోవడం వల్లే దీనికి బానిసవుతున్నారు. కానీ నిజమైన ఆనందం మనం ఏదైనా సాధించినప్పుడు లేదా మన వల్ల ఎంతోమందికి మేలు జరుగుతుందని ఆలోచన చేయడం గొప్ప విషయం.. దేశం కోసం తల్లిదండ్రుల కోసమో కాకుండా మన జీవితం మనకోసమే జీవించాలని ఆలోచనైనా యువతలో రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ పి నాగబాబు, ఎస్ఐ సిహెచ్ నగేష్, పట్టణ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేవరకు ఉద్యమం



**టేకులపల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేంతవరకు ప్రతి బీసీ బిడ్డ ఉద్యమంలో పాల్గొనాలని టేకులపల్లి మండల బీసీ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చారు. టేకులపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ కూడలిలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక నాయకులు శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అన్ని కుల సంఘ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో టేకులపల్లి మండల బీసీ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ లక్కినేని సురేందర్ రావు మాట్లాడుతూ అన్ని కుల సంఘాల నాయకులు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలను విస్తృతంగా తిరిగి బీసీల 42 శాతం రిజర్వేషన్ సాధించేవరకు ఉద్యమించడానికి ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండల బీసీ కుల సంఘాల ఐక్యవేదిక కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.42 శాతం బీసీ రిజర్వేషన్ను అమలు చేసేదాకా పోరాటాన్ని ఉధృతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కాలంటే రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్లో చేర్చాలన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదం పొందేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాల న్నారు. దేశంలో ఎవరు రాజ్యా ధికారంలోకి రావాలన్నా అత్యధికంగా ఉన్న బీసీలే కారణమని అన్నారు. ఈ సమావేశంలో అన్ని కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐలో చేరి విద్యార్థుల సమస్యలపై పోరాడుదాం



**ఖమ్మం రూరల్, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** భారత విద్యార్థి ఫెడరేషన్‌లో చేరి,విద్యార్థుల సమస్యలపై పోరాడి పరిష్కారం చేసుకుందామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పోనుకుల సుధాకర్ అన్నారు.ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలోని జలగం నగర్, ఎం.వెంకటాయపాలెం, ముత్తగూడెం, అరేంపుల ఉన్నత పాఠశాలలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ... పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యార్థుల మౌలిక సదుపాయాల కోసం నిరంతరం కృషి చేస్తున్న సంఘం ఎస్ఎఫ్ఐ అన్నారు. ఎస్ఎఫ్ఐ పాలేరు డివిజన్ కార్యదర్శి గాదే వరుణ్ కుమార్ మాట్లాడుతూ...భగత్ సింగ్, చేగువేరా, అంబేద్కర్ లాంటి మహనీయులు ఆశయ సాధన కోసం ఏర్పడిన సంఘం ఎస్ఎఫ్ఐ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సభ్యత్వ కార్యక్రమం చేపట్టారు.పాలేరు డివిజన్లో మొదటి సభ్యత్వం స్వీకరించిన జలగం నగర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీ చరణ్యను ఎస్ఎఫ్ఐ పాలేరు డివిజన్ అధ్యక్షుడు శీలం ఉమేష్ అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి భూమిపూజ



**గాంధారి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** గౌరారం గ్రామంలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించబోయే అంగన్‌వాడీ భవనం నిర్మాణ పనుల భూమి పూజ కార్యక్రమం నేడు ఎమ్మెల్యే శ్రీ మదన్ మోహన్ చేతుల మీదుగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల శ్రేయస్సు కోసం అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఆధునిక సౌకర్యాలతో ఈ భవనం నిర్మాణం పూర్తయ్యాక గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గాంధారి మండలంలోని పోతంగల్ కళాన్ గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవన కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నామని అన్నారు. ఈ కర్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మహిళలు యువత తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు, గ్రామ ప్రజల కోసం ఎమ్మెల్యే కృషి చేస్తున్న ందుకు మండల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఎన్‌హెచ్‌టిఎస్ యాప్‌ను ఉపసంహరించుకోవాలి



**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** అంగన్వాడీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్ హెచ్ టి ఎస్ యాప్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం రోజున భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని అంగన్వాడీ ఉద్యోగుల సమావేశంలో జయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ ఎన్ హెచ్ టి ఎస్ యాప్ వల్ల అంగన్వాడీ సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ యాప్‌ను వెంటనే తొలగించాలి అని ప్రభుత్వాన్ని కోరారు. మేనిఫెస్టో ప్రకారం అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.18,000 చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలను కల్పించాలని, సంబంధిత బిల్లును తక్షణమే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే నూతనంగా తీసుకువచ్చిన ప్రీ-ప్రైమరీ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, సొంత భవనాలు లేని అంగన్వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు, అంగన్వాడీ ఉద్యోగులు జంగమ్మ, వసంత, శోభ, ప్రమీల, ఉమా రాణి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర పీడీఎస్‌యూ మహాసభలను విజయవంతం చేయండి



**టేకులపల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** అక్టోబర్ 28.29.30 తేదీలలో వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే తెలంగాణ రాష్ట్ర పిడిఎస్ యు నాలుగోవ మహాసభ లను విజయవంతం చేయాలని టీడీఎస్యు జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్ కోరారు.విద్యారంగ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఎన్నో ఉద్యమాలను నిర్వహిస్తున్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) టేకులపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ 1972లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అరాచకాలకు, ర్యాగింగ్, కుల వివక్షతకు వ్యతిరేకంగా నిలిచి పోరాడిన ఉస్మానియా అరుణతార జార్జిరెడ్డి,తన మిత్ర బృందంతో ఏర్పడిన ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్షలాది మంది పేద విద్యార్థులకు అండగా నిలిచిందన్నారు. శాస్త్రీయ విద్యాసాధనకై, సమసమాజ స్థాపన కై కదులుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు పోరాడుతూ అనేకమంది విద్యార్థులు తమ ప్రాణాలను ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం కొరకు త్యాగం చేశారన్నారు. వారి త్యాగంతో ఎరుపెక్కిన బిగిపిడికిలి జెండా నేటికీ విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలను నిర్వహిస్తూనే ఉందన్నారు. ఈ క్రమంలోనే గత ఉద్యమాల సమీక్షకై, నూతన కర్తవ్యాలకై రాష్ట్ర మహాసభలను వనపర్తి జిల్లా కేంద్రంలో అక్టోబర్ 28, 29, 30 తేదీలలో జరుపుకోబోతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు దీపిక,మండల నాయకులు లోకేశ్, తరుణ్, ఉష,దిలీప్,సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్ష పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలి



**మిర్యాలగూడ, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు అగ్రవర్ణాలకే సముచిత స్థానం కల్పిస్తూ బీసీలను అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రవర్ణాలకే నామినేటెడ్ పదవులు పెద్ద సంఖ్యలో ఇచ్చిన సందర్భం బీసీలు గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో అగ్రవర్ణ పాలన నడుస్తుంది తప్ప బలహీన వర్గాలకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ముందడుగులు వేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పగిడి జీడయ్య యాదవ్ ,పోలగాని వెంకటేష్ గౌడ్, జక్కా నాగేశ్వరరావు,ఎర్రబెల్లి గంగాధర్, నరేష్, శంకర్, మహేందర్, సాయి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# విపణి

# ఎవరి ఒత్తిళ్లూ లేవు



## విల్లాలకు అమ్మకాల కళ..

### ఫ్లాట్స్ కంటే డిమాండ్!

**న్యూఢిల్లీ:**కొంత కాలంగా అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్లకంటే విల్లాలు, వ్యక్తిగత గృహాలకు ఆదరణ పెరిగింది. ఎక్స్ఛేంజ్ రేటు తక్కువగా ఉండటం మూలంగా ప్రవాసు లు, హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్(హెచ్ఎన్ఐ) లగ్జరీ గృహాల కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు.మరోవైపు డెవలపర్లు అందించే డిస్కౌంట్లు, ఆఫర్లు కూడా ఆయా వర్గాల కొనుగోలుదారులను ఆకర్షిస్తు న్నాయి.ఈ ఏడాది తొలి అర్ధ సంవత్సరంలో దేశంలోని ఏడు ప్రధాన నగరా లలో 1.84 లక్షల గృహాలు విక్రయం కాగా.. ఇందులో 14 శాతం అంటే 25,680 ఇళ్లు లగ్జరీ గృహాలే అమ్ముడుపోయాయని అనరాక్ గ్రూప్ సర్వే వెల్లడించింది. అదే కరోనా కంటే ముందు 2019 ఏడాది మొత్తం చూస్తే.. 2.61 లక్షల యూనిట్లు విక్రయం కాగా.. కేవలం 3 శాతం అంటే 17,740 యూనిట్లు మాత్రమే లగ్జరీ గృహాలున్నాయని పేర్కొంది.హైదరాబాద్ రియల్టీ మార్కెట్‌లోపశ్చిమాది ప్రాంతాల హవా కొనసాగుతోంది. మూడు త్రైమా సికాల నుంచి కొత్త ప్రాజెక్ట్స్ లాంచింగ్స్ పశ్చిమ హైదరాబాద్‌లో 57 శాతం జరిగాయి. ఉత్తరాదిలో 18 శాతం, తూర్పులో 15 శాతం, సెంట్ర ల్‌లో 8 శాతం, సౌత్ హైదరాబాద్‌లో 2 శాతం లాంచింగ్స్ జరిగాయి. వెస్ట్ హైదరా బాద్‌లో తెల్లాపూర్, బాచుపల్లి, సౌత్‌లో అత్తాపూర్‌లు రియల్టీ హాట్‌స్పాట్స్‌గా మారాయి. ఓపెన్ ప్లాట్లలో పెట్టుబడులు పెట్టే బదులు సొంతంగా ఇల్లు కట్టుకునేందుకు చాలా మంది కస్టమర్లు ఆసక్తి చూపిస్తున్నారు.

రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(రీట్స్) పెట్టుబడులలో కార్యాలయ విభాగం అగ్రగామిగా ఉంటుంది. అయితే కొంత కాలంగా రీట్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ క్రమం గా రిటైల్ విభాగంలో కూడా వెల్లువెత్తుతున్నాయి.షాపింగ్ మాల్స్, సెంటర్లు, మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టలలో రీట్స్ పెట్టుబడులు పెరుగుతున్నాయి. నాణ్యమైన రిటైల్ స్పేస్ అందుబాటులోకి వస్తుండటం, కొనుగోలుదారుల వ్యయం పెరగడం, పట్టణ ప్రాంతాల్లో ఆదాయ వృద్ధి, స్థిరమైన ఆదాయ వనరుగా మారడం వంటివి రిటైల్ రంగంలో రీట్స్ పెట్టుబడులకు ప్రధాన కారణాలని అనరాక్ రీసెర్చ్ నివేదిక తెలిపింది.దేశీయ రియల్ ఎస్టేట్ రంగంలో రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(రీట్స్) పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. 2030 నాటికి దేశీయ రిట్స్ రూ.2 లక్షల కోట్లకు చేరుతాయని అనరాక్ రీసెర్చ్ అంచనా వేసింది.

## 'అదానీ'లో పెట్టుబడులు మా స్వతంత్ర నిర్ణయమే

### స్పష్టం చేసిన ఎల్ఐసీ




**న్యూఢిల్లీ:** అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులపై ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ క్లారిటీ ఇచ్చింది. పెట్టుబడులపై తమది స్వతంత్ర నిర్ణయమని, ఇందులో ఎవరి ఒత్తిళ్లూ లేవని స్పష్టంచేసింది. అదానీ గ్రూప్ కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడుల వెనుక ప్రభుత్వ హస్తం ఉందంటూ వాషింగ్టన్ పోస్ట్ చేసిన ఆరోపణల నేపథ్యంలో ఎల్ఐసీ ఈ మేరకు వివరణ ఇచ్చింది. ఈ మేరకు ఎక్స్‌లో శనివారం ఓ పోస్ట్ పెట్టింది.ఓవైపు అప్పులు, మరోవైపు అమెరికా సంస్థల నుంచి ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న వేళ ఈ ఏడాది మొదట్లో అదానీ గ్రూప్ కంపెనీల్లో ఎల్ఐసీ పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టిందంటూ వాషింగ్టన్ పోస్ట్ తాజాగా ఓ కథనం వెలువరించింది. ప్రభుత్వ అధికారుల నుంచి ప్రణాళిక మేరకే ఎల్ఐసీ భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టిందంటూ ఆరోపించింది. దీనిపై తాజాగా ఎల్ఐసీ స్పందిస్తూ.. ఆరోపణలు నిరాధారమని పేర్కొంది. పెట్టుబడులపై తమదే తుది నిర్ణయమని తెలిపింది. ఇందులో ఆర్థిక మంత్రిత్వ శాఖ గానీ, ఇతర శాఖల ప్రమేయం గానీ లేదని స్పష్టంచేసింది. ఎల్ఐసీ బోర్డు ఆమోదించిన విధానాల అనుసరించి పెట్టుబడులపై స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటామని ఎల్ఐసీ పేర్కొంది. వాటాదారుల ప్రయోజనాలకు అనుగుణంగా అత్యుత్తమ ప్రమాణాలు ఎల్ఐసీ పాటిస్తూ వస్తోందని, అలాంటి సంస్థపై బురద చల్లే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికింది. జీవిత బీమా కంపెనీ అయిన ఎల్ఐసీకి దేశంలోని టాప్-500 కంపెనీల్లో పెట్టుబడులు ఉన్నాయి. 2014లో ఈ మొత్తం రూ.1.56 లక్షల కోట్లు ఉండగా.. ఈ మొత్తం రూ.15.6 లక్షల కోట్లకు పెరిగింది. అంటే గడిచిన పదేళ్లలో 10 రెట్లు పెరిగింది. ఒక్క అదానీనే కాదు రిలయన్స్, ఐటీసీ, టాటా గ్రూపు కంపెనీల్లోనూ ఎల్ఐసీకి పెద్ద మొత్తంలో వాటాలు ఉన్నాయి. అదానీ గ్రూపులో 4 శాతం వాటా (రూ.60 వేల కోట్ల పెట్టుబడి) ఉండగా.. రిలయన్స్‌లో 6.94 శాతం వాటా (రూ.1.34 లక్షల కోట్లు)బీ ఐటీసీలో 15.86 శాతం (రూ.82,800 కోట్లు)బీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో 4.89 శాతం (రూ.64,725 కోట్లు)బీ ఎస్‌బీఐలో 9.50 శాతం (రూ.79,361 కోట్లు) పెట్టుబడులు ఉన్నాయి. టాటా గ్రూప్‌నకు చెందిన ప్రముఖ ఐటీ సేవల సంస్థ ఒక్క టీసీఎస్‌లోనే 5.02 శాతానికి సమానమైన రూ.5.7 లక్షల కోట్ల పెట్టుబడులు ఎల్ఐసీకి ఉన్నాయి.

## రాజీపడితేనే సొంతిల్లు..

### లేదంటే సవాలే!




విషయం ఏదైనా సరే.. కోరుకున్నవన్నీ దొరక్కపోవచ్చు. ఏదో ఒక విషయంలో రాజీ పడక తప్పదు. ఇళ్ల కొనుగోలుకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. బడ్జెట్, చిక్కుల్లేని యాజమాన్య హక్కు, ప్రాంతం, వాస్తు, నీరు, విద్యుత్తు సరఫరా అంశాలు ఇంటి కొనుగోలు నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి.అయితే వీటిలో కొన్ని అంశాలు మనం ఆశించినట్లు ఉండకపోవచ్చు. అన్నీ మనకు అనుకూలంగా ఉండాలంటే సొంతింటి స్వప్నం ఓ పెద్ద సవాలే అవుతుంది. అలాగనీ ముఖ్యమైన అంశాల్లోనూ రాజీ పడాలని కాదు. ప్రాధాన్యత క్రమంలో ఒకటి, రెండు అనుకూలంగా ఉండకపోవచ్చు. కాబట్టి ఏయే విషయాల్లో రాజీ పడొచ్చు.. ఎక్కడ పడకూడదో స్పష్టత ఏర్పర్చుకోవాలి.ఇల్లు కొనాలన్న ఆలోచనలో ఉన్నారా? అది కూడా మాదాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో అనుకుంటున్నారా? ఇక్కడ వీలవ్వకపోతే మియాపూర్, మదీనాగూడ, మణికొండ, ఓయూ కాలనీ తదితర ప్రాంతాల్లో.. కొంచెం తక్కువ ధరలో దొరికే ప్రాంతాలపై దృష్టి పెడతారు అవునా? ప్రస్తుత రియల్టీ మార్కెట్లో సంపన్నులకే కాదు మధ్యతరగతి, సామాన్యులు.. ఇలా వివిధ వర్గాల వారికి స్థోమతకు తగ్గ బడ్జెట్‌లో నగరం చుట్టూ గృహసముదాయాలు వస్తున్నాయి. మీరు కొంచెం కసరత్తు చేసి, చుట్టుపక్కల ప్రాంతాల్ని అన్వేషిస్తే చాలు, మీకు అందుబాటు ధరలో ఇళ్లు ఎక్కడ దొరికేది ఇట్టే తెలిసిపోతుంది.నిర్మాణాల విషయంలో డెవలపర్ల వ్యూహం మారింది. సకల సదుపాయాలు అందుబాటులో ఉండే విధంగా గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఇల్లు కొనాలన్న నిర్ణయానికొచ్చాక సదుపాయాల సంగతి కూడా ఆలోచించాలి. క్లబ్‌హౌజ్, జిమ్ అవసరమా? వినోదాన్ని, ఆహ్లాదాన్ని అందించే ఈ సదుపాయాలు అక్కర్లేదా? అన్నది తేల్చుకోవాలి. జీవనశైలి, బడ్జెట్ తదితర అంశాలు మీ నిర్ణయంపై ప్రభావితం చేస్తాయి. కాబట్టి సదుపాయాల విషయంలో స్పష్టత ఉండాలి.స్థిరాస్తి కొనేటప్పుడు బిల్డర్ గురించి కూడా ఆరా తీయాలి. మార్కెట్లో పేరున్న బిల్డర్లు నిర్మించే ఇళ్లకే ప్రాధాన్యమివ్వాలి. గతంలో అతను నిర్మించిన ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యాయా? నిర్మాణం ఎలా ఉంది? ఒప్పందం మేరకు కొనుగోలుదారులకు సదుపాయాలు కల్పించాడా? కార్పస్ ఫండ్ బదిలీలో ఇబ్బందులేమైనా సృష్టించాడా? అన్న విషయాల్ని తెలుసుకోవాలి. నిర్మాణాల్లో మంచి చరిత్ర లేని బిల్డర్లకు దూరంగా ఉండటమే మేలు. అలాగనీ మార్కెట్లో పేరున్న బిల్డర్ల ప్రాజెక్టులకే పరిమితం కానక్కర్లేదు. నిర్మాణంలో నాణ్యత పాటించి ఒప్పందానికి కట్టుబడి ఉండేవారిని ఎంచుకోవచ్చు.ఇంటి ముందు పచ్చటి తోటతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలని కొందరు కోరుకుంటారు. మరికొందరేమో ఇలాంటి హంగులు లేకున్నా సర్దుకుపోతారు. బాల్కనీని పచ్చగా, అందంగా అలంకరించుకుంటే గార్డెన్‌కు ధీటుగా ఉంటుందని భావిస్తారు. కాబట్టి ఈ విషయంలో మీ దృక్పథం ఏమిటో నిర్ణయించుకోవాలి.

## పెయింట్ కోసమే రూ.13 లక్షలు..

సాధారణంగా సుజుకి హయబుసా ధర కొంత ఎక్కువగానే ఉంది. అలాంటి ఈ బైకును బంగారంతో తయారు చేస్తే.. దాని ధర ఇంకెంత ఉంటుందో.. ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఒక మోటార్ ఈవెంట్‌లో బంగారు హయాబుసా కనిపించింది.బంగారు హయాబుసాకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీని ధర అక్షరాలా రూ.1.67 కోట్లు అని సమాచారం. ఈ బైకులో చాలా వరకు గోల్డ్ బాడీవర్క్ జరిగి ఉండటాన్ని గమనించవచ్చు. ఇందులో వజ్రాలను కూడా ఉపయోగించారు. బైకుకు వేసిన గోల్డ్ లీఫ్ పెయింట్ కోసం మా త్రమే రూ. 13.3 లక్షలు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఈ పెయింట్ వర్క్ మొత్తాన్ని.. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఆటో మోటివ్ కళాకారులలో ఒకరైన మిస్టర్ డానీ పూర్తిచేశారు. గోల్డ్ హయబుసా వెనుక టైరు.. పరిమాణంలో బుగట్టి కారు కంటే పెద్దదిగా ఉంది. కాగా ఇది 400 హార్స్ పవర్ ప్రొడ్యూస్ చేసే ఇంజిన్ కలిగి ఉంది. ప్రస్తుతం ఈ వీడియో ఆటోమొబైల్ ఔత్సాహికులను తెగ ఆకట్టుకుంటోంది. పలువురు నెటిజన్లు తమదైన రీతిలో కామెంట్స్ చేస్తున్నారు.






# సురక్షిత ప్రయాణానికి ఇవి తప్పనిసరి

## బస్సులో పలు రక్షణసాధనాలు తప్పనిసరంటున్న నిపుణులు



**హైదరాబాద్ (జనంసాక్షి):**హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో ప్యాసింజర్లు మరణించడం అత్యంత దురదృష్టకరం. ఇలాంటి ఘటనలు ప్రయాణికుల భద్రతపై ఆందోళనలను పెంచుతున్నాయి.ఈ నేపథ్యంలో ఏసీ, స్లీపర్ బస్సుల్లో తప్పనిసరిగా ఉండాల్సిన భద్రతా వ్యవస్థలు, వాటిని ఉపయోగించే విధానం గురించి తెలుసుకుందాం. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులు సురక్షితంగా బయటపడడానికి కింది భద్రతా వ్యవస్థలు, సదుపాయాలు ఎంతో అవసరం అవుతాయి.

### ఫైర్ సేఫ్టీ (అగ్నిమాపక భద్రత)

అగ్నిప్రమాదాల వల్ల బస్సుల్లో తీవ్రత అధికంగా ఉంటుంది. ఏసీ, స్లీపర్ బస్సుల్లో కిటికీలు తెరవడానికి వీలులేకపోవడం, తక్కువ ఎంట్రీ/ ఎగ్జిట్ మార్గాలు ఉండడం వల్ల నష్టం ఎక్కువగా ఉంటుంది. బస్సు ప్రయాణిస్తున్న సమయంలో ఇంజిన్ లేదా ఇతర భాగాల్లో ఉష్ణోగ్రత పెరిగినప్పుడు, పొగ వచ్చినప్పుడు వెంటనే డ్రైవర్‌ను, ప్రయాణికులను అప్రమత్తం చేసే సెన్సార్ ఆధారిత అలారం వ్యవస్థ తప్పనిసరిగా ఉండాలి. ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా, సులభంగా ఉపయోగించగలిగే కనీసం రెండు లేదా అంతకంటే ఎక్కువ ఫైర్ ఎక్స్‌టింగ్యుషర్‌లు ఉండాలి.

### ఎమర్జెన్సీ ఎగ్జిట్

సాధారణ ఎంట్రీ/ ఎగ్జిట్ ద్వారాలు కాకుండా బస్సులో కనీసం రెండు సులభంగా తెరవగలిగే అత్యవసర ద్వారాలు (కిటికీలు లేదా హాచ్‌లు) తప్పనిసరిగా ఉండాలి. ఈ మార్గాలను స్పష్టంగా గుర్తించేలా ఏర్పాటు చేయాలి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అగ్నిప్రమాదం తీవ్రతను తగ్గించడానికి ఇంధన సరఫరాను ఆటోమేటిక్‌గా నిలిపివేసే వ్యవస్థ ఉండాలి.

### ఫస్ట్ ఎయిడ్ (ప్రథమ చికిత్స) కిట్

ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో బ్యాండేజీలు, యాంటీసెప్టిక్ వైప్స్, కత్తెర, పట్టీలు, నొప్పి నివారణ మందులు (చిన్న గాయాలు, తలనొప్పి, వాంతులు మొదలైన వాటికి), బర్న్ క్రీమ్స్ వంటి ప్రాథమిక వైద్య సామాగ్రి అందుబా టులో ఉంచాలి. డ్రైవర్, అటెండర్లు ఈ పరికరాలను ఉపయోగించడంపై శిక్షణ పొంది ఉండాలి.

### ఇతర భద్రతా అంశాలు

అత్యవసర పరిస్థితులో కిటికీల అద్దాలు పగలగొట్టి బయటపడేందుకు ఉపయోగపడే సేఫ్టీ హ్యామర్‌లు బస్సులో కనీసం 4-6 చోట్ల ఏర్పాటు చేయాలి. స్లీపర్ బెర్త్‌ల్లో ఇవి లేకపోయినా సీటింగ్ విధానం ఉన్న బస్సుల్లో కచ్చితంగా సీట్ బెల్ట్‌లు ఉండాలి.ప్రమాదం జరిగినప్పుడు డ్రైవర్‌ను, ఇతరులను అప్రమత్తం చేయడానికి ఉపయోగించే అత్యవసర బటన్ ఉండాలి.ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు లేదా విద్యుత్ సరఫరా ఆగిపోయినప్పుడు కూడా మార్గాలు కనిపిం చేలా అత్యవసర లైటింగ్ వ్యవస్థ ఉండాలి. భద్రతా వ్యవస్థలను ఉపయోగించే విధానం అగ్నిప్రమాదం సంభవించినప్పుడు మొదట డ్రైవర్‌ను, తోటి ప్రయాణికులను వెంటనే అప్రమత్తం చేయాలి. అత్యవసర బటన్‌ను నొక్కాలి. అగ్ని ప్రమాద సమయంలో దగ్గరలో ఉన్న ఫైర్ ఎక్స్‌టింగ్యుషర్‌ను ఉపయోగించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించాలి. మంటలు అదుపు తప్పితే వెంటనే బయటకు వెళ్లాలి. ప్రమాద సమయాల్లో అత్యవసర ద్వారాలు లేదా కిటికీలు సేఫ్టీ హ్యామర్‌తో పగలగొట్టి బయటకు రావాలి.బస్సు నుంచి బయటకు వచ్చిన తర్వాత గాయాలు తగిలిన వారికి ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో ఉన్న యాంటీసెప్టిక్ ద్రవంతో శుభ్రం చేసి, బ్యాండేజీ వేయాలి. ఎక్కువగా రక్తస్రావం అవుతుంటే శుభ్రమైన గుడ్డ లేదా ప్యాడ్‌తో గాయంపై గట్టిగా నొక్కి పట్టుకో వాలి. వీలైనంత త్వరగా వైద్య సాయం అందేలా చూడాలి.




## మధుమేహ రోగుల కోసం రైల్వే కీలక నిర్ణయం

### తక్షణమే అమల్లోకి..

**న్యూఢిల్లీ:**దేశంలో పెరుగుతున్న మధుమేహ రోగుల సంఖ్యకు దృష్టిలో ఉంచుకుని.. రైల్వే బోర్డు ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాజధాని, శతాబ్ది, దురంతో, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వంటి ప్రీమియం రైళ్లకు టిక్కెట్లు బుక్ చేసుకునేటప్పుడు, మీకు డయాబెటిక్ ఆహారం అవసరమని ముం దుగానే సూచించవచ్చు.ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని రైల్వే బోర్డు వెల్లడించింది.రైల్వే బోర్డు సీనియర్ అధికారి దీని గురించి మాట్లాడుతూ, అన్ని ప్రీపెయిడ్ రైళ్లు ఇప్పుడు ఐదు రకాల ఆహార ఎంపికలను అందిస్తాయని తెలిపారు. అవి శాఖాహారం, మాంసాహారం, జైన్ భోజనం, డయాబెటిక్ శాఖాహారం, డయాబెటిక్ మాంసాహారం. దీని అర్థం డయాబెటిస్ ఉన్నవారికి శాఖాహారం మాంసాహారం రెండూ ఉంటాయి. భారతదేశంలో.. ప్రతి సంవత్సరం సగటున 1.6 మిలియన్ల మంది డయాబెటిస్ కారణంగా మరణిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. రాజధాని ఎక్స్‌ప్రెస్, శతాబ్ది ఎక్స్‌ప్రెస్, దురంతో ఎక్స్‌ప్రెస్.. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లలో ఆహార ఎంపికలను విస్తరించాలని రైల్వే బోర్డు నిర్ణయించింది.భారతదేశం ప్రస్తుతం ప్రపంచ మధుమేహ రాజధానిగా గుర్తింపు పొందుతోంది. ఇక్కడ దాదాపు 220 మిలియన్ల మంది టైప్ 2 డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. కాగా ఈ సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గతంలో వృద్ధులు మాత్రమే ఈ వ్యాధితో బాధపడేవారు. కానీ ఇప్పుడు యువకులు కూడా పెద్ద సంఖ్యలో దీనికి బలైపోతున్నారు. ది లాన్సెట్ 2023 నివేదిక ప్రకారం.. భారతదేశంలో 212 మిలియన్ల మంది డయాబెటిక్ రోగులు ఉన్నారు. ఈ సంఖ్య చైనాలో 149 మిలియన్లు, యునైటెడ్ స్టేట్స్‌లో కేవలం 42 మిలియన్లు మాత్రమే. దీని అర్థం చైనా యునైటెడ్ స్టేట్స్ రెండింటి సంఖ్యలను కలిపినా, మొత్తం ఇప్పటికీ 191 మిలియన్లుగానే ఉంది. ఒక్క భారతదేశంలో మాత్రమే 210 మిలియన్లకు పైగా డయాబెటిక్ రోగులు ఉన్నారు.

## మహిళ వేషంలో బిన్‌లాడెన్

### మాజీ సీఐఏ అధికారి వెల్లడి



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ ఉ?గ్రవాది ఒసామా బిన్ లాడెన్‌కు సంబంధించిన ఒక వార్త ఇప్పుడు సంచలంగా మారింది. 2001, సెప్టెంబర్ 11 ఉగ్ర దాడులతో అమెరికాకు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదిగా మారిన అల్ ఖైదా వ్యవస్థాపకుడు ఒసామా బిన్ లాడెన్..మహిళ వేషంలో టోరా బోరా కొండల నుండి తప్పించుకు న్నాడని కేంద్ర నిఘా సంస్థ(సీఐఏ) మాజీ అధికారి జాన్ కిరియాకౌ తాజాగా వెల్లడించారు.జాన్ కిరియాకౌ ఏఎన్ఐకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అమెరికా సైన్యంలో రహస్యంగా చొరబడిన అల్ ఖైదా కార్యకర్త సహాయంతో ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్.. మహిళ వేషం వేసుకుని, టోరా బోరా నుంచి తప్పించుకున్నాడని తెలిపారు. సీఐఏలో 15 ఏళ్లు పనిచేసి, పాకిస్తాన్‌లో ఉగ్రవాద నిరోధక కార్యకలా పాలకు నాయకత్వం వహించిన కిరియాకౌ, అమెరికాలో సైనిక శ్రేణుల్లో అల్ ఖైదా కార్యకర్తల చొరబాట్లను తెలియజేశారు. 9/11 దాడుల అనంతరం అమెరికా సంయ మనంగా వ్యవహరించింది, ఆఫ్ఘనిస్తాన్ లో బాం బు దాడులను చేపట్టేందుకు నెల్లాళ్లు వేచివుం దన్నారు. ఈ తరుణంలోనే అల్ ఖైదా చొరబాటు దారునిగా తేలిన అనువాదకుడు ఉగ్రవాది బిన్ లాడెన్ తప్పించుకు నేందుకు అవకాశం కల్పించాడని తెలిపారు. లాడెన్ తప్పించుకున్న ఘటన దరిమిలా యూఎస్ ఉగ్రవాద నిరోధక దృష్టి పాకిస్తాన్ వైపు మళ్లిందని జాన్ కిరియాకౌ తెలిపారు. ఈ నేపథ్యంలో అప్పటి పాకిస్తాన్ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌తో చర్చలు జరిగాయని, అతను అమెరికా నుంచి ఆర్థిక, సైనిక సహాయానికి బదులుగా దేశంలోకి యూఎస్ కార్యకలాపాలను అనుమతించాడని పేర్కొన్నారు. అదే సమయంలో సీఐఏ పాకిస్తాన్ గ్రూప్ లష్కరే తోయిబా, అల్-ఖైదా మధ్య గల సంబంధాలను గుర్తించిందన్నాను. ఇది అమెరికా నిఘా వ్యవహారాల్లో మైలురాయిగా నిలిచిందన్నారు.

## వలసదారులపై మరో పిడుగు

దేశాన్ని వీడే, దేశంలోకి అడుగుపెట్టే వారి ఫొటోలు, డేటా సేకరణను యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ పెంచనుంది. ఫేక్ ట్రావెల్ పేపర్లను గుర్తించేం దుకు, జాతీయ భద్రతను బలోపేతం చేసేందుకు డిసెంబర్ 26 నుంచి ఈ నిబంధనలను అమలు చేయనుంది. వివిధ మార్గాల్లో ఇమ్మిగ్రేషన్ చట్టాల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించేవారిని, వీసా గడువు ముగిసిన తర్వాత కూడా దేశంలోనే ఉంటున్నవారిని గుర్తించేందుకు వీలవుతుందని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. ఇక, 2021లోనే ఈ కొత్త నియంత్రణలు ప్రతిపాదించగా.. ఇప్పుడు పూర్తిస్థాయిలో సాంకేతికత ఉపయోగించి అక్రమవలసదారులకు చెక్ పెట్టనున్నారు. కాగా.. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అంటూ జాతీయ వాదాన్ని బలంగా వినిపిస్తోన్న ట్రంప్ హెచ్-1బీ వీసాలకు సంబంధించి నిబంధనలు విధించారు. వాటి వార్షిక రుసుమును ఒకేసారి లక్ష డాలర్లకు పెంచేసి సంచలనం సృష్టించారు. అనంతరం పలు సవరణలు చేశారు. ఈ వీసా వ్యవస్థను సరిదిద్దడానికఫీజు నిర్ణయం తీసుకున్నారని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లివిట్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

## విజిటర్‌ను వేధించిన భారత నర్సుకు జైలు



**సింగపూర్:** భారతీయ స్టాఫ్ నర్సుకు జైలు శిక్ష పడిన ఉదంతం సింగపూర్‌లో చోటుచేసుకుంది. ఆస్పత్రికి వచ్చిన ఒక పురుషుడిని వేధించినందుకు ఒక మేల్ నర్సుకు శిక్ష పడింది.సదరు మేల్ నర్సు కోర్టు ముందు నేరాన్ని అంగీకరించిన దరిమిలా అతనికి శిక్ష ఖరారయ్యింది. ఒక సంవత్సరం, రెండు నెలల జైలు శిక్షతోపాటు, రెండు బెత్తం దెబ్బలను అతనికి శిక్షగా విధించారు.సింగపూర్‌లోని రాఫెల్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న భారతీయ స్టాఫ్ నర్సు ఏలిపె శివ నాగు(34) జూన్ 18న లైంగిక వేధింపుల ఆరోపణల్లో దోషిగా తేలాడు. 'ది స్ట్రెయిట్స్ టైమ్స్' తెలిపిన వివరాల ప్రకారం రాఫెల్స్ ఆసుపత్రికి వచ్చిన ఒక పురుష సందర్శకుడిని శివ నాగు లైంగిక వేధింపులకు గురిచేశాడు. బాధితుని వయస్సు తదితర వివరాలను కోర్టు పత్రాలలో గోప్యంగా ఉంచారు. జూన్ 18న బాధితుడు నార్త్ బ్రిడ్జ్ రోడ్‌లోని రాఫెల్స్ ఆస్పత్రి వెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతున్న తన తాతను చూసేందుకు వచ్చాడని డిప్యూటీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యూజీన్ ఫువా వివరించారు.తరువాత ఏలిపె శివ నాగు 'డిస్ఇన్‌ఫెక్ట్' చేస్తానంటూ బాధితుని దగ్గరకు వెళ్లి, తన చేతికి సబ్బు రాసుకుని అతనిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని డిప్యూటీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యూజీన్ ఫువా కోర్టులో తెలిపారు. ఈ ఘటన తర్వాత బాధితుడు తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యాడు. జూన్ 18న ఈ ఘటన జరిగింది. జూన్ 21న బాధితుడు ఈ ఉదంతంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ఈ నేపథ్యంలో పోలీసులు శివ నాగును అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ఆస్పత్రి యాజమాన్యం ఏలిపె శివ నాగును నర్సింగ్ విధుల నుంచి సస్పెండ్ చేసింది.

# అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో 100% మా ప్యానలే గెలుస్తుంది

- మా అభ్యర్థులంతా మంచి అనుభవం..ఆలోచన.. ఆశయం కలవారు
- మా ప్యానల్ అభ్యర్థుల వ్యక్తిత్వం చూసి ఓటెయ్యండి
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** కరీంనగర్, జగిత్యాల అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో తమ ప్యానెల్ 100 శాతం విజయం సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు గట్టి ధీమా వ్యక్తం చేశారు. ఖాతాదారులు, సభ్యుల సహకారంతోనే ఈ విజయం సాధ్యమవుతుందని, తమ అభ్యర్థులందరూ మంచి అనుభవం, ఆలోచన, ఆశయాలతో కూడిన వ్యక్తిత్వాలు కలిగినవారని పేర్కొన్నారు. వారి వ్యక్తిగత లక్షణాలు, సేవా మనస్తత్వాన్ని చూసి ఓటు వేయాలని ఖాతాదారులను ప్రోత్సహించారు. గెలిచిన తర్వాత అర్బన్ బ్యాంకును అద్భుతంగా మార్చి, స్వచ్ఛమైన, నీతిమంతమైన పాలన అందిస్తామని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం వెలిచాల ప్రజా కార్యాలయంలో అర్బన్ బ్యాంకు ప్యానెల్ అభ్యర్థులతో కలిసి రాజేందర్ రావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తమ ప్యానెల్ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించారు. బ్యాంకు అభివృద్ధి ప్రణాళికలు, గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నవారు మళ్లీ అధికారం కోసం తాపత్రయపడటం వంటి కీలక అంశాలు వెల్లడించారు. మాట్లాడుతూ, గత ఎనిమిది సంవత్సరాలుగా కరీంనగర్ అర్బన్ బ్యాంకు ఎన్నికలు జరగలేదని, వివిధ అలిగేషన్లు, ఆరోపణల వల్ల కోర్టు కేసులు నడిచి జాప్యం అయిందని తెలిపారు. ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకున్నారని, కోర్టు ఆదేశాల ప్రకారం ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్నాయని వివరించారు. తమ ప్యానెల్ గెలిస్తే బ్యాంకును పూర్తిస్థాయిలో సంస్కరించి, ఖాతాదారులకు, సభ్యులకు పూర్తి భద్రత కల్పిస్తామని, వారి సొమ్ముకు ఎలాంటి డోకా లేకుండా నిజాయితీగా సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం 92 కోట్ల డిపాజిట్లు ఉన్న బ్యాంకులో మూడింతలు పెంచి 276 కోట్లకు చేర్చుతామని, నాలుగు కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. హుస్నాబాద్, చొప్పదండి, హుజురాబాద్, జమ్మికుంటల్లో కొత్త బ్రాంచ్‌లు ప్రారంభించి, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను విస్తరిస్తామని చెప్పారు. ఖాతాదారులను స్వయంగా కలిసి ఓటు అభ్యర్థించి, మంచి మెజార్టీతో అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తానని రాజేందర్ రావు తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆ నియోజకవర్గం నుంచి మంచి ఆశయం, పట్టుదల కలిగిన ఇద్దరిని ప్రతిపాదించారని, దానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. రోజురోజుకు మద్దతు పెరుగుతోందని, ఓటర్లు ఉత్సాహంగా మద్దతు తెలుపుతున్నారని ఆయన గుర్తుచేశారు. ప్యానెల్‌కు మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, విప్ ఆది శ్రీనివాస్ ఆశీస్సులు, మద్దతు లభిస్తున్నాయని చెప్పారు. విలేకరుల సమావేశంలో మద్దతిస్తున్న ప్యానెల్ అభ్యర్థులు మూల వెంకట రవీందర్ రెడ్డి, ఈ.లక్ష్మణ్ రాజు, అనురాసు కుమార్, వజీర్ అహ్మద్, ఉయ్యాల ఆనందం, చిందం శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, గాదె కార్తీక్, కూసరి అనిల్ కుమార్, మన్నె అనంత రాజు, మునిఫల్లి ఫణిత, దామెర శ్రీలత రెడ్డి, కాంగ్రెస్ నాయకులు,పాల్గొన్నారు.



## ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 25 (జనం సాక్షి) :** తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని,సిఐటియు జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ రాష్ట్ర నాలుగవ మహాసభలు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఈనెల 26,27,తేదీలలో రెండు రోజుల పాటు జరగనున్నాయని తెలిపారు.క్రౌన్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జరిగే మహాసభలలో భాగంగా మొదటి రోజు బహిరంగ సభ,రెండవ రోజు ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు.ప్రభుత్వం ఆశాలకు 18000 ఫిక్స్ వేతనం చెల్లిస్తామని, పియఫ్, ఈఎస్ఐ కల్పిస్తామని, ఏఎన్ఎం, జిఎన్ఎమ్ ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశాలకు ఏఎన్ఎం, జిఎన్ఎమ్ పోస్టులలో డైరెక్ట్ ప్రమోషన్ సౌకర్యం కల్పిస్తామని లేదా వేయిటేజి మార్కులు నిర్ణయిస్తామని వంటి అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు.ఇచ్చిన హామీలు అమలు చేయకపోగ ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా,అదనంగా చేయించిన పనులకు డబ్బులు ఇవ్వకుండా,అదనపు పని భారాలను మోపుతూ ఆశాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు.రాష్ట్ర మహాసభలకు ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులతో పాటు, సీఐటీయు రాష్ట్ర నాయకత్వం హాజరు కానుందని తెలిపారు.మహాసభలలో ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలు,చేసిన పోరాటాలు,సాధించిన విజయాలు,భవిష్యత్తు కర్తవ్యాలు రూపొందించుకుంటామని తెలిపారు.26 న జరిగే బహిరంగ సభకు జిల్లాలోని ఆశా కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలనీ కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజనర్సు, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇందిర, రాజశ్రీ, మమత, భాగ్యలక్ష్మి, పల్లవి, కవిత, లలిత, గంగమణి, విజయ, అనిత, కృష్ణవేణి, నాగమణి, మంజుల, స్వప్న, శారద, ప్రమీల, మణెమ్మ, సుధారాణి, లావణ్య,శోభ, తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి పట్టణంలో ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసుల భారీ ఎత్తున సైకిల్ ర్యాలీ నిర్వహణ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 25 (జనంసాక్షి) :** పోలీసు అమరులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి. స్వయంగా సైకిల్ ర్యాలీ నందు పాల్గొని, ర్యాలీ పూర్తి చేసి, సిబ్బందికి ఆదర్శప్రాయంగా నిలిచిన జిల్లా ఎస్పీ ఉత్సాహంగా పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది.300 సైకిల్‌లతో పట్టణ దారి గుండా అమరవీరులకు జోహార్లు తెలుపుతూ కొనసాగిన సైకిల్ ర్యాలీ. ర్యాలీలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేసిన జిల్లా ఎస్పీ జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర,పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శనివారం ఉదయం కామారెడ్డి స్వాగత తోరణం నుండి పొందుర్తి ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ యం రాజేష్ చంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శనివారం సైకిల్ ర్యాలీని ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సైకిల్ ర్యాలీ ముఖ్య ఉద్దేశం పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలను, కఠినతరమైన విధులను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలనే ఉద్దేశంతో నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ పొందుర్తి-కామారెడ్డి స్వాగతం తోర ణం నుంచి ప్రారంభమై జి.ఆర్. కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, నిజాంసాగర్ చౌరస్తా, మున్సిపల్ కార్యాలయం ముందు, బస్టాండ్ ముందు, సరస్వతి శిశు మందిర్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ముందు గుండా సాగి కళాభారతి వద్ద ముగిసింది. పోలీసు అమరవీరులను త్యాగాలు స్మరించుకుంటూ, నిరంతరం ప్రజలలో చిరస్మరణీయంగా ఉండటానికి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలలో పోలీసుల సత్సంబంధాలను మెరుగుపరుచుకుంటూ, పబ్లిక్ పోలీస్ రిలేషన్ ను మరింత పెంపొందించా లని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి అదనపుఎస్పీ కే నరసింహ రెడ్డి, ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, బాన్సువాడ డీఎస్పీ బి. విట్టల్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది, వివిధ కాలేజీల విద్యార్థులు, ఉత్సాహంగా పాల్గొని అమరవీరులకు ఘనమైన నివాళులు అర్పించారు.

## కుటుంబ కలహాలతో గడ్డి మందు సేవించి యువకుడు మృతి



**గోదావరిఖని, జనంసాక్షి :** స్థానిక మార్కండేయ కాలనీకి చెందిన గంధం రాంకీ (29) కుటుంబ కలహాలతో ఈనెల 20న గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. హుటాహుటిన కుటుంబ సభ్యులు రాంకీనీ కరీంనగర్ లోని కెల్విన్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తున్న క్రమంలో ప్రజ్ఞాపూర్ కు రాగానే మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గత రెండున్నర సంవత్సరములుగా అతని భార్యతో కుటుంబ కలహాలను మనసులో పెట్టుకున్నాడు. గత భార్య కాపురానికి రావటం లేదని మనస్థాపం చెంది ఈనెల 20న రాత్రి అందాజ 10 గంటల సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.అదే రోజు రాత్రి కరీంనగర్లో గల కెల్విన్ ఆసుపత్రిలో చికిత్స అందించగా పరిస్థితి విషమించడంతో నిన్న సాయంత్రం హైదరాబాదు ఆసుపత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలిస్తూ ఉండగా ప్రజ్ఞాపూర్ దగ్గరకు వెళ్లేసరికి మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుని మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురిగదిలో ఉంచారు.మృతుని భార్య ఫిర్యాదు మేరకు గోదావరిఖని 1 టౌన్ ఎస్ఐ పి.రాజయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఎయిర్ రైఫిల్ షూటింగ్ పోటీలను ప్రారంభించిన అల్ఫోర్స్ చైర్మన్

**ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి.నరేందర్ రెడ్డి.**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** క్రీడల ద్వారా విద్యార్థులకు ఎన్నో లాభాలు చేకూరడమే కాకుండా ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారని తద్వారా విజయ అవకాశాలను మెరుగుపరచుకోవడానికి చేయూతనిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు , విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు "అల్ఫోర్స్" డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక భగత్ నగర్ లోని స్వదేష్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీలో కరీంనగర్ జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, అకాడమీ ప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేసినటువంటి అండర్ 19 బాల బాలికల ఎయిర్ రైఫిల్ షూటింగ్ ఎంపిక పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు విద్యారంగంతో పాటు క్రీడారంగంలో నైపుణ్యం పొందే విధంగా ప్రోత్సాహం అందించాలని, క్రీడారంగంలో నైపుణ్యం పొందడానికి కావలసినటువంటి వనరులను సమకూర్చి వాటిలో నిష్ణాతులుగా చేయాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం వారి పిల్లలకు ఇష్టమైనటువంటి క్రీడా రంగాలలో శిక్షణ ఇప్పించి వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీలకు ప్రాతినిధ్యం వహించే విధంగా ప్రోత్సాహం అందించాలని కోరారు. కరీంనగర్ జిల్లా క్రీడారంగంలో రాణిస్తున్నదని, రాణించడం చాలా శుభ పరిణామం అని తెలుపుతూ క్రీడా రంగాన్ని అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతనిస్తున్నదని ప్రతి ఒక్కరు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వదేశ్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ అరుణ్ తేజ, పిఇటిలు పిడిలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తింపు సంఘం కృషి ఫలితంగా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లకు మోక్షం

**ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ వెల్లడి**



**గోదావరిఖని, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** సింగరేణిలో ఉన్న ట్రాన్స్ఫర్ పాలసీని మార్చాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పలుమార్లు యాజమాన్యం తో చర్చించి ఒప్పించి కార్మికుల వ్యక్తి గత, మ్యూచ్వల్, స్పౌస్, హెల్త్ గ్రౌండ్ ప్రాతిపదికన ఈ రోజు 114 మందికి ట్రాన్స్ఫర్ ఉత్తర్వులు ఇప్పించడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. సింగరేణి లో కార్మికులు ఎవరైతే పని చేస్తున్న ప్రదేశంలో 3 సం. ల సర్వీస్ ఉండి ఖాళీ ఉన్న ప్రాంతానికి ట్రాన్స్ఫర్ కోరుకున్న వారికి, మ్యూచ్వల్ ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్న వారికి, స్పౌస్ కేస్ లో ఖాళీలను బట్టి, అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతూ ఖాళీలు ఉన్న ప్రాంతానికి ట్రాన్స్ఫర్ కోరిన వారికి శనివారం సింగరేణి యాజమాన్యం ట్రాన్స్‌ఫర్ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ట్రాన్స్ఫర్ పాలసీలో మ్యూచ్వల్ ట్రాన్స్‌ఫర్‌కి కూడ మూడు సంవత్సరాల సర్వీస్ నిబంధన ఉండేదని, ప్రస్తుతానికి మూచ్యువల్ ట్రాన్స్ఫర్ పై 3 సంవత్స రాల నిబంధనను, స్పౌస్ కేసు ఖాళీల ప్రాతిపదికన వీటిని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ యాజమాన్యంతో మాట్లాడి ఒప్పించి, వారికి కూడా ట్రాన్స్ఫర్ ఆర్డర్స్ ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా డైరెక్ట్ ట్రాన్స్ఫర్స్ మూడు సంవత్సరాలు దాటిన వారికి ఖాళీల ప్రాతిపదికన వారికి కూడ ట్రాన్స్‌ఫర్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ విదంగా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు ఏఐటీయూసీ కృషి ఫలితంగా విడుదల ఐనాయని ఆయన ఒక ప్రకటన లో పేర్కొన్నారు.



## ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

**గాంధారి పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్**

**గాంధారి అక్టోబర్ 25 జనం సాక్షి :** ఎల్లారెడ్డి నియోజకవర్గం గాంధారి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ హేమ్లా నాయక్ తండా, లో జీపీ భవనానికి భూమి పూజ, పోతంగల్ కలాన్, పిస్కులు గుట్ట, చద్మల్, సర్వాపూర్ గ్రామలలో కొత్తగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలు ప్రారంభోత్సవం, ఎక్కకుంట తండాలో అంగన్వాడీ భవనానికి భూమి పూజ, పేట్ సంగెం, గుర్జాల్ గ్రామాలలో పిఏసిఎస్ గోడౌన్ ప్రారంభోత్సవ కార్యక్రమాలలో పాల్గొన్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామానికి సమగ్ర అభివృద్ధి అందించడమే మా లక్ష్యం గ్రామ పంచాయతీ భవనాలు ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరవేసే కేంద్రాలుగా మారాలి. ఈ కొత్త భవనాలు గ్రామాల అభివృద్ధికి, ప్రజా అవసరాలకు మరింత ఉపయోగపడతాయి అని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించడం జరిగింది. శనివారం ఒక్క రోజున ఇన్ని అభివృద్ధి పనులను చేయడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. గతంలో ఎప్పుడు కూడా ఈ విధంగా అభివృద్ధి జరగలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నియోజకవర్గంలో శరవేగంగా అభివృద్ధి పనులను జరుగుతున్నాయన్నారు. ఈ కార్యకారమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి సినిమా మళ్లీ చూపిస్తున్నాడు : మన్నె క్రిశాంక్

**హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్ లీడర్ మన్నె క్రిశాంక్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి అహ నా పెళ్లంట సినిమాను మళ్ళీ చూపెడుతున్నాడు అని క్రిశాంక్ ఎద్దేవా చేశారు. కంటోన్మెంట్‌లో తప్పుడు హామీలు ఇచ్చి గెలిచి, ఇప్పుడు జూబ్లీహిల్స్‌లో కూడా అదే చేస్తున్నాడు అని క్రిశాంక్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి, మంత్రులు కంటోన్మెంట్ ప్రజలను మోసం చేసినట్లు, జూబ్లీహిల్స్ ప్రజలను కూడా మోసం చేయడానికి సిద్ధమయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కంటోన్మెంట్‌కు కేంద్రం నుండి రూ.1000 కోట్లు తెస్తా అన్నాడు.

## ఖని 1-టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్

**గోదావరిఖని, జనంసాక్షి :** పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా ఈరోజు పెద్దపల్లి జిల్లా గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ లో విద్యార్థిని విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఉపయోగిస్తున్న టెక్నాలజీ గురించి, పౌరులు పొందాల్సిన సేవలు, డయల్ 100, షీ టీం, సైబర్ క్రైమ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే నష్టాల గురించి, రిసెప్షన్, స్టేషన్ రైటర్, వి హెచ్ ఎఫ్ సెట్, టెలికాన్ఫరెన్స్, ఆన్ లైన్ ఎఫ్ఐఆర్, పార్టు మ్యాప్, ఆయుధాలు భద్రపరచు రూమ్, సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్, మైనర్ డ్రైవింగ్ చేయవద్దని, మోటర్ వాహనాల చట్టాల గురించి, వివిధ రకాల బందోబస్తు గురించి, సమాజంలో పోలీసుల పాత్ర, కర్తవ్యాలపై విద్యార్థులకు సమాచారం అందిస్తూ, నేర నివారణలో పోలీసుల పాత్రను వివరించి విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేరస్తులను ఫింగర్ ప్రింట్ విధానం ద్వారా గుర్తుపట్టే టెక్నాలజీ, ఫ్రెండ్లీ పోలీసింగ్ పై అవగాహన కల్పించారు. ఏదైనా నేరం జరిగినప్పుడు వెంటనే పోలీస్ వారికీ సమాచారం అందుంచాలని, ఏదైనా సమస్య ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్ కి వచ్చి ఫిర్యాదు చేయాలనీ, ఏదైనా సమస్యతో వచ్చే బాధితులకు కార్పొరేట్ స్థాయిలో భరోసా, నమ్మకం కలిగే విధంగా పోలీస్ స్టేషన్ లో రిసెప్షన్ సెంటర్లను ఏర్పాటు చేసి బాధితుల సమస్య తెలుసుకొని వారు చెప్పిన సమస్యను తెలుసుకొని వారిని పై అధికారులను కలిపించడం త్వరితగతికన



సమస్య పరిష్కారానికి చట్టపరిధిలో చూడడం జరుగుతుంది అని అదేవిదంగా ఈ కార్యక్రమం వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు ఇంటికి వెళ్లగా తమ తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు, బంధువులకి, చుట్టుపక్కల వారికి ఏదైనా సమస్య ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేయాలని పోలీసులు ఎప్పుడు ప్రజల రక్షణ కోసమే ఉన్నారని వారికీ తెలియచేయండి అని సూచించారు. చదువు ఒక్కటే విద్యార్థుల జీవితాలను మారుస్తుందని విద్యార్థిని,విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు గొప్ప పేరు తీసుకురావాలని తెలిపారు.

## పీటీసీలో 'గివ్ బ్లడ్ - సేవ్ లైఫ్' మంత్రం

- అమరుల ఆత్మకు రక్తార్పణ... సైకిల్‌పై స్ఫూర్తి ప్రయాణం!
- 80 యూనిట్ల రక్తంతో జీవనదానం
- 20 కి.మీ సైకిల్ ర్యాలీలో యువత ఉత్సాహం
- అక్టోబర్ 31 వరకు సేవా సందేశ ఉత్సవాలు




**కరీంనగర్, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ కళాశాల (పీటీసీ)లో శనివారం 'గివ్ బ్లడ్ - సేవ్ లైఫ్' నినాదంతో ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఎమోషనల్‌గా మాట్లాడుతూ, "సమాజ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగం మనల్ని ఎప్పటికీ స్ఫూర్తివంతుల్ని చేస్తుంది. వారి ఆత్మకు నిజమైన నివాళి... రక్తదానం ద్వారా జీవాలను కాపాడటం" అని పేర్కొన్నారు. పీటీసీ అధికారుల సేవా దీక్షను సీపీ హృదయపూర్వకంగా అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ ఎస్పీ ఎం. పిచ్చయ్య మాట్లాడుతూ, "ఈ శిబిరంలో సేకరించిన 80 యూనిట్ల రక్తాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌కు అందజే మాట్లాడుతూ, "ఈ శిబిరంలో సేకరించిన 80 యూనిట్ల రక్తాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌కు అందజేస్తాం. ఒక్కో యూనిట్... ముగ్గురి ప్రాణాలను కాపాడగలదు" అని గర్వంగా తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. పిచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ డీఎస్పీ బి. మోహన్, జి. విజయపాల్ రెడ్డి, సి.హెచ్. మల్లికార్జున్, బి. గంగాధర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మహేష్, రమేష్ సహా ఇతర అధికారులు, సిబ్బంది రక్తదానం చేసి సేవా ఆదర్శాన్ని చాటారు. అదే రోజు ఉదయం పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో నగరంలో 20 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీ జోష్‌తో సాగింది. పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి సీపీ గౌష్ ఆలం జెండా ఊపి ర్యాలీని శుభారంభించారు. కరీంనగర్ రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు, పాఠశాల విద్యార్థులు, డాక్టర్లు ఉత్సాహంగా పెడల్ తొక్కారు. బస్ స్టేషన్, ప్రతిమ మల్టీప్లెక్స్, గీతాభవన్ చౌరస్తా, పొన్నం కాంప్లెక్స్, శివ థియేటర్ సర్కిల్, కెమిస్ట్ భవన్, ఎలక్ట్రిసిటీ ఆఫీస్ వద్ద యూ టర్న్ తీసుకుని కోర్ట్ చౌరస్తా, మంచిర్యాల, గాంధీ, నాఖా, బోట్, కమాన్ చౌరస్తాలు దాటుకుంటూ మళ్లీ పరేడ్ గ్రౌండ్‌లో ముగిసింది. ర్యాలీ అనంతరం సీపీ అమరవీరుల త్యాగ ప్రాముఖ్యతను గుండెల్నిండా వివరించి, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ చేతుల మీదుగా మెడల్స్ అందజేసి సత్కరించారు. ప్రజలను సేవా కార్యక్రమాల్లో భాగస్వాముల్ని చేయడం లక్ష్యంగా అక్టోబర్ 31 వరకు వివిధ కార్యక్రమాలు కొనసాగుతాయని సీపీ ప్రకటించారు. "ముఖ్యంగా యువత, విద్యార్థులు ఈ ఉత్సవాల్లో భాగమవ్వాలి" అని ఆయన ఆహ్వానించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, యాదగిరిస్వామి, మాధవి, ఇన్‌స్పెక్టర్లు, ఆల్‌ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి, రన్నర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్ పాసుల, డాక్టర్ అజయ్ ఖండాల, డాక్టర్ కిరణ్ తోపాటు విద్యార్థులు, సైక్లిస్టులు పాల్గొన్నారు.

## వంగర ఘటనపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించాం

- బాలిక మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన ప్రణవ్
- బాలిక మృతదేహాన్ని అడ్డుపెట్టుకొని శవ రాజకీయాలు చేయడం సిగ్గుచేటు
- ఓటు చోరీపై ఎలక్షన్ కమిషన్ కౌశిక్‌రెడ్డి చంప చెళ్లుమనిపించింది

**హుజురాబాద్, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** భీమదేవరపల్లి మండలం శుక్రవారం వంగర గ్రామంలో హుజురాబాద్ మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన శ్రీ వర్షిత అనే బాలిక ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని,దీనిపై ఇప్పటికే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విచారణకు ఆదేశించారని,నివేదిక రాగానే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియజేశారు.బాలిక మృతదేహాన్ని అడ్డుపెట్టుకొని కౌశిక్ రెడ్డి చేసిన ధర్నా చూస్తే సభ్య సమాజం తలదించుకునేలా ఉందని,పాప చనిపోయి పుట్టెడు దుఃఖంలో తల్లిదండ్రులు ఉంటే దీన్ని కౌశిక్ రెడ్డి అదునుగాతీసుకొని పోస్ట్ మార్టం అయిన తర్వాత బాలిక మృతదేహాన్ని అంబేద్కర్ చౌరస్తాలో పెట్టి ధర్నా చేయడం నీచమైన రాజకీయమని,అప్పుడు ఓట్ల కోసం సెంటిమెంట్ వాడుకున్నాడని,ఇప్పుడు శవరాజకీయాలను కౌశిక్ రెడ్డి ప్రోత్సహిస్తున్నాడని



ఇది సిగ్గు చేటని అన్నారు.కౌశిక్ రెడ్డి లాంటి దౌర్భాగ్యపు ఎమ్మెల్యే ను దేశంలో ఇంతవరకు చూడలేదని అన్నారు.కౌశిక్ రెడ్డికి అంతలా సహాయం చేయాలి అనుకుంటే నేరుగా అధికారులతో మాట్లాడి సహాయం చేయాలి కానీ ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయడం మంచిదికాదని అన్నారు.

**ఓటు చోరీపై అసత్యపు ప్రచారాలు మానుకో కౌశిక్ రెడ్డి**

ఓటు చోరీ జరిగిందని ఆరోపించిన కౌశిక్ రెడ్డికి ఎన్నికల సంఘం గట్టిగా బుద్ధి చెప్పిందని,చెంప చెల్లుమనేలా సమాధానం ఇచ్చిందని ఇప్పటికైనా కౌశిక్ రెడ్డి బుద్ధి మార్చుకోవాలని కోరారు.ఎన్నికల సంఘం గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇదే ఓట్లు ఆ అపార్ట్మెంట్ లో ఉన్నాయని సమాధానం ఇవ్వగా బిఆర్ఎస్ నాయకులు తెల్లమొహం వేశారని అన్నారు.

# ప్రతిభకు పట్టం.. శ్రీ చైతన్య స్కాలర్‌షిప్ టెస్ట్

- పదో తరగతి విద్యార్థులకు భవిష్యత్తు బాట
- టాపర్‌కు ల్యాప్‌టాప్, టాబ్‌లు, ఫీజు రాయితీలు
- లక్కీడ్రాలో టీవీ, సైకిల్, మొబైల్
- నవంబర్ 2న పరీక్ష, రిజిస్ట్రేషన్ ఆహ్వానం



కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 25 (జనంసాక్షి) : పదో తరగతి విద్యార్థుల ప్రతిభను వెలికితీసి ప్రోత్సాహించేందుకు శ్రీ చైతన్య ఐఐటీ, నీట్ అకాడమీ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు సంస్థ చైర్మన్ ఎం.రమేష్ రెడ్డి తెలిపారు. నవంబర్ 2 (ఆదివారం) ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు ఈ పరీక్ష జరగనుంది. శనివారం కరీంనగర్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్య ద్వారా విద్యార్థుల జీవితాలను మార్చడమే తమ ధ్యేయమని, ఆర్థిక పరిమితులు ప్రతిభకు అడ్డుకాకూడదనే ఉద్దేశంతో ఈ పరీక్ష చేపడుతున్నట్టు స్పష్టం చేశారు. ప్రథమ ర్యాంకర్‌కు ల్యాప్‌టాప్, 2 నుంచి 10 ర్యాంకుల వారికి ట్యాబ్‌లు, 1 నుంచి 100 ర్యాంకుల వరకు ఫీజు రాయితీలతోపాటు ప్రత్యేక రివార్డులు అందజేస్తామని పేర్కొన్నారు. 1-10 ర్యాంకులకు 100 శాతం ట్యూషన్ ఫీజు ఉచితం (హాస్టల్/డే స్కాలర్), 11-20 ర్యాంకులకు 60 శాతం, 21-30కి 50 శాతం, 31-40కి 45 శాతం, 41-50కి 40 శాతం, 51-100కి 35 శాతం రాయితీ లభిస్తుందని, ఇవి తమ కళాశాలలో చేరిన వారికే వర్తిస్తాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అందరికీ లక్కీ డ్రా నిర్వహించి మొదటి బహుమతిగా ఎల్ఈడీ టీవీ, రెండోదిగా సైకిల్, మూడోదిగా మొబైల్ ఫోన్ అందజేస్తామని చెప్పారు. గతేడాది టాపర్లకు ల్యాప్‌టాప్‌లు ఇచ్చినట్టు గుర్తుచేశారు. సంస్థ విజయాలను ప్రస్తావిస్తూ 95 మంది టాప్ ఎన్ఐటీల్లో, 115 మంది ఎంబీబీఎస్, బీడీఎస్, అగ్రికల్చర్ కోర్సుల్లో, 305 మంది టాప్ ఇంజినీరింగ్ కళాశాలలు, డీమ్డ్ యూనివర్సిటీల్లో సీట్లు సాధించారని, కొందరు సీఏ ఫౌండేషన్, ఒకరు సీఎస్ కోర్సు పూర్తి చేశారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వివరాలు నవంబర్ 1 లేదా అంతకుముందే తెలియజేస్తామని చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి లేదా https://forms.gle/rVc2mTjFDDwrdYna లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 98485 87584, 99123 49038, 90009 93705, 98490 72929 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో స్కాలర్‌షిప్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

# ఐదు బంగారు పతకాలు సాధించిన రిటైర్డు సీజీఎం



**హైదరాబాద్, అక్టోబర్ 25:** జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్‌గా రిటైర్డ్ అయిన సోమ జగన్‌మోహన్ రెడ్డి (77) గుంటూరులో అక్టోబర్ 11, 12 తేదీల్లో జరిగిన 7వ నేషనల్ మాస్టర్స్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో ఐదు బంగారు పతకాలు సాధించారు. 75-79 ఏళ్ల వయో విభాగంలో పోటీ పడిన ఆయన 100 మీటర్ల ఫ్రీస్టైల్, 50 మీటర్ల ఫ్రీస్టైల్, 200 మీటర్ల ఫ్రీస్టైల్, 50 మీటర్ల బటర్‌ఫ్లై, ఫ్రీస్టైల్ రిలే విభాగాల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి టాప్ స్థానం దక్కించుకున్నారు. ఈ విశిష్ట విజయాన్ని అభినందిస్తూ జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ స్వయంగా ఆయనను సన్మానించారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రతిభ, క్రమశిక్షణ, క్రీడాభివృద్ధి పట్ల అంకితభావం సిబ్బందికి ప్రేరణగా నిలుస్తుందని ఎండీ కొనియాడారు. బోర్డు స్థాపన నాటి నుంచి సేవలందించిన ఆయన డిప్యూటీ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్, చీఫ్ జనరల్ మేనేజర్, సీజీఎం (ఇంజినీరింగ్ ట్రాన్స్‌మిషన్) హోదాల్లో విధులు నిర్వహించి 31-08-2006న పదవీ విరమణ చేశారు.

# రక్షణపై నిర్లక్ష్యం చేస్తున్న 11వ గని అధికారులపై చర్యలు తీసుకోవాలి

**టీబీజీకేస్ అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి**



**గోదావరిఖని, జనంసాక్షి :** ఒకే కుటుంబం.. ఒకే లక్ష్యం ..ఒకే గమ్యం.. అని మేనేజ్మెంట్ చెప్తూనే ఆచరణ లో కార్మికులను ఇబ్బంది పెట్టి.. చిత్రహింసల గురి చేస్తున్నారని టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. శనివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేధించే పరిస్థితులు మేనేజ్మెంట్ చేస్తుందన్నారు. ఈ చర్యలను 11వ గని కార్మికులు వ్యతిరేకించాలన్నారు. ఉత్పత్తి అంటే రక్షణతో కూడిందనే అంశాన్ని మొదలుకొని..అక్కడున్నటువంటి పరికరాల కు సంబంధించి..సప్లై చేయాల్సింది పోయి వేధింపులకు గురి చేస్తుందని అన్నారు.కార్మిక వర్గానికి సంబంధించిన ఉత్పత్తిని ప్రామాణికంగా పెట్టుకొని మేనేజ్మెంట్ వ్యవహరిస్తుందన్నారు.పనులకు కావలసిన పరికరాలను అందించకుండా లేదా పని స్థలాల్లో గాలి సరిగా ఇవ్వకుండా అక్కడ అనేకమంది అనేక రకాల జిగ్గుల్లో కూడా కింద పడిపోయినటువంటి పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ విషయంలో కార్మికులు గగ్గోలు పెడుతున్నారన్నారు. గరిమిలో పనిచేయలేని పరిస్థితి ఉన్నదన్నారు. ఉత్పత్తిని ఎట్లా తీస్తామని కార్మికులంతా బాధపడుతున్నారన్నారు. వెంటనే అక్కడ గాలి సప్లై చేసి కార్మికులకు నష్టం జరగకుండా.. అనారోగ్య ఆరోగ్యాల పరిస్థితులను చూసి ఉత్పత్తి తీసే విధానాన్ని ఎంచుకోవాల్సింది పోయి ఇబ్బంది పెట్టరాదు అన్నారు.ప్రశ్నిస్తే వాళ్లకు సంబంధించిన బాధలు చెప్తే వాళ్ళను ఇబ్బంది పెట్టేటువంటి పరిస్థితి ఉన్నదన్నారు. కార్మిక వర్గం టిబిజికెస్ తరపున వ్యతిరేకిస్తుందన్నారు. విలేకరుల సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి మాట్లాడుతూ మేనేజ్మెంట్ కార్మికులను మంచి వాతావరణంలో పనిచేయించాల్సింది పోయి ఇన్ఫార్మర్లను పెట్టుకొని వేధిస్తున్నారన్నారు. ఈ ఇన్ఫర్మేషన్ పెట్టుకునే పరిస్థితిని వెంటనే మానుకోవాలని,గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘమైన ఐ ఎన్టియుసి యాజమాన్యం పక్షాన చేరి కార్మికులను ఇబ్బందుల గురి చేస్తుందని విమర్శించారు.ఇలా కార్మిక వర్గానికి సంబంధించిన దాన్ని సేవ చేసే విధంగా ఉండాల్సింది పోయి కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్నారు. అధికారులను చూస్తే పోలీసులను చూసినట్టు భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. పాత దొరపోకడలను పాటిస్తూ అధికారులు వ్యవహరిస్తున్నారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమరయ్య మాట్లాడుతూ ప్రమోషన్లలో కార్మికులకు అన్యాయం చేస్తూ యాక్టింగ్‌లు చేసే కార్మికులకు సంబంధిత అలవెన్సు చెల్లించకుండా అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఉత్పత్తి తీసే అటువంటి కార్మికునికి రహదారి సౌకర్యం సరిగా లేదు .పాత రోడ్డుకి సంబంధించిన టువంటి సందర్భంలో ఆక్సిడెంట్లు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.

దానిని మేనేజ్మెంట్ దృష్టికి తీసుకు వచ్చినప్పటికీ దాని మరమ్మత్తు పనిని కొనసాగించకుండా వాయిదా వేయిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఏదైతే రక్షణ అంటూ రక్షించకుండా ఉత్పత్తిని ప్రామాణికంగా పెట్టుకొని కార్మికులను భయభ్రాంతులను చేసి లాంగ్ స్టాండింగ్ లో ఉండి అక్కడే స్థిరంగా స్థిర నివాసం ఏర్పరచుకోని ఉంటున్న మేనేజర్ చర్యలను వ్యతిరేకిస్తున్నాం వెంటనే సంబంధిత అధికారిని ట్రాన్స్ఫర్ చేయాలి అని డిమాండ్ చేస్తున్నాం. కార్మికులను వేధింపులకు గురిచేసె చర్యలను మానుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు.సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమరయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి,కోశాధికారి చెల్పూరి సతీష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు పోలాడి శ్రీనివాసరావు, చల్ల రవీందర్ రెడ్డి, నాయకులు వాసర్ల జోసెఫ్, పల్లె సురేందర్, రెహమాన్, మీస రాజు, పులిపాక శంకర్, రాసమల్ల సందీప్, ఎండి సలీం, తోట తిరుపతి పాల్గొన్నారు.

# 86 కోట్ల విలువైన భూమికి హైడ్రా రక్ష

- కొండాపూర్ లో 4300 గజాల స్థలం చుట్టూ ఫెన్సింగ్
- ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు
- మచ్చబొల్లారంలోనూ ఓ పార్కును హైడ్రా





**శేరిలింగంపల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండపూర్లో మరో పెద్ద భూకబ్జాను హైడ్రా అడ్డుకుంది. దాదాపు రూ.86 కోట్ల విలువైన భూమిని కాపాడింది. శుక్రవారం రాఘవేంద్ర కాలనీలో 2000 గజాల పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా, ఆ దగ్గరలోనే ప్రజావసరాలకు ఉద్దేశించిన 4300 గజాల స్థలాన్ని శనివారం కాపాడింది.
కొండపూర్, రాజరాజేశ్వరి నగరంలోని ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ వెల్ఫేర్ సొసైటీలో 4300 గజాల స్థలానికి కబ్జాల చెర నుంచి విముక్తి హైడ్రా విముక్తి కల్పించింది. 1978లో వేసిన గ్రామ పంచాయతీ లేఅవుట్‌లో మొత్తం 350 ప్లాట్లు ఉన్నాయి. ఇక్కడ పాఠశాల భవనంతో పాటు ఇతర ప్రజావసరాల కోసం 4300 గజాల స్థలాన్ని అప్పట్లో లేఅవుట్ చేసిన చింతల పోచయ్య, ఆయన కుటుంబ సభ్యులు చూపించారు. అదే స్థలాన్ని లేఔట్ వేసిన పోచయ్యతో పాటు ఆయన కుటుంబ సభ్యుడు చింతల రాజు 3 భాగాలుగా విడదీసి లావాదేవీలు నిర్వహించడంలో కొళ్ల మాధవ రెడ్డి హస్తం ఉందని తప్పుడు డాక్యుమెంట్లతో అమ్మకాలు చేశారంటూ వాపోయారు. కొళ్ల మాధవరెడ్డి కుమారుడు ఒక భాగాన్ని కొనగా.. చింతల పోచయ్య, చింతల రాజు పేరిట మీద రెండు భాగాలు ఉన్నట్టు డాక్యుమెంట్లు సృష్టించారు. ఈ మూడు భాగాల్లో కొళ్ల మాధవరెడ్డి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కుదుర్చుకుని దందా నడుపుతున్నారు.
ఇదే విషయాన్ని కాలనీ ప్రతినిధులు జీహెచ్ఎంసీకి గతంలో ఫిర్యాదులు చేశారు. ఎలాంటి చర్యలు తీసుకేదని వాపోయారు. దీంతో హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు సంబంధిత అధికారులతో హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఆక్రమణలు నిజమే అని నిర్ధారించుకున్నాక హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు శనివారం అక్కడ ఆక్రమణలను తొలగించింది. 4300 గజాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది. అలాగే అక్కడ భూమిని అమ్మిన పోచయ్య, రాజుతో పాటు స్థలాన్ని కొన్న కొళ్ల మాధవరెడ్డి తో పాటు అతని కుమారుడిపైన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో క్రిమినల్ కేసులను నమోదు చేశారు.

**పార్కు కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదు**

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం మచ్చబొల్లారంలోని ఓ పార్కును హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 164లో శ్రీ సాయి సూర్య ఫేజ్-2 లో పార్కు కోసం దాదాపు 520 గజాల స్థలాన్ని అప్పట్లో కేటాయించారు. 1972లో వేసిన ఈ లే ఔట్‌లో పార్కు కోసం కేటాయించిన ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని, పార్కు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని శ్రీ సాయి సూర్య కాలనీ నివాసితులు హైడ్రాకు గురువారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు శుక్రవారం క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో హైడ్రా విచారణ పూర్తి చేసింది. శనివారం ఉదయం పార్కు చుట్టూ ఫెన్సింగ్ వేశారు. దీంతో శ్రీ సాయి సూర్య కాలనీ నివాసితులు సంబరాలు చేసుకున్నారు. దశాబ్దాలుగా పార్కు అభివృద్ధిని అడ్డుకున్న వారి చెర నుంచి పార్కును విడిపించిన హైడ్రా అధికారులను అభినందించారు.

# షాద్‌నగర్ వైద్యురాలి తీరుపై విచారణ

- రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు ఫిర్యాదుతో చర్యలు
- బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకున్న అధికారుల బృందం
- సర్కారు ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు అందించాలని సత్యనారాయణ ఆందోళన





**షాద్‌నగర్, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** బస్సు దిగుతూ కిందపడి గాయపడ్డ లావణ్యకు చికిత్స అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన షాద్‌నగర్ ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు డాక్టర్ సుప్రజా తీరుపై విచారణ ప్రారంభమైంది. లావణ్య సోదరుడు మిద్దెల సత్యనారాయణ, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు కమిటీ సభ్యులు రంగారెడ్డి జిల్లా (డీసీఎచ్ఎస్)డాక్టర్ అనురాగిని రెడ్డి షాద్‌నగర్ ఆసుపత్రికి వచ్చి డాక్టర్ సుప్రజాపై వచ్చిన ఫిర్యాదులపై సత్యనారాయణ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తలకు బలమైన గాయాలై, వాంతులు చేసుకుంటున్న బాధితురాలిని పట్టించుకోకుండా డాక్టర్ సుప్రజా ఫోన్లు మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని, అసలు సమస్యే లేదని బాధిత కుటుంబ సభ్యులపై దురుసుగా ప్రవర్తించారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తేనే అత్యవసర సర్జరీ చేసి లావణ్యను బతికించారని, అయినప్పటికీ ప్రస్తుతం ఆమె మాటలు రావడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

**పేదల ఆరోగ్యాలంటే అలుసా..?**

పేద ప్రజలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాసుపత్రి వైద్యులపై ఉన్నతస్థాయి అధికారులు కఠిన చర్యలు తీసుకోవా లని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదల కోసం మెరుగైన సౌకర్యాల తో కూడిన వైద్యం అందించాలని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట లావణ్య సోదరుడు, జర్నలిస్ట్ మిద్దెల సత్యనారాయణ ఆందోళనకు దిగాడు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఒకవైపు ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులు విచ్చలవిడిగా వెలుస్తున్న తరుణంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రం మెరుగైన సౌకర్యాలు కనిపించడం లేదని అన్నారు. సర్కారు దవాఖానాకు వచ్చే అమాయకులకు నిరాశే ఎదురవుతోందని, ప్రభుత్వం స్పందించి మెరుగైన సౌకర్యాలతో కూడిన వైద్యం అందించాలని సందర్భంగా సత్యనారాయణ డిమాండ్ చేశారు.

# ఆఖరి వన్డేలో భారత్ ఘన విజయం

## టీమ్ఇండియా ఆల్‌రౌండ్ ప్రదర్శన

- 38.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన భారత్
- హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ బ్యాట్‌తో విధ్వంసం
- కోహ్లీ అద్భుతమైన హాఫ్ సెంచరీ నమోదు



ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌ను భారత్ విజయంతో ముగించింది. సిడ్నీ వేదికగా శనివారం జరిగిన మూడో వన్డేలో టీమ్ఇండియా ఆల్?రౌండ్ ప్రదర్శనతో ఘన విజయం సాధించింది. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ (121), విరాట్ కోహ్లీ (74) చెలరేగడంతో 237 పరుగుల లక్ష్యాన్ని భారత్ 38.3 ఓవర్లలోనే ఛేదించింది. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్?వుడ్ 1 వికెట్ దక్కించుకున్నాడు. సెంచరీతో కదం తొక్కిన రోహిత్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. 237 లక్ష్య ఛేదనను రోహిత్- గిల్? ధాటిగానే ఆరంభించారు. కెప్టెన్ శుభ్?మన్ గిల్ (24), రోహిత్ బౌండరీలు బాదడంతో జట్టు స్కోర్ 10 ఓవర్లకు 60 దాటింది. ఈ దశలో గిల్?ను హేజిల్?వుడ్ ఔట్ చేశారు. ఆ తర్వాత ఆసీస్?కు మరో వికెట్ దక్కలేదు. విరాట్ కోహ్లీతో రోహిత్ చాలా రోజుల తర్వాత భారీ పార్ట్?నర్‌షిప్ నిర్మించాడు. ఈ ఇద్దరూ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తు స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలోనే రోహిత్ సెంచరీ, విరాట్ హాఫ్ సెంచరీ పూర్తి చేశారు.వన్డేల్లో హిట్?మ్యాన్?కు ఇది 33వ శతకం కావడం విశేషం. అటు విరాట్?కు ఇది 75వ వన్డే హాఫ్ సెంచరీ. సెంచరీ తర్వాత రోహిత్ స్పీడ్ పెంచాడు. మ్యాథ్యూ షార్ట్ వేసిన 38వ ఓవర్లో రోహిత్ సిక్స్, ఫోర్ బాదగా, ఆ తర్వాతి ఓవర్లో విరాట్ బౌండరీ కొట్టి మ్యాచ్?ను ముగించాడు. రో- కో జోడీ ఈ ఇన్నింగ్స్‌తో అభిమానులకు ట్రీట్ ఇచ్చింది. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 169 బంతుల్లో 168 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.
ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆసీస్ 46.4 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌటైంది. మ్యాట్ రేన్‌షా(58 బంతుల్లో 2 ఫోర్లతో 56) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిచెల్ మార్ష్(41), మాథ్యూ షార్ట్(30) విలువైన ఇన్నింగ్స్ ఆడారు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా(4/39) నాలుగు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ తీసారు. వాషింగ్టన్ సుందర్(2/44) రెండు వికెట్లు పడగొట్టాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు ఆసీస్‌కు ఓపెనర్లు ట్రావిస్ హెడ్(29), మిచెల్ మార్ష్(41) శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించిన అనంతరం సిరాజ్ బౌలింగ్‌లో ట్రావిస్ హెడ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో తొలి పవర్ ప్లేలో ఆసీస్ వికెట్ నష్టానికి 63 పరుగులు చేసింది. అనంతరం మాథ్యూ షార్ట్‌తో కలిసి మిచెల్ మార్ష్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశాడు. కానీ హాఫ్ సెంచరీకి చేరువైన అతన్ని అక్షర్ పటేల్ క్లీన్ బౌల్డ్ చేసి పెవిలియన్ చేర్చాడు. ఆ కాసేపటికే మాథ్యూ షార్ట్(30)ను వాషింగ్టన్ సుందర్ ఔట్ చేయగా.. అలెక్స్ క్యారీ(24)ని శ్రేయస్ అయ్యర్ స్టన్నింగ్ క్యాచ్‌తో హర్షిత్ రాణా ఔట్ చేశాడు. ఈ క్యాచ్ అందుకునే క్రమంలో అయ్యర్ పక్కటెముకలకు తీవ్ర గాయమైంది. ఓవైపు వికెట్లు పడినా మరోవైపు మ్యాట్ రేన్‌షా 48 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతన్ని వాషింగ్టన్ సుందర్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. ఆ వెంటనే మిచెల్ ఓవెన్‌ను హర్షిత్ రాణా ఔట్ చేయగా.. మిచెల్ స్టార్క్‌ను కుల్దీప్ యాదవ్ క్లీన్ బౌల్డ్ చేశాడు. నాథన్ ఎల్లిస్(16)ను ప్రసిధ్ కృష్ణ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆడమ్ జంపాతో కలిసి కూపర్ కాన్లీ కాసేపు పోరాడాడు. ప్రసిధ్ కృష్ణ బౌలింగ్‌లో బౌండరీలు రాబట్టాడు. అతనితో పాటు జోష్ హాజెల్ వుడ్(0)ను ఔట్ చేసిన హర్షిత్ రాణా ఆసీస్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. అనంతరం భారత్ 38.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 232 పరుగులు 69 బంతులు మిగిలి ఉండగానే సునాయస విజయాన్నందుకుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(24) మరోసారి విఫలమవ్వగా.. ఆసీస్ బౌలర్లలో జోష్ హాజెల్ వుడ్ ఒక వికెట్ పడగొట్టాడు. సెంచరీతో చెలరేగిన రోహిత్ శర్మ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ లభించింది. బుధవారం నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. 237 పరుగుల స్వల్ప లక్ష్యఛేధనలో టీమిండియాకు శుభారంభం దక్కింది. శుభ్‌మన్ గిల్(24) త్వరగానే ఔటైనా... తొలి వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యం లభించింది. క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీతో కలిసి రోహిత్ శర్మ చెలరేగాడు. 63 బంతుల్లో రోహిత్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. విరాట్ కోహ్లీ తనదైన శైలిలో చెలరేగాడు. 56 బంతుల్లో కోహ్లీ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. రోహిత్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. 105 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 105 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఇద్దరూ కలిసి రెండో వికెట్‌కు 168 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు.

*భారత స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్? కోహ్లీ ఆస్ట్రేలియాతో మూడో వన్డేలో అరుదైన రికార్డులు సాధించారు. వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన రెండో బ్యాటర్‌గా కింగ్ కోహ్లీ రికార్డు నెలకొల్పాడు. మరోవైపు సెంచరీతో అదరగొట్టిన రోహిత్ శర్మ తన కెరీర్‌లో 50 అంతర్జాతీయ శతకాలు పూర్తి చేశాడు. దీంతో ఆస్ట్రేలియా నిర్దేశించిన 238 పరుగుల లక్ష్యాన్ని భారత్ ఈజీగా ఛేదించింది. ఈ క్రమంలోనే కోహ్లీ-రోహిత్ శర్మ అనేక రికార్డులు తమ బద్దలుకొట్టారు. సెంచరీతో అదరగొట్టిన రోహిత్ శర్మకు ఓవరాల్‌గా ఇది 50వ శతకం. వన్డేల్లో అతడికిది 33వ సెంచరీ. ఈ క్రమంలోనే భారత్ తరపున ఇంటర్నేషనల్ కెరీర్‌లో అత్యధిక సెంచరీలు బాదిన మూడో బ్యాటర్‌గా నిలిచాడు. అతడి కంటే ముందు సచిన తెందూల్కర్ (100), కోహ్లీ (82) ఉన్నారు.*

### ఆసీస్‌పై వన్డేల్లో రోహిత్ 33వ సెంచరీ

ఆస్ట్రేలియాతో సిడ్నీ వేదికగా జరిగిన మూడో వన్డేలో టీమిండియా మాజీ కెప్టెన్ హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. 237 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రోహిత్ శర్మ అద్భుతమైన, మ్యాచ్ విన్నింగ్ సెంచరీ నమోదు చేశాడు. ఈ సెంచరీతో వన్డే క్రికెట్‌లో తన 33వ సెంచరీ పూర్తి చేసుకున్న రోహిత్, అంతర్జాతీయ క్రికెట్‌లో మొత్తం 50 సెంచరీల మైలురాయిని చేరుకోవడం విశేషం. అతని మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్ విజయం దిశగా సునాయాసంగా దూసుకెళ్లింది. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా సిడ్నీ వేదికగా జరిగిన మూడో వన్డేలో రోహిత్ శర్మ అద్భుత ప్రదర్శన చేశాడు. ఆసీస్ నిర్దేశించిన 237 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, హిట్‌మ్యాన్ టీమ్ ఇండియాకు బలమైన పునాది వేశాడు. ఈ మ్యాచ్‌లో అతను 105బంతుల్లో మెరుపు సెంచరీ నమోదు చేశాడు. రోహిత్ శర్మ తన ఇన్నింగ్స్‌లో 11 బౌండరీలు, 2 భారీ సిక్సర్లు కొట్టాడు. అతని మ్యాచ్ విన్నింగ్ సెంచరీ కారణంగా భారత జట్టు విజయం దిశగా సునాయాసంగా పయనించింది. ఈ సెంచరీతో రోహిత్ శర్మ ఒక అరుదైన ఘనతను అందుకున్నాడు. ఇది వన్డే క్రికెట్‌లో రోహిత్ శర్మకు 33వ సెంచరీ. అంతర్జాతీయ క్రికెట్ ఫార్మాట్లలో (టెస్ట్, వన్డే,) కలిపి రోహిత్ ఖాతాలో ఇప్పుడు మొత్తం 50 సెంచరీలు నమోదయ్యాయి. భారత్ తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు బాదిన బ్యాట్స్‌మెన్లలో రోహిత్ శర్మ ఒకడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 50 సెంచరీల మైలురాయిని చేరుకోవడం ద్వారా రోహిత్ శర్మ.. సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ వంటి భారత దిగ్గజాల సరసన చేరాడు.



### దేవాదాయశాఖ కమిషనర్ కలిసిన ఆలయ ఈవో

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 25 (జనంసాక్షి) :** దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన ఎస్. హరీష్ ను శనివారం రాజన్న ఆలయ ఈఓ రమాదేవి హైదరాబాద్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాజన్న ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనలు అందజేయాగ, ఆలయ ఈవో స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదలు అందజేశారు.

### "సమష్టి ప్రదర్శనతోనే విజయం

**టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్**

సమష్టి ప్రదర్శనతోనే ఆస్ట్రేలియాతో ఆఖరి వన్డేలో విజయం సాధించామని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. ఇది పర్‌ఫెక్ట్ గేమ్ అని, కెప్టెన్‌గా ఈ విజయం తనకు ప్రత్యేకమైనదని తెలిపాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా శనివారం జరిగిన ఆఖరి వన్డేలో భారత్ 9 వికెట్ల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది.టీమిండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ(125 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లతో 121 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. విరాట్ కోహ్లీ(81 బంతుల్లో 7 ఫోర్లతో 74 నాటౌట్) అజేయ అర్ధశతకంతో రాణించాడు. ఈ ఇద్దరి సూపర్ బ్యాటింగ్‌తో టీమిండియా చిరస్మరణీయ విజయాన్నందుకుంది. ఆఖరి మ్యాచ్‌లో ఓడినా ఆసీస్ 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది.ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన శుభ్‌మన్ గిల్.. సంతోషం వ్యక్తం చేశాడు.

### బీసీసీఐ ఆదేశాన్ని ధిక్కరించిన సర్ఫరాజ్

**ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ విషయంలో భారత క్రికెట్ వర్గాల్లో గందరగోళం నెలకొంది. సౌతాఫ్రికా 'ఏ' జట్టుతో జరగనున్న అనధికార టెస్ట్ సిరీస్‌కు సర్ఫరాజ్ ఖాన్‌ను సెలెక్టర్లు ఆశ్చర్యకరంగా పక్కన పెట్టారు. అంతేకాకుండా జాతీయ జట్టులో స్థానం దక్కాలంటే ముంబై జట్టులో అతను తన కామన్ ప్లేస్ (నం. 5) కంటే పై స్థానంలో బ్యాటింగ్ చేయాలని బీసీసీఐ సూచించినట్లు సమాచారం. అయితే, ముంబై కెప్టెన్ శార్దూల్ ఠాకూర్ ఈ సూచనను దాదాపు గా తోసిపుచ్చారు. తమ బ్యాటింగ్ ఆర్డర్ పటిష్ట ంగా ఉందని, మార్పు అవసరం లేదని స్పష్టం చేశారు. దీంతో సర్ఫరాజ్ ఖాన్ భవిష్యత్ సెలక్షన్ల కోసం ముంబై జట్టులో ఏ స్థానంలో బ్యాటింగ్ చేయాలనే దానిపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది.**

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
26 అక్టోబర్ 2025

# హ్యామ్ టెండర్లలో 8వేల కోట్ల కుంభకోణం

- దీనిపై ఇక నిత్యం పోరాడుతూనే ఉంటాం
- అవినీతిలో మునిగితేలులుతున్న మంత్రులు
- మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి విమర్శలు




**హైదరాబాద్, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** ఇందిరమ్మ రాజ్యంలో రోజుకో అవినీతి, పూటకో కుంభకోణం బయటపడుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. ఓ పని టెండర్‌కు సంబంధించి మంత్రుల మధ్య వివాదం తలెత్తితే సీఎం ఇద్దరినీ కూర్చో బెట్టి వాటాలు పంచారని ధ్వజమెత్తారు. డెక్కన్ సిమెంట్స్ కంపెనీ వారిని గన్ పెట్టి బెదిరించారని, ఇందులో సీఎం పాత్ర ఉందని మంత్రి కూతురే ఆరోపించారన్నారు. ముఖ్యమంత్రి, సీఎం పేషీ మీద వచ్చిన ఆరోపణలు ప్రజలకు తెలుసునని చెప్పారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, డాక్టర్ కే. సంజయ్, పార్టీ నేతలు ఆయాచితం శ్రీధర్, కే. కిషోర్ గౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మద్యం సీసాల హోలోగ్రాం కుంభకోణంలో సీఎం, మంత్రి మధ్య తలెత్తిన వివాదంలో అధికారిని బలి చేశారని మండిపడ్డారు. అవినీతి, ముడుపుల మీద మంత్రులు రోజూ కొట్లాడుకుంటున్నారని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యమంటే కుంభకోణాల నిలయం, అవినీతి మయంగా మారిందన్నారు. తెలంగాణలో రోడ్లకు మహర్దశ అని మంత్రులు అంటున్నారని, రూ.27 వేల కోట్లతో రోడ్లు వేయబోతున్నామని మంత్రులు చెప్పారని, ఇందులో వేల కోట్ల కుంభకోణం ఉందని ఆరోపించారు. హ్యామ్ కాదు.. అది ఒక పెద్ద స్కామ్ అని, రోడ్డు బాగుచేసే ముసుగులో దోపిడీకి రంగం సిద్ధమైందన్నారు. హైబ్రిడ్ అన్యుటీ మోడ్ (హ్యామ్) టెండర్లలో రూ.8 వేల కోట్ల కుంభకోణం జరిగింది. హ్యామ్‌లో కిలోమీటర్‌కు 85 శాతం అంచనా వ్యయం పెంచారు. రూ.9 వేల కోట్లతో పూర్తయ్యే రోడ్లకు రూ.17 వేల కోట్లకు టెండర్లు పిలిచారు. ఇందులో రూ.8 వేల కోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం లూటీ చేస్తున్నది. సీఆర్ఎఫ్ కింద కిలోమీటర్‌కు రూ.కోటి 75 లక్షలు ఖర్చు అవుతుంది. హ్యామ్ కింద ఇచ్చిన టెండర్లలో కిలోమీటర్‌కు రూ.3కోట్ల 30 లక్షల వ్యయం అవుతుంది. సీఆర్ఎఫ్ కింద ఇచ్చిన రోడ్ల పనుల టెండర్ల జీవో, హ్యామ్ జీవో కేవలం పది రోజుల తేడాలో వచ్చాయి. సీఆర్ఎఫ్ కింద ఇచ్చిన జీవోలో కిలో మీటర్‌కు ఓ రేటు, హామ్ జీవోలో మరో రేటు ఎలా ఉంటుంది. హ్యామ్ రోడ్ల టెండర్లు దక్కించుకున్న వారికి 10 శాతం మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ రూ.17 వేల కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్సులు ఎవరి జేబుల్లోకి వెళ్తాయో అందరికీ తెలుసు. హ్యామ్ కింద కిలోమీటర్ రోడ్డుకు మెయింటెనెన్సుకు మరో రూ.2.5 కోట్లు కేటాయిస్తున్నారు. అంటే కిలోమీటర్ రోడ్డుకు హామ్ కింద రూ.6 కోట్లు ఖర్చవుతుంది. హ్యామ్‌లో 40 శాతం ప్రభుత్వం, 60 శాతం ప్రైవేటు సంస్థలు భరిస్తాయని అంటున్నారు. ప్రైవేటు సంస్థలు బ్యాంకుల నుంచి తెచ్చే అప్పులకు ప్రభుత్వమే వడ్డీ కట్టాల్సి ఉంటుందని తెలిపారు.

# మెగా జాబ్ మేళా విజయవంతం

- దేశంలో అరుదైన కార్యక్రమం : తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





**హుజూర్ నగర్, అక్టోబర్ 25 (జనంసాక్షి):** హుజూర్ నగర్ జాబ్ మేళా భారతదేశంలోనే అరుదైన కార్యక్రమం అని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సుమారు 275 కంపెనీలు హుజూర్ నగర్ కు వచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే పేరుపొందిన కంపెనీలు ఈ జాబ్ మేళాకు హాజరయ్యాయని తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్‌లో మెగా జాబ్ మేళా ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మెగా జాబ్ మేళాకు రావాల్సిందిగా తాను స్వయంగా కంపెనీల ప్రతినిధులతో మాట్లాడటం జరిగిందని, ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విస్తృత ప్రచారం కల్పించామని, అందుకు తగ్గట్టుగానే భారీ స్పందన వచ్చిందని, ఇందుకు సహకరించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న విషయం పై ప్రత్యేక శ్రద్ధ వహించిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని పోస్టులు నింపాలనే దృఢ సంకల్పంతో ఉన్నారని, అందులో భాగంగానే పబ్లిక్ అండర్ టేకింగ్స్ లో రాష్ట్ర వ్యాప్తంగా 20 నెలల కాలంలో 75000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే, ఈ జాబ్ మేళా ద్వారా ప్రైవేట్ రంగంలో సైతం పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో జాబ్ మేళా నిర్వహించామని తెలిపారు. 275 కంపెనీలు, 40 వేల మందికి ఇంటర్వ్యూలు నిర్వహించడం చాలా గొప్ప విషయమని, తమ ప్రభుత్వం ప్రైవేటు ద్వారా ఉద్యోగాలు కల్పించేందుకు చేస్తున్న కృషికి ఇది నిదర్శనమని అన్నారు. ఇంటర్వ్యూలకు హాజరైన వారు ఉద్యోగాల్లో చేరేవరకు తాము నిరంతరం పర్యవేక్షిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సర్వోత్తమ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### మెగా జాబ్ మేళాలో 3041 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపిక

హుజూర్ నగర్ లో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలకై ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న 40 వేల మంది అభ్యర్థులలో 20,463 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారని, అందులో 3041 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన హుజూర్ నగర్ లోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ మెగా జాబ్ మేళాకు ఆన్లైన్ ద్వారా 40 వేల మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, అయా విభాగాల వారిగా ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను తెలిపారు. ఐటీ ,ఎడ్యు టెక్నాలజీ, స్కిల్స్ ట్రైనింగ్ విభాగంలో ఇంటర్వ్యూలకు 5,547 మంది అభ్యర్థులు హాజరు కాగా, 827 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని, మరో 370 మంది అభ్యర్థుల ఉన్నత అర్హతల ఆధారంగా షార్ట్ లిస్ట్ జాబితాను రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో గ్రంధాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, చింతల లక్ష్మీనారాయణ రెడ్డి, తన్నీర్ మల్లిఖార్జున్, దొంగరి వెంకటేశ్వర్లు, కొత్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సీపీ సజ్జన్నార్ ఫోటోతో సైబర్ మోసాలు

**హైదరాబాద్, అక్టోబరు 25 (జనంసాక్షి) :** హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఫొటోలతో నేరగాళ్లు సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. వాట్సప్‌లో సజ్జనార్ ఫొటో డీపీగా పెట్టుకొని సందేశాలు పంపుతున్నారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో ఆయన స్పందించారు. ముఖం చూసి మోసపోవద్దంటూ జాగ్రత్తలు చెప్పారు. వాట్సప్‌లో డీపీగా నా ఫొటోపెట్టి, తెలిసిన వాళ్లకు సందేశాలు పంపుతున్నారు. ఇవి నకిలీ ఖాతాలు, పూర్తిగా మోసపూరితమైనవి. ఇలాంటి సందేశాలకు స్పందించవద్దు. ఆ నెంబర్లను బ్లాక్ చేసి రిపోర్టు చేయండి. సైబర్ నేరగాళ్లకు మీ వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దు. డబ్బులు అడిగితే పంపొద్దని సజ్జనార్ పేర్కొన్నారు. నకిలీ వాట్సప్ ఖాతాల గురించి 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

# ఔటర్ వద్ద బోల్తా పడ్డ ట్రావెల్స్ బస్సు

**హైదరాబాద్, అక్టోబరు25 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో మరో ప్రైవేట్ బస్సు బోల్తా పడింది. పెద్ద అంబర్‌పేట్ ఔటర్ రింగ్ రోడ్డు దగ్గర ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడగా, ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తుంది. మియాపూర్ నుంచి గుంటూరు వెళ్తుండగా నియో గో ట్రావెల్స్ బస్సు ఔటర్ రింగ్ రోడ్డుపై నుంచి సర్వీస్ రోడ్డుపై నుంచి కిందకు దిగుతుండగా బోల్తా పడింది. అయితే, పతాన్‌చెరువు దగ్గర ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కి, పెద్ద అంబర్‌పేట్ వద్ద కిందికి దిగుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఇక, ఈ ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, స్థానికులు, ఔటర్ రింగ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులను సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.

# చిరు అనుమతి లేకుండా ఫోటోలు, పేర్లు వాడరాదు

- హైదరాబాద్ సిటీసివిల్ కోర్టు ఉత్తర్వులు జారీ
- పోస్టులు, వీడియోలు క్రియేట్ చేసిన 30మందికి నోటీసులు

**హైదరాబాద్, అక్టోబరు 25 (జనంసాక్షి) :** అగ్ర కథానాయకుడు చిరంజీవి అనుమతి లేకుండా ఆయన పేరు, ఫొటో, వాయిస్‌లను వాడకూడదని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సామాజిక మాధ్యమాల వేదికగా తమ పేరు, ఫొటోలను దుర్వినియోగం చేస్తున్నారంటూ పలువురు అగ్ర నటులు న్యాయస్థానాలను ఆశ్రయి స్తున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఎఐ మార్ఫింగ్, వాయిస్ సింథసైజ్ ద్వారా ప్రతిష్ఠ దెబ్బతింటోందని నటీనటుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో చిరంజీవి హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, చిరంజీవికి అనుకూలంగా తీర్పుని చ్చింది. టీఆర్పీ, లాభాల కోసం చిరంజీవి పేరును దుర్విని యోగం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ఎట్టి పరిస్థితుల్లో చిరంజీవి పేరును వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగించవద్దని హెచ్చరించింది. మార్ఫింగ్ చేసిన డిజిటల్ వేదికలపై ఆంక్షలు విధించింది. ఇప్పటికే ఇలాంటి పోస్టులు, వీడియోలను క్రియేట్ చేసిన 30 మందికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచార ణను అక్టోబర్ 27కి వాయిదా వేసింది. తాజాగా హైదరాబాద్ సీపీ సజ్జనార్ కలిసిన ప్పుడు ఇదే విషయమై చిరంజీవి ఫిర్యాదు చేశారు. దీనిని సమర్థంగా అమలు లోకి తీసుకు రావడానికి న్యాయ నిపుణుల సలహాలు కోరారు. ఇటువంటి ఉల్లంఘన లను అరికట్టేం దుకు చట్టాలు మరింత కఠినంగా ఉండాల్సిన అవసరంపై ఇరువురు చర్చిం చారు. న్యాయస్థానంలో తనకు అనుకూలంగా తీర్పు రావడంలో కృషి చేసిన అడ్వకేట్ ఎస్.నాగేశ్ రెడ్డి, ఆయన బృందానికి చిరు ధన్యవాదాలు తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు.

# మృతి చెందిన వ్యక్తికి ట్రీట్మెంట్ పేరుతో రెండు లక్షలు వసూల్!

- హనుమకొండ మెడికోవర్ ప్రయివేట్ హాస్పిటల్‌లో ఘరానా మోసం




**హన్మకొండ ప్రతినిధి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** హనుమకొండ హంటర్ రోడ్‌లోని మెడికోవర్ ప్రైవేట్ ఆసుపత్రిలో మానవత్వం మరిచిపోయిన ఘటన అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది . మృతి చెందిన వ్యక్తికి "ట్రీట్మెంట్" చేస్తున్నామని చెప్పి కుటుంబ సభ్యుల నుంచి రెండు లక్షల రూపాయలు వసూలు చేసిన ఘటన పెద్ద దుమారమే రేపుతోంది. చెన్నారావుపేట మండలానికి చెందిన మహేష్ అనే యువకుడు నిన్న గడ్డి మందు తాగి ఆరోగ్యం విషమించడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన మెడికోవర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మహేష్ పరిస్థితి సీరియస్‌గా ఉందని చెప్పి చికిత్స పేరుతో భారీ మొత్తాన్ని వసూలు చేయడం ప్రారంభించారు. అయితే, కుటుంబ సభ్యుల ఆరోపణల ప్రకారం, మహేష్ నిన్ననే మృతి చెందినా, ఆ విషయం దాచిపెట్టి ఆసుపత్రి యాజమాన్యం నిన్న లక్ష రూపాయలు, శనివారం మరొక లక్ష రూపాయలు వసూలు చేసిందని తెలుస్తోంది. పరిస్థితి బయటకు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మృతదేహం ఇవ్వాలంటే మిగిలిన బకాయిలు చెల్లించాలని ఆసుపత్రి సిబ్బంది ఒత్తిడి తెస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై స్థానిక ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇటీవలి కాలంలో ఇదే మెడికోవర్ ఆసుపత్రిలో ఇలాంటి అనేక ఘటనలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, జిల్లా వైద్య శాఖ అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారు.? అని ప్రజలు ప్రశ్నిస్తు న్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల నియంత్రణపై అధికారుల నిర్లక్ష్యం బహిర్గతమవుతుండగా, ఈ ఘటనపై వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మూసాపేట గూడ్స్‌షెడ్‌లో అగ్నిప్రమాదం

- భారీగా దగ్ధమైన లిక్కర్ నిల్వలు



**హైదరాబాద్, అక్టోబర్25 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలోని మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇండియన్ కంటైనర్స్ కార్పొరేషన్ డిపోలో ఫైర్ యాక్సిడెంట్ జరిగింది. గోదాంలో నిల్వ ఉంచిన రసాయన విభాగంలో మంటలు ఎగిసిపడ్డాయి. కార్పొరేషన్ గోదాంలో ఉన్న లిక్కర్ నిల్వ ప్రాంతంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలానికి 6 ఫైర్ ఇంజన్లు చేరుకుని,నలువైపుల నుంచి మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నించారు. మంటల్లో పెద్ద ఎత్తున లిక్కర్ దగ్ధమైనట్లు అధికారులు గుర్తించారు. కోట్ల రూపాయల్లో ఆస్తి నష్టం వాటిలినట్టు గుర్తించారు. ఈ అగ్నిప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# మరోమారు స్వల్పంగా పెరిగిన బంగారం ధర

**హైదరాబాద్, అక్టోబర్25 (జనంసాక్షి) :** ఆల్ టైమ్ రికార్డ్ స్థాయిల నుంచి క్రమంగా దిగి వస్తున్న బంగారం ధర శనివారం ట్రేడింగ్‌లో స్వల్పంగా పెరిగింది. దీపావళి తర్వాత బంగారం ధర భారీగా తగ్గిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయంగా బంగారం ఔన్స్ ధర తగ్గడంతో దేశీయంగా కూడా పసిడి ధరలు క్రమంగా దిగివచ్చాయి. అయితే శనివారం ట్రేడింగ్‌లో మాత్రం బంగారం స్వల్ప పెరుగులను నమోదు చేసింది. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 25, 620కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే 125 రూపాయల మేర పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 15, 150కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే 115 రూపాయల మేర పెరుగుదల నమోదు చేసింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 25, 770కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 15, 300కి చేరుకుంది.

# బీహార్‌లో ఎన్నికల కోలాహలం

- మరోవైపు ఛత్ పూజా సందడి




**పాట్నా, అక్టోబరు25 (జనంసాక్షి) :** బీహార్‌లో ప్రస్తుతం ఓట్ల పండుగ జరుగుతోంది. తాజాగా ఓట్ల పండుగతో పాటు తరతరాలుగా ఆచారంగా వస్తున్న ఛత్ ఫెస్టివల్ కూడా వచ్చేసింది. దీంతో రాష్ట్రమంతటా సందడి.. సందడి వాతావరణం.. కోలాహలం కనిపిస్తోంది. నాలుగు రోజుల పాటు ఛత్ పండుగ జరగనుంది. శనివారం ప్రారంభం కావడంతో సందడి నెలకొంది. ఈ పండుగ కోసం రాష్ట్రం బయట ఎక్కడున్నా సరే సొంత గ్రామాలకు వచ్చేస్తారు. అంత ఉత్సాహంగా.. ఆనందంగా ఈ పండుగను జరుపుకుంటారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఛత్ పండుగ శుభాకాంక్షలు చెప్పారు. ఛత్ అనేది ఒక పురాతన ఇండో-నేపాల్ హిందూ పండుగ. తూర్పు భారతదేశం-దక్షిణ నేపాల్‌కు చెందిన పండుగ. ముఖ్యంగా భారతదేశంలోని బీహార్, జార్ఖండ్, తూర్పు ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ పండుగ జరుపుకుంటారు. అలాగే నేపాల్‌లోని కోషి, గండకి, బాగ్మతి, లుంబిని, మాధేష్ ప్రావిన్సుల్లో ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారు. విదేశాల్లో ఉన్న ప్రవాస భారతీయులు కూడా ఎంతో ఆనందంగా ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తారు. ఛత్ పండుగను దీపావళి తర్వాత 6 రోజులకు జరుపుకుంటారు. ఈ పండుగను 'సూర్య షష్టి వ్రతం'గా పిలుస్తారు. మూడు రాత్రులు-నాలుగు పగళ్లు ఆచరాలు పాటిస్తారు. ఎంతో భక్తితో ఉపవాసం ఉండి.. పవిత్ర స్నానం చేసి సూర్య నమస్కారాలు చేస్తారు. వ్యక్తిగత కోరికలు నెరవేర్చాలని కోరుతూ సూర్యుడికి ప్రార్థనలు చేస్తారు. అందుకే ఈ పండుగను 'సూర్య షష్టి వ్రతం'గా పిలుస్తారు. ఇక భక్తులంతా ఒకేలాటి ప్రసాదాలు, నైవేద్యాలు సిద్ధం చేసుకుంటారు. ఛత్ పండుగలో స్వచ్ఛత, భక్తి, సాంస్కృతి గొప్పతనాన్ని సూచిస్తాయి. ఛత్ పండుగ అనేది అత్యంత పర్యావరణ అనుకూల మత పరమైన పండుగుల్లో ఒకటిగా పర్యావరణవేత్తలు అభివర్ణిస్తారు. ఛత్ పూజను సూర్య దేవుడికి అంకితం చేస్తారు. ఛత్ మాతను కూడా పూజిస్తారు. పిల్లలకు అనారోగ్యాలు, వ్యాధుల నుంచి రక్షణ, దీర్ఘయుష్షుతో పాటు మంచి ఆరోగ్యం లభిస్తుందని ఈ పండుగ యొక్క ముఖ్య ఉద్దేశం. అక్టోబర్ 25 నుంచి 28 వరకు నాలుగు రోజుల పాటు చాలా భక్తితో నిర్వహిస్తారు. ఈ పండుగను మహిళలే కాకుండా.. పురుషులు కూడా ఎంతో భక్తిశ్రద్ధలతో చేపడతారు. ఉదయం సూర్య భగవానుని పూజించిన తర్వాత రాత్రిపూట ఛత్ పాటలు పాడతారు. అంతేకాకుండా వ్రత కథను చదువుతారు. ప్రతి రోజు ఉదయం 5-7 చెరుకు కర్రలను కలిపి ఒక మండపాన్ని ఏర్పాటు చేస్తారు. దాని కింద 12-24 దీపాలు వెలిగించి తేకువాతో పాటు సీజనల్‌లో వచ్చే పండ్లను సమర్పిస్తారు. మరుసటి రోజు ఉదయం 3-4 గంటల మధ్యే ఈ ఆచారాన్ని పూర్తి చేసేస్తారు. అనంతరం సూర్యుడు ఉదయించగానే సూర్య నమస్కారాలు చేసి వ్యక్తిగత కోరికలను తీర్చాలని ప్రార్థిస్తారు. అనంతరం నైవేద్యాలను అంకితం చేస్తారు. ప్రతి రోజున నది ఒడ్డునే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

# అయిజలో నకిలీ పురుగు మందులు తయారీ

- గుట్టురట్టు చేసిన పోలీసులు.. తయారీ కేంద్రంపై దాడి









**అయిజ/రాజోలి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** తినే తిండి కల్తీ.. తాగే పాలు కల్తీ.. చివరికి రైతు పంటను రక్షించే పురుగు మందును సైతం కల్తీ చేస్తున్న కేటుగాళ్ల గుట్టును పోలీసు అధికారులు రట్టు చేశారు. అయిజ మండలం పులికల్ గ్రామంలో నకిలీ నివారణ మందును తయారు చేస్తున్న దందాకు చెక్ పెట్టారు. అయిజ ఎస్ఐ శ్రీనివాస రావు తెలిపిన వివరాల ప్రకారం.. అయిజ మండలంలోని పులికల్ గ్రామానికి చెందిన వీరేష్ గత కొంతకాలంగా ఒక ఇంట్లో పంట మొక్కలకు వాడే పురుగుల నివారణ నకిలీ మందులను తయారు చేస్తూ 'సూపర్ సింబోలా మైక్రోన్యూట్రింట్ బ్రాండ్ కంపెనీ అంటూ రైతులకు వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాడు. ఎలాంటి అనుమతుల్లేకుండా ఈ వ్యవహారం కొనసాగిస్తుం డటం ఆలస్యంగా వెలుగుచూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం నకిలీ మందుల తయారీ కేంద్రంపై మండల వ్యవసాయాధికారి జనార్దన్ కలిసి పోలీసులు దాడి చేశారు. రూ. 4లక్షల 60 వేలు విలువైన నకిలీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు కల్తీ విత్తనాలు, నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# ఛత్తీస్‌ఘడ్‌లో ఇద్దరు యువకుల హత్య

- ఇన్‌ఫార్మర్ల ఆరోపణ నేపథ్యంలో ఘటన

**రాయ్‌పూర్, అక్టోబరు 25 (జనంసాక్షి) :** ఓవైపు లొంగుబాట్లు మరోవైపు, మావోల ఏరివేత జరగుతున్నా వారు తమ ఉనికి చాటుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. స్థానికుల్లో భయాందోళన సృష్టిస్తున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరి వ్యక్తులను మావోయిస్టులు దారుణంగా హత్య చేశారు. శుక్రవారం రాత్రి ఉసూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నేల కాంకేర్ గ్రామానికి చెందిన రవి కట్టం (25), తిరుపతి సోడి (38) లను ఎత్తుకెళ్లిన మావోయిస్టులు.. ప్రజాకోర్టు నిర్వహించి హత్య చేశారు. వీరు పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా పనిచేస్తున్నారని, అందుకే హతమార్చామని చెప్పారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మావోలు లొంగిపోవాలని, హింసకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

# నేడు తెలంగాణ మైనారిటీస్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కరీంనగర్ జనరల్ బాడీ సమావేశం

**కరీంనగర్ (జనంసాక్షి) :** తెలంగాణ మైనారిటీస్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కరీంనగర్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం అక్టోబర్ 26-10-25 ఉదయం 10.30 గంటలకు ఎంఎఫ్ కన్వెన్షన్, పెదపలి రోడ్ రిజ్వీ చమన్ కరీంనగర్ లో రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ రియాజ్ అలీ తెలంగాణ మైనారిటీస్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షతన నిర్వహించారు. తెలంగాణ మైనారిటీల గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ కౌసర్ ఫారూఖీ ఎన్నికల అధికారిగా విధులు నిర్వహిస్తారు. మైనారిటీలు, ముఖ్యంగా ముస్లిం, సిక్కు, క్రైస్తవ ప్రభుత్వాధికారులందరూ నిర్ణీత సమయంలో పాల్గొని సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని ముహమ్మద్ సిరాజ్, డీఈఈ ముహమద్ అబ్దుల్ అజీజ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ , జాయింట్ కన్వీనర్ టీఎంజీవో కరీంనగర్ ఒక ప్రకటనలో అభ్యర్థించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370